





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


సంక్షోభంలో రైతు – కాపాడుకునే చర్యలేవీ?

ధిక్కారమున్ సైతునా? : కెసిఆర్

సముద్రంలో రెండు పడవలు మునిగి 427 మంది రోహింగ్యాలు మృతి?

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 175 | ఆదివారం | 25-05-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ‘నైరుతి’ వచ్చేసింది



కేరళను తాకిన రుతుపవనాలు

ఎనిమిది రోజుల కంటే ముందుగానే దేశంలోకి ప్రవేశం

2009 తరువాత మళ్లీ ఇప్పుడే

**న్యూఢిల్లీ :** గత కొన్ని రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న దేశ ప్రజలకు శుభవార్త. దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళలో ప్రవేశించాయి. సాధారణం కంటే ఎనిమిది రోజుల ముందే ఈ రుతుపవనాలు దేశంలోకి వచ్చాయి. దీంతో 2009 తర్వాత భారత ప్రధాన భూభాగంలోకి రుతుపవనాలు ముందుగా ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండి) తెలిపింది. అంటే 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతు పవనాలు అంచనాల కంటే ముందుగా వచ్చేశాయి. చివరిసారిగా 2001, 2009లో రుతుపవనాలు తరువాయి 2లో




# టీమిండియాగా ఉంటే గోల్ అసాధ్యం కాదు

- కేంద్రం–రాష్ట్రాలు అభివృద్ధివేగం పెంచాలి
- ప్రతి గ్రామం, ప్రతి నగరం వికసించాలి
- ప్రతిరాష్ట్రంలో ఒక ప్రపంచ పర్యాటక కేంద్రం ఉండాలి
- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం–రాష్ట్రాలు రెండూ ‘టీమ్ ఇండియా’లా కలిసిపోయి పనిచేస్తే ‘గోల్’ కొట్టడం అసాధ్యంకాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను దేశం సాధించాలన్నారు. నీతీ ఆయోగ్ సమావేశంలో మోదీ మాట్లాడుతూ, కేంద్రం–రాష్ట్రాలు అభివృద్ధి వేగం పెంచాలన్నారు. వృద్ధి,నవీనీకరణ, సుస్థిరత్వం అనే మూడు అంశాలు భారత నగరాల అభివృద్ధికి చోదకశక్తులుగా పనిచేయాలన్నారు. శ్రమశక్తిలో మహిళలను భాగస్వామ్యం చేసేదశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ‘‘మనం తప్పనిసరిగా చట్టాలు చేయాలి, విధానాలు రూపొందించాలి, తద్వారా మహిళలు గౌరవప్రదంగా మన శ్రమశక్తిలో సమీకృతమవుతారు’’ అని మోదీ చెప్పారు. ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత దేశవ్యాప్తంగా కేంద్ర–రాష్ట్రాల ప్రభుత్వాధినేతలందరూ ఒక్కచోట చేరిన సమావేశాలలో ఇదే మొదటిది. భారత్ భవిష్యత్ లక్ష్యాల సాధన, భారత పరివర్తనకోసం పూర్వపు ‘ప్రణాళికా సంఘం’ స్థానంలో పదేళ్ళక్రితం ఏర్పాటు చేసిన ‘‘జాతీయ పరివర్తన సంఘం’’ (నీతి ఆయోగ్) పాలనామండలి 10వ సమావేశం మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగింది. నీతీ ఆయోగ్ సర్వోన్నత విభాగమైన ఈ పాలనామండలిలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లూ, కేంద్రమంత్రులూ సభ్యులుగా ఉంటారు. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షుడుగా ఉంటారు. దేశంలో అభివృద్ధి వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో మోదీ అన్నారు. ‘‘మనం అభివృద్ధి వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉంది, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల ప్రభుత్వాలు రెండూ ఒకే టీమ్ ఇండియాగా కలిసి పనిచేస్తే ‘గోల్’ కొట్టడం అసాధ్యం కాదు’’ అని ప్రధానమంత్రిని ఉటంకిస్తూ ఎక్స్ వేదికగా ‘నీతీ ఆయోగ్’ ఒక పోస్టింగ్ పెట్టింది. శనివారంజరిగిన ప్రభుత్వ తరువాయి 2లో

## ముగ్గురు దక్షిణాది సిఎంలు గైర్హాజరు

కర్ణాటక, కేరళ, పుదుచ్చేరీ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు నీతీ ఆయోగ్ సమావేశానికి హాజరుకాలేదు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముందస్తు కార్యక్రమాలతో ఊపిరిసలపని పనిలో నిమగ్నమయ్యారు. అందువల్ల అందరికీ తెలియజేసేందుకు ఈ కౌన్సిల్ సమావేశానికి తన లిఖిత సందేశాన్ని పంపారు. బెంగళూరులో వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, సిద్ధరామయ్య ఈ సమావేశాన్ని బహిష్కరించలేదు, ఆయనకు మైసూరులో ముందుగా నిర్దేశించిన కార్యక్రమాలు ఉన్నాయి. కానీ ఆయన తరపున ఎవరు ఈ సమావేశానికి వెళ్ళారన్న విషయంపై వివరణ ఇవ్వలేదు. మార్క్సిస్టుపార్టీ సీనియర్ నాయకుడు,కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన తరపున మంత్రివర్గ సహచరుడు,ఆర్థికమంత్రి కె.ఎన్.బాలగోపాల్‌ను పంపించారు. ఐతే ఇది ముఖ్యమంత్రులతో సమావేశమైనందువల్ల విజయన్ తరపున సహచరుడు తరువాయి 2లో

## ‘నేషన్ ఫస్ట్– పీపుల్స్ ఫస్ట్’ ప్రాధాన్యతతో ముందుకెళ్తున్నాం

- కేంద్ర సహాయ సహకారం లేకుండా తెలంగాణ రైజింగ్ విజన్ అమలు చేయలేం
- తెలంగాణ సమగ్రాభివృద్ధికి సహకరించండి
- వికసిత్ భారత లక్ష్య సాధనలో ముందువరుసలో ఉంటుందని మాట ఇస్తున్నాం
- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

భారతదేశాన్ని 2047 నాటికి సూపర్ పవర్‌గా, నెంబర్ వన్‌గా నిలబెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో ‘తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్’ రూపొందించామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి ఉప కులాల వర్గీకరణకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఢిల్లీలో శనివారం జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ ‘వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం. అందులో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్ష. ‘నేషన్ ఫస్ట్ – పీపుల్ ఫస్ట్‘ అన్న ప్రాధాన్యతతో ముందుకు వెళుతున్నాం.ఈ దేశం రాష్ట్రాల సమాఖ్య. కేంద్రం సహాయ సహకారం లేకుండా తెలంగాణ రైజింగ్ విజన్ అమలు చేయలేం. తెలంగాణ సమగ్రాభివృద్ధికి తరువాయి 2లో

## అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో 2 నుంచి స్లాట్ బుకింగ్

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన
- నిషేధిత జాబితాలో ఆస్తులను రిజిస్ట్రేషన్ కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం
- ప్రత్యేక పోర్టల్‌లో ఆ వివరాలు పొందుపరుస్తామని వెల్లడి


ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానంపై శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం తరువాయి 2లో

## కొత్త వేరియంట్స్ కలకలం..!

**దేశవ్యాప్తంగా మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు**



**న్యూఢిల్లీ :** దేశంలో కరోనా వైరస్ మరోసారి పంజా విసురుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పలు చోట్ల కొవిడ్ కొత్త వేరియంట్‌లను అధికారులు గుర్తిస్తున్నారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న వేళ కొత్త వేరియంట్‌లు వెలుగుచూస్తుండటం కలకలం రేపుతోంది. భారత్‌లో కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7 లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్‌కోవ్2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బి.1.8.1 వేరియంట్ కేసు ఏప్రిల్‌లో వెలుగుచూడగా.. ఎల్‌ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులను ఈ నెలలో గుర్తించినట్లు కన్సార్టియం తెలిపింది. ఆ కేసులు తరువాయి 2లో

## కొవిడ్‌పై ఆందోళన వద్దు

- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి
- మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

కొవిడ్ పట్ల ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొవిడ్,డెంగీ పేరుతో ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర దేశాలు, తరువాయి 2లో

## అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలి




ప్రజాపక్షం/హైదరాబాద్

- పార్టీలో అందరూ కార్యకర్తలే
- మాది ప్రజాస్వామ్య పార్టీ
- ఎవరైనా సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు
- అన్ని రాజకీయ పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారు
- తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ఎవరైనా, పార్టీలో ఏ హోదాలో ఉన్నప్పటికీ అంతర్గతంగా మాట్లాడాల్సిన కొన్ని విషయాలను అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు హితవు పలికారు.అన్ని రాజకీయ పార్టీలలో కోవర్టులు ఉంటారని,రేవంత్ రెడ్డి కోవర్టులు కూడా ఉంటే ఉండవచ్చని(బిఆర్‌ఎస్‌లో) వారంతట వారే బయటపడుతారని, తొందరపడాల్సిన అవసరం లేదని తమ పార్టీ అధ్యక్షునితో కలిసే అవకాశం ఉన్నదని, ఆఫీస్ బేరర్స్‌తో కలిసి మాట్లాడొచ్చని, అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలని, ఇది అందరికీ వర్తిస్తుందని, పార్టీలో అందరూ తరువాయి 2లో

## త్వరలో బిఆర్‌ఎస్ మూడుముక్కలు

- తెలంగాణ రాజకీయ చిత్రపటం నుంచి కనుమరుగు
- పార్టీ నాయకత్వం కోసం కవిత, కెటిఆర్ మధ్య తీవ్ర పోటీ
- అదునుకోసం హరీశ్‌రావు ఎదురుచూస్తున్నారు
- కెటిఆర్ మానసిక సమతుల్యం కోల్పోయి మాట్లాడుతున్నారు
- టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఎంఎల్‌సి కవిత ఏకు మేకు అయిందని, బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్ ఇంట్లో తలెత్తిన విభేదాలను తట్టుకోలేక, ఇంట్లో మరో అధికార కేంద్రం ఆవిర్భవించడంతో కెటిఆర్ మానసిక సమతుల్యం కోల్పోయి సిఎం రేవంత్‌రెడ్డిపై నోటికివచ్చినట్లు మాట్లాడుతున్నారని తరువాయి 2లో

## క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు గిరిప్రసాద్

- సిద్ధాంతాన్ని చంపేయడం అమిత్‌షా తరం కాదు
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా? : కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం



క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా దివంగత సిపిఐ నేత, సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ నిలిచారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తెలిపారు. తుది శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం పరితపించిన మహోన్నతుడని ఆయన కొనియాడారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం రిక్కాబజార్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో శనివారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ గిరిప్రసాద్ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సంక్లిష్ట పరిస్థితి నెలకొందని మావోయిస్టుల పేరుతో అమాయక గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. అమిత్‌షా ప్రకటించినట్లుగా మావోయిస్టు నిర్మూలన 2026 మార్చి 31 కాదు కదా ఎన్నటికి అది సాధ్యం కాదని తరువాయి 2లో

## బెదిరింపులు కుదరవ్, మర్యాద ఇవ్వండి

50 శాతం సుంకాలపై ట్రంప్‌కు ఇయు హెచ్చరిక



**బ్రస్సెల్స్ :** వాణిజ్య ఒప్పందంపై బెదిరింపులు కుదరవనీ, మర్యాద ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్‌ను యూరోపియన్ యూనియన్ (ఇ యు) హెచ్చరించింది. ఇ యు నుండి అమెరికాకు దిగుమతయ్యే అన్నిరకాల వస్తువులపైనా 50 శాతం సుంకాలు విధిస్తామని శుక్రవారంనాడు ట్రంప్ హెచ్చరిక చేయడంతో ఈ విధమైన బెదిరింపులకు దిగవద్దని యూరోపియన్ యూనియన్ తరువాయి 12లో

## అంగన్‌వాడీలో అవినీతి!

- నిర్మల్ జిల్లాలో నిధుల దోపిడీ
- టీచర్లపై వేధింపులు

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి



రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణీల పోషకాహారం కోసం ప్రత్యేకంగా కేటాయిస్తున్న నిధులు అంగన్‌వాడీ వ్యవస్థలో కొందరి స్వార్థానికి బలైపోతున్నాయి. నిర్మల్ జిల్లాలో జరుగుతున్న దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇస్తున్న రూ.12,000 ప్రత్యేక నిధుల్లో సిడిపిఓలు ఏకంగా రూ.2000 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. అంతేకాదు, ఆ అక్రమ డిమాండ్‌ను వ్యతిరేకించిన అంగన్‌వాడీ టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ, సమాజంలోని బలహీన వర్గాలకు సేవలు అందిస్తున్నారు. అలాంటి వారిని సైతం బెదిరించి డబ్బు వసూలు చేయడం తరువాయి 12లో

## అభివృద్ధి, సంక్షేమ పథకాలు జోడెద్దుల్లా నడిపిస్తున్నాం

గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6,500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నాం

సీతారామ మున్నేరు వరద మళ్లింపుతో పాలేరు సస్యశ్యామలం : మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం



తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6500కోట్లు వడ్డీలు కడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు జోడెద్దుల్లా నడిపిస్తున్నామని పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తిరమలాయపాలెం మండలంలోని అజ్మీరతండా, తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## సిరియాపై 180 రోజులు ఆంక్షల సడలింపు

**వాషింగ్టన్ :** సిరియాపై అమెరికా తొలి విడత 180 రోజులపాటు ఆంక్షలు సడలిస్తున్నది. దీనివల్ల సిరియాలో విద్యుత్, నీటి సరఫరా వంటి సదుపాయాల పునరుద్ధరణకువ వీలు కలుగుతుంది. 2019లో అమెరికా కొత్త ఈ ఆంక్షలు విధించింది. దాదాపు 49 సంవత్సరాలుగా సిరియాపై ఆంక్షలు అమలులో ఉన్నాయి. సిరియాపై అన్ని ఆంక్షలూ ఎత్తివేస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. సిరియాకు అమెరికాకు సరికొత్త మిత్రదేశంగా ఆయన అభివర్ణించారు. ఆ దేశంలో శాంతి,సుస్థిరతల పునరుద్ధరణకు ఒక అవకాశం ఇచ్చినట్లు ట్రంప్ చెప్పారు. తదుపరి సిరియా విధానపరమైన కీలక చర్యలు తీసుకున్నప్పుడే తదనంతరం సహాయం కూడా ఆ దేశానికి అందుతుందని ట్రంప్ అన్నారు. సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షారాతో ట్రంప్ ఈనెల 14వ తేదీన రియాద్‌లో ముఖాముఖీ సమావేశం జరిపి గడచిన నాలుగు దశాబ్దాలుగా అమెరికా అమలు చేస్తున్న ఆంక్షలను దశలవారీగా ఎత్తివేస్తామని ప్రకటించారు. 13 సంవత్సరాలపాటు సిరియాలో అంతర్యుద్ధం సాగింది. అది ముగిసిన తర్వాత అల్ షారా ప్రభుత్వం ఒక ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచదేశాల్లో తామూ కీలకపాత్ర పోషిస్తామని, సిరియా తలరాత మారిపోతుందని ప్రకటించారు.

## సముద్రంలో రెండు పడవలు మునిగి
# 427మంది రోహింగ్యాలు మృతి?

**న్యూయార్క్ :** రెండు పడవల్లో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న దాదాపు 427 మంది రోహింగ్యాలు సముద్రంలో జరిగిన ప్రమాదంలో మరణించి ఉంటారని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమీషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) ఫిలిప్ గ్రాండీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మే 9వ తేదీన ఒక ప్రమాదం, మే 10వ తేదీన మరో ప్రమాదం జరిగాయి. మొదటి పడవలో 267 మంది ప్రయాణిస్తున్నారనీ, వీరిలో 66 మంది మాత్రమే బ్రతికి బయటపడ్డారని ఆలస్యంగా సమాచారం అందినట్లు చెప్పారు. రెండో పడవలో 247 మంది ప్రయాణిస్తుండగా వీరిలో 21 మంది మాత్రమే బ్రతికి బయటపడ్డారు. బంగ్లాదేశ్ కాక్స్ బజార్‌లో ఉన్న అతిపెద్ద శరణార్థ శిబిరానికిగానీ, మయన్మార్ పశ్చిమప్రాంతంలో ఉన్న రఖైన్ రాష్ట్రానికిగానీ పారిపోయేందుకు బహుశా వీరు బయలుదేరి ఉంటారని యుఎన్‌హెచ్‌సిఆర్ అధికారి అంచనావేశారు. మయన్మార్‌లో బ్రతికే అవకాశాలు లేకపోవడం, నిధుల కోతవల్ల జీవనం ఆగిపోవడం వంటి పరిస్థితులవల్ల వీరంతాఈసాహసానికి పూనుకుని ఉంటారన్నది యుఎన్‌హెచ్‌సిఆర్ అంచనా. గత ఏడాది కూడా ఇదే విధంగా పడవలు బోల్తా పడటంతో సముద్రజలాల్లో మునిగి




657 మంది రోహింగ్యాలు మరణించారు. ఓవర్‌లోడు, ప్రతికూల వాతావరణం వంటి కారణాలవల్ల పడవలు రెండూ మునిగిపోయి ఉంటాయని భావిస్తున్నారు. ఐతే ఇంతకుమించిన వేరేకారణాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాన్ని ధృవీకరించుకునేందుకు ఐక్యరాజ్యసమితి వర్గాలు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాయి. మయన్మార్‌లో తీవ్ర హింసకుగురవుతున్న రోహింగ్యాలు అక్కడి నుండి పారిపోతుండగా ఆ పరిసర తీరంలో జరిగిన ప్రమాదంలో మరణించారు. ఈ ఘటనను ధృవీకరించాల్సి ఉంది. అధికారిక ధృవీకరణ జరిగితే ఈ ఏడాది జరిగిన అత్యంత ప్రాణాంతకమైన ప్రమాదంగా ఇది రికార్డుల్లో నమోదవుతుందని ఆయన చెప్పారు. ముస్లిం మైనారిటీలలో ఒక ప్రత్యేకమైన తెగకు చెందిన రోహింగ్యాలు అత్యధికంగా మయన్మార్‌లోనే నివసిస్తున్నారు. అనేక దశాబ్దాలుగా వారు మయన్మార్‌లోఅణచివేతకుగురవుతున్నారు. జుంటా సైనిక కూటమి అధికారం చేపట్టా ఈ అణచివేత హద్దులు మీరింది. దీంతో ప్రాణాలు కూడా పణంగా పెట్టి ఇతరదేశాలకు పారిపోయేందుకు రోహింగ్యాలు సిద్ధపడుతున్నారు. 2016లో అరాకస్ పేరుతో ఏర్పడిన రోహిం గ్యా విముక్తి సేన హక్కులకోసం, తమ జీవితాలబాగుకోసం పోరాటం ప్రారంభించారు. మయన్మార్ లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కుట్రతో కూల్చివేసి సైనిక జుంటా అధికారం చేపట్టినప్పటినుండీ రోహింగ్యాలపై అణచివేత మరింత ఉద్ధృతమైంది. రోహింగ్యాలు ఎక్కువగా బంగ్లాదేశ్‌లోకి వలస వెళుతున్నారు. అక్కడి శరణార్థ శిబిరాలలో కూడా భద్రతలేమి, వ్యతిరేక పరిస్థితులు ఎదురవుతూ ఉండటంతో అక్కడి నుండి కూడా వలసలు జరుగుతున్నాయి. ఒకజాతిపై కక్ష కట్టినట్టుగా అదేపనిగా వారి నిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాలను చూసి అందరూ సిగ్గుపడాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ముఖ్యఅధికారి జైదీ అల్ హసన్ విమర్శించారు. మయన్మార్‌లో యధేచ్ఛగా హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆందోళన చెందారు.

# బంగ్లాదేశ్ నేత యూనుస్ రాజీనామా చెయ్యరు



## లక్ష్యాలు పూర్తయ్యేదాకా ఎక్కడికీ వెళ్ళం
## మంత్రివర్గ సమావేశానంతరం వహిదుద్దీన్ ప్రకటన

**ఢాకా:** మేం అనుకున్న లక్ష్యాలు పూర్తయ్యే వరకూ ఎక్కడికి వెళ్ళబోమని, రాజీనామాలు లేవని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంలో ప్రణాళికా సలహాదారు వహిదుద్దీన్ మహ్మద్ చెప్పారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ తన పదవికి రాజీనామా చేస్తారని వదంతులు వస్తున్న పూర్వరంగంలో శనివారంనాడు మంత్రివర్గ ప్రత్యేక సమావేశం జరిగింది. అనంతరం వహిదుద్దీన్ మహ్మద్ మీడియాకు ఈ విషయం చెప్పారు. 'బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనుస్ ఎట్టిపరిస్థితుల్లోనూ అధికారంలో కొనసాగుతారు, ఆయన రాజీనామా చేయడంలేదుతాము అనుకున్న లక్ష్యాలు పూర్తిచేసేవరకూ రాజీనామా ప్రసక్తే లేదు'' అని వహిదుద్దీన్



మహ్మద్ మీడియాకు స్పష్టం చేశారు. యూనుస్ రాజీనామా చేస్తారని వార్తలు వచ్చాయి, నిజమేనా? అని అనేకమంది పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు వహిదుద్దీన్ మహ్మద్ పైవిధంగా స్పందించారు. ''పదవికి రాజీనామా చేస్తానని యూనుస్ చెప్పలేదు, తను వెళ్ళే మార్గంలో ఇంకా ఎన్నో ఆటంకాలు ఉన్నాయి, మాకు ఇచ్చిన బాధ్యతలు పూర్తిచేయడంలో ఉన్న ఈ ఆటంకాలను తొలగించుకుంటూ వెళతాం, వాటిని అధిగమిస్తాం అని మాత్రమే చెప్పారు'' అని వివరించారు. రాబోయేకాలంలో ఎన్నో సంవత్సరాల బంగ్లాదేశ్ భవిష్యత్తు మేం ప్రస్తుతం నిర్వహించే బాధ్యతలను పూర్తిచేయడంలోనే ఉందని అన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మొదలైన సమావేశం సమస్యలను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రధానంగా దృష్టిసారించి చర్చలు జరిపిందని చెప్పారు. దేశంలో రాజకీయపార్టీలు, సైన్యం, పాలనాయంత్రాంగం సహకరించడంలేదన్న కారణంగా యూనుస్ రాజీనామా చేస్తారన్న వదంతులమధ్య ఆయన సలహామండలి ఆకస్మికంగా సమావేశం జరిపింది. ప్రభుత్వ పనుల పురోగతిపై యూనుస్ సమీక్ష నిర్వహించారు. సలహాదారులు లేదా మంత్రులతో యూనుస్ కీలకభేటీ నిర్వహించారు. అదేవిధంగా ఆయన బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ నేత ఖలీదాజియా, జమాతే ఎ ఇస్లామీ నాయకులతో కూడా శనివారం రాత్రి సమావేశాలు జరిపారు.

## కొవిడ్‌పై ఆందోళన వద్దు
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల పరిస్థితిని నిశితంగా గమనించాలని, కరోనా, సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాదుల నివారణ,వాటి నియంత్రణ అంశంపైన మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చొంగ్తు, టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, డిఎంఇ నరేంద్రకుమార్, డిహెచ్ డాక్టర్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు, ఎపిడమాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అన్ని ఆస్పత్రులలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## కొత్త వేరియంట్స్ కలకలం..!
(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కొవిడ్ విస్తృతి నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. అయితే ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ వాటి తీవ్రత తక్కువేనని కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తోపాటు చైనాలోనూ కొవిడ్19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జెఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బి.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది.

## 2 నుంచి స్లాట్ బుకింగ్
(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో సమిక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్తుల క్రయ విక్రయదారులకు పూర్తి పారదర్శకంగా జరిగేలా ప్రయోగాత్మకంగా ఏప్రిల్ 10వ తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించగా, అవి సత్ఫాలితాలు ఇవ్వడంతో రెండవ దశలో మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రయోగం పూర్తిగా విజయవంతం కావడంతో జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సులభతరమవుతుందని ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చాన్నారు. ఆస్తుల క్రయ విక్రయ దారులు స్లాట్ బుకింగ్ తర్వాత లాగిన్‌లో డిపార్ట్మెంట్ పోర్టల్ లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

### అదనపు సిబ్బంది నియామకం

స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. పని భారం అధికంగా ఉన్న పటాన్‌చేరు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్లతో పాటు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు.

**ప్రత్యేక పోర్టల్** : నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్దితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేశామని నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లోహైదరాబాద్ లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్ లో తెలిసిపోయేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## మూడుముక్కలు
(మొదటి పేజీ తరువాయి)

ఆయన విమర్శించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన పొరపాట్లను కవిత బహిరంగంగా ప్రస్తావించారని, ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కెటిఆర్ ఇప్పుడు రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో శనివారం మహేష్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో కెసిఆర్‌కు నోటీసులు జారీకావడంతో కెటిఆర్‌లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్, బిజెపిల మధ్య లో పాయికారి ఒప్పందం ఉందని కవిత చేసిన వ్యాఖ్యలతో స్పష్టమవుతోందని అన్నారు. పార్టీ నాయకత్వం కోసం కవిత, కెటిఆర్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొందని, ఇదే సమయం కోసం మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఎదురుచూస్తున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ త్వరలోనే మూడు ముక్కలు కావడం ఖాయమని, భవిష్యత్తులో తెలంగాణ రాజకీయ చిత్రపటం నుంచి బిఆర్ఎస్ కనుమరుగవుతుందని మహేష్‌కుమార్ జోస్యం చెప్పారు. కెసిఆర్ ప్రస్తుతం ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, ఆయన చుట్టూ ఉన్నది ఎవరో ప్రజలందరికీ తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు.

## ముందుకెళ్తున్నాం
(మొదటి పేజీ తరువాయి)

సహకరించండి, వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మొదటి వరుసలో ఉంటుందని మాట ఇస్తున్నాం' అని చెప్పారు. పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించినందుకు ప్రధాని మోదీకి, భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. 1971లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తు చేశారు. భారతదేశాన్ని 2047 నాటికి సూపర్ పవర్‌గా, నెంబర్ వన్‌గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. 'వికసిత భారత్' ప్రణాళికను రూపొందించడం అభినందనీయమన్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్'లోని నాలుగు కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్లు చెప్పారు. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన చేపట్టామని, బిసిలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి ఉప కులాల వర్గీకరణ, ఈ రెండు చరిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో 2028 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలు రూపొందించినట్లు సిఎం ప్రకటించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు, మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ, శిల్పారామంలో 100 స్టాళ్లతో మహిళా బజార్ అంశాలను ప్రధానంగా సిఎం ప్రస్తావించారు. సోలార్ పవర్ ఉత్పత్తిలోనూ భాగస్వామ్యం కల్పించి మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. యువత ఆశయాల సాధనకు అనుగుణంగా యూత్ పాలసీ అమలు చేస్తున్నామని, 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టించామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొందని, నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, ఐటిఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి స్కిల్ శిక్షణ ఇస్తున్నామని సిఎం వివరించారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి అడ్డుకట్ట వేయటంలో139 దేశాల్లో తెలంగాణ నెంబర్1 స్థానం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు రూ.5 లక్షల స్వయం ఉపాధి పథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభిస్తామన్నారు. తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తులను చేశామన్నారు. సాగు కోసం రైతు మళ్లీ అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.12 వేల రైతు భరోసా సాయం చేస్తున్నామని, బియ్యానికి మద్ధతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నామని, రైతుకు చేదోడుగా ఉండే వ్యవసాయ కూలీకి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేడు వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందని, గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాకుండా ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్ ఫ్రా విషయంలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా ఏడాదిన్నర కాలంలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ (స్విట్జర్ లాండ్) దేశాలలో పర్యటించి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి అభివృద్ధి సాధిస్తామన్నారు. తెలంగాణలో కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాల్లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, మెట్రో రైల్ సెకండ్ ఫేజ్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మాన్యూఫాక్చరింగ్ హబ్, అగ్రిబేస్డ్ పరిశ్రములు ఏర్పాటు చేస్తామన్నారు.సబర్మతీ రివర్ ఫ్రంట్, గంగా పునరుద్ధరణ ప్రాజెక్టు మాదిరిగా తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందని, మెట్రో సెకండ్ ఫేజ్, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు ప్రస్తుతం డిపిఆర్‌ల స్టేజ్‌లో ఉన్నాయని, రేడియల్ రోడ్ల నిర్మాణం. తెలంగాణ ప్రతిపాదిత డ్రై పోర్ట్ నుండి మచిలీపట్నం పోర్టుకు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం తెలంగాణ అభివృద్ధిలో కీలకమవుతాయని సిఎం వివరించారు. గుడ్ గవర్నెన్స్‌తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామని, ఇందులో భాగంగా బిల్డ్ నౌ యాప్ ద్వారా నిర్మాణ రంగంలో వేగం పెంచినట్లు సిఎం తెలిపారు. హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. విద్య, వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## 'యాపిల్' భారత్‌కు వెళితే ఓకే, కానీ..

### మాకు 25 శాతం సుంకం కట్టాలి : ట్రంప్

**న్యూయార్క్ :** యాపిల్ కంపెనీ భారతదేశంలో ప్లాంట్లు నిర్మించుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదనీ, కానీ ఆ ఉత్పత్తులను సుంకాలు లేకుండా అమెరికాదేశంలో విక్రయించడం సాధ్యంకాదని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారంనాడు క్లారిటీ ఇచ్చారు. 'యాపిల్' చేసే అన్ని రకాల ఉత్పత్తులను అమెరికాలో విక్రయించుకోవాలంటే 25 శాతం సుంకాలను చెల్లించాల్సి ఉంటుందని శుక్రవారంనాడు ప్రకటించిన ట్రంప్ దానిపై మర్నాడు వివరణ ఇచ్చారు. అమెరికా అణుశక్తి సామర్థ్యాలకు ఊతం ఇచ్చేందుకు వీలుగా తన ఓవల్ కార్యాలయంలో అనేక ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగానే సుంకాల విషయం కూడా ఆయన స్పష్టం చేశారు. ''ఓకే, యాపిల్ సంస్థ భారతదేశానికి వెళ్ళి అక్కడే కర్మాగారాలు నిర్మించుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు, కానీ ఈ టెక్ కంపెనీ మాత్రం అమెరికాలో సుంకాలు కట్టకుండా సరుకులను అమ్ముకోలేదు, ఈనాడు మనం ఐఫోన్ల గురించి మాట్లాడుతున్నాం, కానీ టిమ్ కుక్ ఇలా చేసి ఉండాల్సింది కాదు, ఆయన గనుక ఐఫోన్లను అమెరికాలో అమ్ముకోవాలంటే సుంకాలు కట్టాలి, కానీ నేను చెప్పేదేమిటంటే ఆ కర్మాగారాలను అమెరికాలోనే నిర్మించుకోవాలంటున్నా, ఇక్కడ నిర్మించుకుంటే అలాంటి సమస్యలేమీ ఉండవు'' అని ట్రంప్ చెప్పారు. ''ఐఫోన్‌ను అమెరికాలో అమ్ముతున్నారు, అందువల్ల దానిని అమెరికాలోనే కర్మాగారం పెట్టి తయారు చేయండి, భారత్‌లోనో మరో దేశంలోనో కర్మాగారం నిర్మించవద్దు'' అని ట్రంప్ శుక్రవారంనాడు సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. గడచిన వారంలో మధ్యప్రాచ్య పర్యటన సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ దోహాలో పాత్రికేయులతో మాట్లాడుతూ, యాపిల్ కంపెనీ సిఇఓ టిమ్ కుక్ తనతో మాట్లాడారనీ, తాము భారతదేశంలో కర్మాగారం నిర్మించబోమని, ఉత్పత్తి వ్యవస్థను అమెరికాలోనే నిర్మిస్తామని చెప్పారన్నారు. ''టిమ్, మీరు నాకు మంచి స్నేహితులు, మిమ్మల్ని నేను ఎంతో బాగా చూసుకుంటాను, మీరు 500 బిలియన్ డాలర్లతో మీరు అమెరికాకు వస్తునానరు, కానీ ఇప్పుడు మీరు భారత్ అంతటా నిర్మాణాలు చేస్తున్నారని విన్నా, మీరు భారత్‌లో కర్మాగారాల నిర్మాణం చెయ్యొద్దు, ఎందుకంటే భారత్ చాలా ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది, మీరు భారత్‌లో వాటిని అమ్ముకోవడం చాలా కష్టం, పైగా వాళ్ళు మాతో జీరో టారిఫ్‌లకు ప్రతిపాదన చేశారు'' అని తాను చెప్పానని ట్రంప్ అన్నారు.

## అంతర్గతంగానే మాట్లాడాలి
(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలేనని, అందరికీ ఇదే సూత్రం వర్తిస్తుందని ఎంఎల్‌సి కవితను ఉద్దేశించి కెటిఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తమది ప్రజాస్వామ్య పార్టీ అని,ఎవరైనా, ఎలాగైనా తమ సలహాలు, సూచనలు ఇవ్వవచ్చునని, వాటిని తాము స్వీకరిస్తామన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని, దెయ్యం రేవంత్ రెడ్డి అని, రాష్ట్రానికి పట్టిన ఆ శనిని, ఆ దెయ్యాన్ని వదిలించడంపైనే తాము, తమ పార్టీ దృష్టి సారించిందని కెటిఆర్ అన్నారు. శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపోటముల విషయంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు లోక్‌సభ నియోజకవర్గాల వారిగా నాయకులతో తాము చర్చించామని, ఈ సందర్భంగా చాలా మంది నేరుగా మైక్‌లో మాట్లాడారని, కొందరు చిట్టీలు రాశారని, మరి కొందరు కెసిఆర్‌కు ఉత్తరాలు అందించిన వారు కూడా ఉన్నారని కెటిఆర్ వివరించారు. తమది ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన పార్టీ అని, తమ పార్టీ అధ్యక్షునికి ఎవరైనా ఉత్తరాలు రాయవచ్చని, ఇదేదో పెద్ద గొప్ప విషయమని అందరూ బాధపడాల్సిన అవసరం లేదని చెప్పారు. లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా ఎవరైనా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చునని కెటిఆర్ సూచించారు.

### నిష్పపక్ష విచారణ జరగాలంటే రేవంత్ రెడ్డి సిఎంగా రాజీనామా చేయాలి : కెటిఆర్

నేషనల్ హెరాల్డ్ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలంటే రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఈ కేసులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో నెల రోజుల పాటు వేచిచూస్తామని,ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌ను విచారణ చేపట్టాలని తాము గవర్నర్‌ను కలిసి కోరుతామని కెటిఆర్ తెలిపారు. ఇన్ని రోజుల నుంచి రక్షణ కవచంలాగా రేవంత్ రెడ్డిని కాపాడుతున్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే నెల రోజుల తర్వాత తమ కార్యాచరణను ప్రకటిస్తామని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఎండగడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఒక ఎటిఎంగా మారిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకే ఢిల్లీ కాంగ్రెస్‌కు ఎప్పుడు డబ్బులు కావాలంటే, అప్పుడు భారీ మొత్తంలో పంపిస్తున్నారన్నారు. నెషనల్ హెరాల్ ఛార్జ్ షీట్‌లో తెలంగాణ సిఎం పేరు ఉండడం తెలంగాణకే అవమానకరమన్నారు. రూ 50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్ష పదవిని కొనుక్కున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాకు వెల్లడించారని, అదే విషయాన్ని ప్రస్తుతం ఇడి తన చార్జ్‌షీట్‌లో పొందుపర్చిందని వివరించారు.

### రేవంత్‌కు అధికారిక, అనాధికారిక బాసులు

రాహుల్‌గాంధీ అధికారిక బాస్ అయితే,నరేంద్రమోదీ,అమిత్‌షాలు సిఎం రేవంత్ రెడ్డికి అనాధికారిక బాసులు అని,ఆ ఇద్దరు బాసులను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన 44 సార్లు ఢిల్లీకి పోయారని కెటిఆర్ ఆరోపించారు. బిఆర్ఎస్‌పై నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు,ఢిల్లీ బాస్‌లకు వేలకోట్ల చందాలు ఇది సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి చేస్తున్నది ఇదే నన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఇడి ఛార్జ్ షీట్‌లో పొందుపర్చినప్పుడు దేశంలోని ప్రతి కాంగ్రెస్ నాయ కులందరూ స్పందించారని, కానీ ఒక రేవంత్ రెడ్డి మాత్రం జపాన్ పర్యటన పేరుతో తప్పించుకున్నారన్నారు.

## గోల్ అసాధ్యంకాదు (మొదటి పేజీ తరువాయి)

పాలనామండలి సమావేశం ఇతివృత్తాన్ని ''వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్ @2047''గా నిర్దేశించారు. ''వికసిత్ భారత్ ప్రతిభారతీయుడి లక్ష్యం. ప్రతి రాష్ట్రం వికసిస్తే, భారతదేశం కూడా వికసిస్తుంది, ఇది దేశంలో 140 కోట్ల మంది ప్రజల ఆశయం'' అని సమావేశంలో మోదీ చెప్పారు. ''ప్రతి రాష్ట్రాన్ని అభివృద్ధికరమైన, వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది మన లక్ష్యం, ప్రతి నగరం, ప్రతి నగర పాలికా వికసించాలి, ప్రతి గ్రామం వికసించాలి, ఈ విధంగా పునాదిస్థాయిలో గ్రామాలు, నగరాలను అభివృద్ధి చేసేదిశగా మన పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి 2047వ సంవత్సరం వరకూ మనం ఎదురుచూడాల్సిన అవసరం లేదు'' అని సమావేశంలో మోదీ చెప్పారు. ప్రతి రాష్ట్రం ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని, ఆ పర్యాటక కేంద్రం ప్రపంచ ప్రమాణాలస్థాయిలో ఉండాలని, ప్రపంచ పర్యాటకులకు అవసరమైన సదుపాయాలను, మౌలిక వ్యవస్థలను సమకూర్చేవిధంగా ఆ కేంద్రాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఒక రాష్ట్రం, ఒక ప్రపంచ పర్యాటక కేంద్రం అనే భావన అభివృద్ధి చేస్తే పొరుగు నగరాలను కూడా టూరిస్టు కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు.

## గైర్హాజరు (మొదటి పేజీ తరువాయి)

పాల్గొనవచ్చునా? లేదా? అనేది స్పష్టంగా తెలిలేదు. కాగా బిజెపి యేతర రాష్ట్రాలకు చెందిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. 2021లో ఈ సమావేశానికి హాజరైన స్టాలిన్ మళ్ళీ ఇప్పుడే ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 'నైరుతి' వచ్చేసింది
(మొదటి పేజీ తరువాయి)

అనుకున్న సమయం కంటే ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. ఆ రెండేళ్లలో మే 23నే కేరళను తాకాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు భారతదేశంలో ప్రవేశిస్తాయి. అయితే 1918లో అత్యంత వేగంగా మే 11న కేరళను తాకి రికార్డు సృష్టించాయి. ఆలస్యంగా ప్రారంభమైన రికార్డు 1972లో నమోదైంది. ఆ ఏడాది రుతుపవనాలు జూన్ 18 నాటికి ప్రారంభమయ్యాయి. గత 25ఏళ్లలో 2016లో ఆలస్యంగా రుతుపవనాలు జూన్ 9న కేరళలోకి ప్రవేశించాయి. గతేడాది మే 30న, 2023లో జూన్ 8, 2022లో మే 29, 2021లో జూన్ 3, 2020లో జూన్ 1, 2019లో జూన్ 8, 2018లో మే 29న నైరుతి రుతుపవనాలు దేశంలో ప్రవేశించాయి. ఈ సారి అన్నింటికంటే వేగంగా కేరళను తాకి 16 ఏళ్ల తర్వాత రికార్డు సృష్టించాయి. గత ఏడాదిలో దేశంలో 934.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటన 108 శాతం వర్షం పాతం కురిసింది. 2020 తరువాత ఇదే అత్యధికం. 2023లో 820 మి.మీ., సగటున 94.4 శాతం, 2022లో 925 మి. మీ., 2021లో 870 మి.మీ., 2020లో 958 మి. మీ. వర్షంపాతం నమోదైనట్లు ఐఎండి గణాంకాలు వెల్లడించాయి.

### దక్షిణాది రాష్ట్రాల్లో వాతావరణం

దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, దక్షిణ కర్ణాటక, కొంకణ్, గోవాలో అతి భారీ వర్షపాతం నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలులు గంటకు 4050 కి.మీ వేగంతో వీస్తాయని పేర్కొంది. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

### పశ్చిమ రాష్ట్రాల అంచనా

దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలో తూర్పుమధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడి మే 24 ప్రారంభంలో రత్నగిరికి వాయువ్యంగా 40 కి.మీ దూరంలో కేంద్రీకృతమవుతుందని ఐఎండి అంచనా వేసింది. ఇది తూర్పు వైపునకు కదిలి శనివారం రత్నగిరి, దపోలి మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. మహారాష్ట్ర తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం మధ్యాహ్నం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముంబయిలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఆ సమయంలో గంటకు 40–50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. భారత వాతావరణ శాఖ గోవాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో ఆదివారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ముందు జాగ్రత్త చర్యగా నదులు, జలపాతాల నుంచి దూరంగా ఉండాలని పేర్కొంది. గత 24 గంటల్లో గోవా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

### ఉత్తరాది రాష్ట్రాల అంచనా

మే 24న ఉత్తరాఖండ్ హిమాచల్ ప్రదేశ్, యుపిలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులుతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. జమ్ముకశ్మీర్, లడాఖ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే కొన్ని రోజుల్లో ఝార్ఖండ అంతటా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుందని తెలిపింది. మే 24–26 మధ్య బంగాల్, సిక్కిం, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బిహార్‌లో ఉరుములు, ఈదురుగాలులుతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం, ఆదివారం మధ్యప్రదేశ్, బిహార్‌లో గంటకు 50–70 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. అండమాన్ నికోబార్ (మే 24–26), విదర్భ, ఛత్తీస్‌గఢ్ (మే 24), బిహార్ (మే 25), ఒడిశా (మే 24, మే 27–29), బంగాల్, సిక్కిం (మే 28–29) లలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆనిశా వలలో మరో అవినీతి తిమింగలం



ప్రజాపక్షం/కడెం : ఆనిశా వలలో మరో అవినీతి తిమింగలం చిక్కింది. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన గుగ్లవత్ ప్రభాకర్ అనే రైతు తన తండ్రి మరణానంతరం 5 ఎకరాల పట్టా మార్పిడిలో భాగంగా కొలతల ప్రొసీడింగ్ కొరకు కడెం మండల సర్వేయర్ ఉమాజీ ఎకరా భూమికి 5000 చొప్పున మొత్తం 25000 డిమాండ్ చేయగా 20వేలకు బేరం కుదుర్చుకొని అందులో నుండి 12000 గత నెల 28 తేదీన ఇవ్వగా మరో 8వేల కొరకు నిత్యం వేధిస్తుండగా 7000 శనివారం రోజు ఇస్తానని బాధితుడు ప్రభాకర్ ఎసిబిని ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన ఎసిబి అధికారులు ఆదిలాబాద్ జోన్ ఎసిబి డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సర్వేయర్ ఉమాజీకి మండల రెవెన్యూ కార్యాలయంలో బాధితుడు డబ్బులు 7000 రూపాయలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నిందితుడు సర్వేయర్‌ను అదుపులోకి తీసుకొని ఎసిబి అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

# గిరిప్రసాద్ సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటయోధులు, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, సిపిఐ జాతీయ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరిప్రసాద్‌కు సిపిఐ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. కమ్యూనిస్టు పార్టీ దిగ్గజం దివంగత ఎన్.గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ కార్మికవర్గం, రైతులు, ఇతర అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతి కోసం గిరిప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించడంలో గిరిప్రసాద్ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణను నేటి తరం కమ్యూనిస్టు శ్రేణులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అజీజ్‌పాషా అన్నారు. గిరిప్రసాద్ ఎప్పుడు కూడా ఎన్నికల కంటే పార్టీ బలోపేతానికే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇందుకోసం ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. గిరిప్రసాద్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో తాను హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశానని, ఆయనను ఎప్పుడు కలవాలకున్న ఓ విద్యార్థి పరీక్షలకు సన్నద్ధమై వెళ్ళినట్లుగా తాను పూర్తిగా సిద్ధమై వెళ్లేవాడనని గుర్తు చేసుకున్నారు. గిరిప్రసాద్ పార్లమెంట్ సభ్యులుగా, కమ్యూనిస్టు నాయకులుగా అందించిన సేవలు అనన్య సామాన్యమైనవన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య, రాజ్‌కుమార్, నదీమ్ పాల్గొన్నారు.

**గిరిప్రసాద్ భవన్‌లో..**

కమ్యూనిస్టు పార్టీ దిగ్గజం నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ అధ్యక్షుడు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పాత్ర ను గుర్తు చేసుకున్నారు. గిరిప్రసాద్ పోరాట పంథాను నేటి తరం నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు, నవచేతన విజ్ఞాన సమితి కోశాధికారి ఉజ్జిని రత్నాకర్, జనరల్ మేనేజర్ మధుకర్, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ బి.లక్ష్మి నారాయణ, న్యూస్ ఎడిటర్ పి.శ్రీనివాస్ రెడ్డి, జనరల్ మేనేజర్ (యాడ్స్) మదన్ తదితరులు పాల్గొన్నారు.





# అప్పుడు ఇడి అపవిత్రం... ఇప్పుడు పవిత్రమా?



పదేళ్లు దెయ్యంలా తెలంగాణను పట్టి పీడించారు
బిజెపితో చేసుకున్న చీకటి ఒప్పందంతోనే కాంగ్రెస్‌పై విమర్శలు
తీరు మార్చుకోవాలంటూ బిఆర్‌ఎస్ నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు హితవు

ప్రజాపక్షం/హైదరాబాద్: అధికారంలో ఉన్నపుడు అపవిత్రంగా కనిపించిన డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి)... ఇప్పుడు బిఆర్‌ఎస్ నాయకులకు పవిత్రంగా కనిపిస్తుందా..? అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఇప్పుడు పొగుడుతున్న దర్యాప్తు సంస్థ గతంలో కవితపై కేసు నమోదు చేసిన సంగతిని మర్చిపోయారా..? అంటూ ఎద్దేవా చేశారు. ఆధారాల్లేకుండా ఇడి తమ నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని సమర్థిస్తున్నారా... లేదా..? అని చెప్పాలని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 60 ఏళ్ల కలను సాకారం చేస్తూ సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే... పదేళ్లు బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణను దెయ్యంలా పట్టి పీడించిందని శ్రీధర్‌బాబు అన్నారు. నియంతృత్వ పాలనతో ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఆ పార్టీ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఆ చేదు జ్ఞాపకాలను తెలంగాణ ప్రజలిప్పుడిప్పుడే మరిచి పోతున్నారన్నారన్నారు.

**ఆ చీకటి ఒప్పందమేంటి...?**

'ఇడి'ని పావుగా చేసుకొని కేడర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేలా కాంగ్రెస్ అగ్ర నాయకులపై బిజెపి పెడుతున్న అక్రమ కేసులను బిఆర్‌ఎస్ నాయకులు సమర్థించడం వెనుకున్న చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ బిజెపి పెడుతున్న అక్రమ కేసులపై స్పందించాల్సిన అవసరం రాహుల్ గాంధీకి లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ఆ పార్టీ నాయకులు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు.

**మీ అప్పులకు వడ్డీ కడుతుందెవరూ...?**

మీరు తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతూ... గాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతున్న మాపై బిఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్య శ్రీ, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు లాంటి పథకాలు మీ కంటికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

# నక్సల్స్ ఏరివేత దారుణం

వామపక్ష భావజాలన్నీ అంతం చేయడం ఎవరి తరం కాదు
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా ముందుకు తీసుకెళ్తామని, వామపక్ష భావజాలన్నీ అంతం చేయడం ఎవరి తరం కాదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌కు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మావోయిస్ట్ నేతలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపుతూ పైశాచిక ఆనందాన్ని పొందు తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు. మావోయిస్ట్ పార్టీ ప్రభుత్వంతో శాంతి చర్చలు జరుపుతామని ఆయుధాలను పక్కన పెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం హేయమైన చర్య అని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చడానికే ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని తెలిపారు. అలాగే సిపిఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్‌లో చండీఘర్‌లో, తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టులో మేడ్చల్ జిల్లాలో జరుగనున్నాయని ఆలోపు శాఖ, పట్టణ, మండల జిల్లా మహాసభలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందంలు మాట్లాడుతూ రాబోయే మహాసభలలోపు అన్ని మండల, గ్రామ కమిటీలను నిర్మాణం చేసి వాటి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ గోసిక మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ గౌతం గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కె.కనకరాజ్, తాళ్ళ పెల్లి మల్లయ్య, కొడం స్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయ మిత్రులతో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ మణికంఠ రెడ్డి, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు తాళ్ళపెల్లి లక్ష్మణ్, మర్కాపూరి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, శనిగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, తాళ్ళపెల్లి సురేందర్, మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి



కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఒయు ఐక్య విద్యార్థి సంఘాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత కొన్ని రోజులుగా ఆదివాసి ప్రాంతాల్లో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఐక్య విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్ట్‌లతో శాంతి చర్చలు జరపాలన్నాయి. హైదరాబాద్ ఒయు ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం మీడియాతో మాట్లాడారు. ఆజాద్ ( రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్) ఆజాద్, జార్జ్ రెడ్డి, ఎస్. నాగేశ్వర్ రావు (పిడిఎస్‌యు), శ్రీకాంత్ (లా స్టూడెంట్స్ జెఎసి), పుదరి హరిషగౌడ్ (టివిఎస్), నాగరాజు (పిడిఎస్‌యు), లెనిన్ (ఎఐఎస్ఎఫ్), (ఎఎస్ఎఫ్), అజయ్ (ఎస్ఎఫ్ఐ), సాగబోయిన పాపారావు (ఆదివాసీ విద్యార్థి సంఘం), విజయ్ (పిడిఎస్‌యు విజృంభణ), అజయ్ (ఎస్‌టిఎస్‌ఎ), సైదులు (ఎఎంఎస్ఎ), రమేష్, జంగయ్య (బిఆర్‌ఎస్‌వి), శ్రవణ్ (డిఎస్ఎ), హనుమంతు నాయక్ (గిరిజన శక్తి), రాజశేకేర్ (పిఎస్ఎ) పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా కార్పొరేట్‌లు, మైనింగ్ మాఫియా ప్రయోజనాల కోసం చేస్తుందని విమర్శించారు. ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న దేశ సంపదను కొంత మందికి అందించడానికే ఆదివాసులను, ఆదివాసులకు రక్షణగా ఉన్న మావోయిస్ట్‌లను నిర్మూలన చేస్తుందన్నారు. గత కొన్ని నెలలుగా మావోయిస్టులు శాంతి చర్చల ప్రతిపాదన పెడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక అనేక కుట్ర కోణాలున్నాయని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యంగ బద్ధంగా ప్రవర్తించాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా పీడిత ప్రజల కోసం, దళితుల కోసం, ఆదివాసుల కోసం మాట్లాడుతున్న మావోయిస్టులను నిర్మూలన చేయాలనుకోవడం ప్రభుత్వాల అణచివేత ధోరణిని బహిర్గత పరుస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నో ఉన్నత చదువులు చదివి, వ్యక్తిగత జీవితాన్ని వదిలేసుకొని, ప్రజల కోసం జీవిస్తున్న మావోయిస్టులు కూడా భారతదేశ పౌరులేనని మరిచిపోవద్దన్నారు. ఒక రాజకీయ పార్టీ కేంద్ర కార్యదర్శిని అనారోగ్య పరిస్థితులలో పట్టుకుని ఎన్‌కౌంటర్ పేరు మీద హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారిణి విజయలక్ష్మి ని హత్య చేయడం పట్ల తెలంగాణ రాజకీయ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ హత్యలన్నిటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సుప్రీం కోర్టు ఈ మారణకాండను సుమోటోగా స్వీకరించాలని కోరారు.

## వాస్తవాలను తెలియజేయడానికి సిద్ధం: మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ జీవ ధార కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎప్పుడైనా, ఎక్కడైనా వాస్తవాలను తెలియజేయడానికి తాము సిద్ధమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. విచారణ తర్వాత చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ ముందే ఎలా ప్రకటిస్తున్నారని?, మంత్రి మనసులో ఉన్న కుట్రకు ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సింగిల్ పాయింట్ ఎజెండాగా మారిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లను, పంప్ హౌజ్‌లను వాడుకుంటూనే, మరోవైపు అది వైట్ ఎలిఫెంట్ అంటున్నారని, రేవంత్, ఉత్తమ్‌లే తెలంగాణ పాలిట వైట్ ఎలిఫెంట్స్ అని ఎద్దేవా చేశారు. దేశంలో అంచనాలు పెంచకుండా పూర్తయిన ప్రాజెక్టు ఏదైనా ఉంటే చెప్పాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇష్టారీతిగా మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మతి భ్రమించిందని మండిపడ్డారు. ఒకరు రాష్ట్ర ఆదాయానికి, మరొకరు నీటి వాటాకు గండి కొడుతున్నారని పేర్కొన్నారు. ఏడాదిన్నర నుంచి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన కుట్రలు చేయడం తప్ప, ఎక్కడా ఒక ప్రాజెక్టును పూర్తి చేసింది లేదని, ఒక్క ఎకరాకు నీళ్ళు ఇచ్చింది లేదని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి దగ్గర కట్టాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చడం కమిషన్ల కోసమే అని, అదే పనిగా కారు కూతలు కూస్తున్నారని, తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని 18 ఫిబ్రవరి, 2015, మార్చి4వ తేదీ 2015 సంవత్సరంలో సిడబ్లుసి రాసిన లేఖల్లో పేర్కొన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అవినీతి గురించి మాట్లాడడమంటే దెయ్యాలు వేదాలు వల్లించడమేనని, పులులు శాఖహారం గురించి మాట్లాడటమే అని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పి 18 నెలలు గడుస్తున్నప్పటికీ ఎందుకు తట్టెడు మట్టి తీయలేదో చెప్పాలని సిఎం, మంత్రి ఉత్తమ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రానున్న ఐదు రోజులు అతిభారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రానున్న ఐదురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయన్నారు. రాబోయే రెండుమూడు రోజుల్లో తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వరకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయన్నారు. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశాలున్నాయన్నారు. శనివారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయనే అంచనగా ఉందన్నారు. ఈ జిల్లాకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. 26న నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. 27న కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని తెలిపారు. 28న ఆదిలాబాద్, కుమ్రంభీ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ఉపాధి కల్పనకు చర్యలు

వైరా జాబ్‌మేళాలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/వైరా :యువతకు ఉపాధి కల్పనకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు అన్నారు. 5వేలకు పైగా మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వైరా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి శుక్రవారం డిప్యూటీ సిఎం, ఆర్థిక ఇందనశాఖ మంత్రి భట్టివిక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 2050 సంవత్సరాలకు అనుగుణంగా విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మా ణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఉద్యోగ మేళాలో 80కు పైగా కంపెనీల ప్రతినిధులు ముందు కు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అన్ని మార్గాలు అన్వేషించి అమలు చేస్తున్నామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, దీనిని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. వైరా నియోజకవర్గ పరిసరాల్లో ఉన్న నాగార్జునసాగర్, కాల్వ వైరా చెరువు, ఇతర చెరువకుల సంవృద్ధిగా నీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద ప్రత్యేకంగా రాజీవ్ కెనాల్‌ను రూ.100 కోట్లతో పూర్తి చేశామని అన్నారు. వైరా చెరువు కాల్వల పునరుద్ధరణ కోసం రూ.44కోట్లు మంజూరు చేశామని అన్నారు. చిన్న నీటి బొట్టు వదలకుండా రైతుల పొలాలకు సాగునీరు మళ్లించేలా చర్యలు చేపట్టామని డిప్యూటీ సిఎం తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో వైరా నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, యువతకు అవసరమైన స్కిల్ అందించేందుకు ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశామని అన్నారు. వైరాకి అడ్వాన్స్ ఐటి టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహణ చాలా సంతోషంగా ఉందని అన్నారు. మెగాజాబ్‌మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సిఎంకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో ఎంపికైన యువతకు వివిధ కంపెనీల ఆఫర్ లెటర్‌లను డిప్యూటీ సిఎం అందజేశారు. ఈ మెగా ఉద్యోగ మేళాలలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సింగరేణి సిఎండి బలరాం, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, సింగరేణి జనరల్ మేనేజర్ శాలోమ్‌రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, కోట్ల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిలరెడ్డి, కట్ల రంగారావు, నూతి సత్యనారాయణ, సూతకాని జైపాల్, ఏదునూరు సీతారాములు, దొబ్బల సౌజన్య, కట్ల సంతోష్, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు,యూత్ కాంగ్రెస్ నాయకుడు గరిడేపల్లి కిషోర్, బోళ్ళ గంగారావు, పల్లపు కొండలు, బత్తుల గీత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చందానగర్ సర్కిల్-21 SLP జోన్
NIT.No.05/EE/GHMC/DIV-21/2025-26 తేదీ: 24.05.2025
టెండర్ నోటీసు ('ఈ'-ప్రొక్యూర్మెంట్ ద్వారా)
టెండర్లను నం. 05/EE/GHMC/DIV-21/2025-26 (ఐటెమ్ నం.01) తేదీ. 24.05.2025న టెండర్లు పిలుస్తారు. (01) పని కోసం 'ఈ' ప్రొక్యూర్మెంట్ ద్వారా రూ. 19.30 లక్షల అంచనా వ్యయంతో. బిడ్ల అమ్మకం 26.05.2025 న మధ్యాహ్నం 12 గం.ల నుండి 'ఈ'-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో తెరిచి ఉంటుంది. బిడ్ల సమర్పణకు చివరి తేదీ 02.06.2025 న మధ్యాహ్నం 12 గం.లకు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చందానగర్ సర్కిల్-21, SLP జోన్: GHMC
DIPR R.O.No: 2472-PP/CL/ADVT/1/2025-26 Date: 24-05-2025

**తెలంగాణ ప్రభుత్వం ఆర్ అండ్ బి విభాగం**
'ఈ'-ప్రొక్యూర్మెంట్ నోటీసు
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి) కార్యాలయం, సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్
NIT.No.08/2025-2026/EE/PA to EE/PA/ to EE/D1/DB/SBD/781 తేదీ: 23.05.2025
పని పేరు: 1. హైదరాబాద్లోని మలక్‌పేట్ కాలనీలో ప్రభుత్వ నివాస క్వార్టర్ నంబర్లు బి41 నుండి బి44 (అంటే, హైదరాబాద్ ఈస్ట్ జోన్‌లోని ప్రాంతీయ రవాణా కార్యాలయానికి కొత్తగా కేటాయించబడింది). కొన్ని సివిల్, కిటికీలు మరియు తలుపుల పనులు. అంచనా విలువ: రూ. 1,62,424.00, EMD: రూ. 1,624.00. 2. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ కాలనీలోని ప్రభుత్వ నివాస క్వార్టర్ నంబర్లు బి41 నుండి బి44 వరకు కొన్ని సివిల్ మరియు శానిటరీ పనులు (అంటే, ఆర్‌టిఏ ప్రాంతీయ రవాణా కార్యాలయం, తూర్పు జోన్, హైదరాబాదుకు కొత్తగా కేటాయించబడింది). అంచనా విలువ: రూ.1,63,085.00, EMD: రూ.1631.00. డౌన్లోడ్ ప్రారంభ తేదీ: 23.05.2025 నుండి సాయంత్రం 06.30 వరకు. బిడ్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 30.05.2025 నుండి మధ్యాహ్నం 02.00 వరకు; బిడ్ ప్రారంభ తేదీ మరియు సమయం: 30.05.2025 నుండి మధ్యాహ్నం 02.15 వరకు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి) పేరు మరియు చిరునామా: శ్రీ ఎ.వి. విశ్వ కుమార్ బి.టెక్, ఎఫ్ఏసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ అండ్ బి) సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. మరిన్ని వివరాలను తెలంగాణ "ఈ"-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్‌లో https://tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి), సౌత్ బిల్డింగ్స్, డివిజన్, హైదరాబాద్
DIPR R.O.No: 2463-PP/CL/ADVT/1/2025-26 Date: 24-05-2025

**మెదక్ పురపాలక సంఘం కార్యాలయం**
ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ)
"మెదక్ మున్సిపాలిటీలో ఉత్పత్తి అయ్యే చికెన్, మటన్, చేపల వ్యర్థాలను రెండు సంవత్సరాలు (2025-26 మరియు 2026-27) సేకరించుటకు" కండిషన్‌లో ఉన్న వాహనాల ఏర్పాటు గురించి అనుభవం ఉన్న ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ)ను ఆహ్వానించబడుతుంది. 1) చికెన్, మటన్, చేపల వ్యర్థాలను సేకరించుటకు ఏజెన్సీలు స్వంత వాహనాలు కలిగి ఉండాలి, 2) ఏజెన్సీలు మూడు ప్రాసెసింగ్ యూనిట్‌లతో ఒప్పందం(టై అప్) చేసుకొని, సంబంధిత పత్రాలను సమర్పించాలి, 3) ఏజెన్సీలకు అనుభవం ఉండడంతో పాటు, సేకరణ, శాస్త్రీయ విధానంలో పారవేయుట(సైంటిఫిక్ డిస్పోజల్)కు సంబంధించిన నివేదికలను సమర్పించాలి, 4) జిఒఎంఎస్ 56 తేదీ: 04-11-2016 ఎహెచ్ డిడి ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ప్రకారం చికెన్,మటన్, చేపల వ్యర్థాలను చేపల పెంపకం పరిశ్రమలకు పంపరాదు, 5) అభ్యర్థులు సీల్డ్ కొటేషన్‌లను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలి. 6) వార్షిక కలెక్షన్ ఫీజు రూ. 3,30,000/- ఇఒఐలో పాల్గొనే వ్యక్తి వార్షిక ఫీజు కంటే అధికంగా కోట్ చేయాలి. తదుపరి సంవత్సరాలలో(ఇఒఐ గడువు (2) సంవత్సరాలలో, అనగా 2025-2026 మరియు 2026-2027) 10 శాతం పెంచాలి. 7) కమిషనర్ మెదక్ మునిసిపాలిటీ పేరుతో రూ.10,000/- నాన్ రిఫండబుల్ (తిరిగి చెల్లింపునకు వీలు లేని) డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఏజెన్సీ సమర్పించాలి, 8) ఫర్మ్ రిజిస్ట్రేషన్, ఐటి, జిఎస్‌టి తాజా రిటర్న్‌లను తప్పనిసరిగా సమర్పించాలి. 9) ఎవరైతే సంబంధిత డాక్యుమెంట్‌లతో పాటు అత్యధిక బిడ్‌లను కోట్ చేస్తారో, కాంట్రాక్టు ఆ ఏజెన్సీకి ఇవ్వబడుతుంది. 10) సైంటిఫిక్ డిస్పోజల్ సరిగా లేనట్లు తెలిసినచో, ఒకవేళ చికెన్, మటన్ మరియు చేపల వ్యర్థాలను వీధులు, బహిరంగ ప్రదేశాలలో వేసినట్లయితే, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాంట్రాక్టు రద్దు చేయబడుతుంది. 11) ఏ సమయంలోనైనా కాంట్రాక్టును రద్దు చేయుటకు, నిలుపుదల చేయుటకు కమిషనర్ సంపూర్ణ అధికారాలు కలిగి ఉంటారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీలు వారి కొటేషన్‌లను 26-05-2025 నుంచి మొదలు మెదక్ మునిసిపాలిటీలో మొదలు. కొటేషన్‌ల సమర్పణకు చివరి తేదీ 30-05-2025 సాయంత్రం 4 గంటల వరకు సమర్పించవచ్చు. దరఖాస్తుదారుడు కొటేషన్‌లో ధరను పేర్కొనాలి, అనగా (24 నెలలు) కాలానికి "చికెన్, మటన్ మరియు చేపల వ్యర్థాల కలెక్షన్స్ ఫీ". ఏవైనా సందేహాలు ఉంటే , అలాగే ఇఒఐ డాక్యుమెంట్‌ల ఇతర నిబంధనలు, షరతుల కొరకు దయచేసి కమిషనర్, మెదక్ మునిసిపాలిటీ, లేదా మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, మెదక్ మునిసిపాలిటీ 9154293322 (లేదా) మెదక్ మునిసిపాలిటీ కార్యాలయంలో ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు సంప్రదించవచ్చును. గమనిక : ఇఒఐను రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు కమిషనర్ సర్వాధికారి.
Sd/-కమిషనర్, మెదక్ మునిసిపాలిటీ
DIPR R.O.No: 2432-PP/CL/ADVT/1/2025-26 Date: 24-05-2025

తెలంగాణ ప్రభుత్వము
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్ III A లోని 10A అనుసరించి) (చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10A మినహాయింపు కలదు) (నిబంధన 6/12 చూడుము)
**ఫారం-6**
( ప్రాథమిక ప్రకటన )
గెజిట్ నెం. 24/2025/ తేది: 23-05-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.జి/2190/2025 తేది: 08-05-2025
ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.ఎ/41/2025 తేది: 06-05-2025
తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలము, రహీంఖాన్ గూడ గ్రామములో విస్తీర్ణం ఎ.4.25 గుంటల భూమి ప్రజాప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.
ప్రభుత్వము ఉత్తర్వుల నెం.108 I&CAD (LA.R&R/A2) శాఖ తేది: 31-10-2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.
కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలము, రహీంఖాన్ గూడ గ్రామములో విస్తీర్ణం ఎ.4.25 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.
జిల్లా : యాదాద్రి భువనగిరి మండలము: బీబీనగర్ గ్రామం : రహీంఖాన్ గూడ

| సర్వే నెం./భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గు) | పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు | అనుభవదారుని పేరు మరియు తండ్రి/భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు/ కట్టడములు |
|---|---|---|---|---|
| 23 ఖుష్కి/లావుని పట్టా 0.03 | కునోజి జయమ్మ భర్త బస్వాయ్య | కునోజి జయమ్మ భర్త భర్త బస్వాయ్య | 0.03 | - |
| 33 ఖుష్కి/లావుని పట్టా 0.12 | పిట్ట నర్సి రెడ్డి తండ్రి కిష్ట రెడ్డి | పిట్ట నర్సి రెడ్డి తండ్రి కిష్ట రెడ్డి | 0.12 | - |
| 33 ఖుష్కి/లావుని పట్టా 1.00 | బెజవాడ రాజారాం తండ్రి నర్సింహా | బెజవాడ రాజారాం తండ్రి నర్సింహా | 1.00 | - |
| 35 ఖుష్కి/పట్టా 2.29 | ప్లాట్లు | ప్లాట్లు | 2.29 | - |
| 37 ఖుష్కి/పట్టా 0.21 | ప్లాట్లు | ప్లాట్లు | 0.21 | - |
| | | మొత్తం : | 4.25 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబధిత వ్యక్తులందరికి తెలియజేయుటకు గాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.
భూమి యొక్క ప్లాను, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేది నుండి నోటిఫికేషన్ ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.
సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేది నుండి 60 (అరవై) దినముల లోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.
సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ & ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా.
సం/- జాయింట్ కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి
DIPR Ro.No.147/LA-PP/Advt/Pub/2025-26




## నకిలీ సూర్యోదయం!



చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లోని జెన్ఝౌ నగరంలో తీవ్రంగా పొగమంచు కమ్ముకోవడం తో ప్రజలు సూర్యోదయాన్ని చూడలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల నిరుత్సాహాన్ని తొలగించేందుకు, అక్కడి ప్రభుత్వం లేదా స్థానిక మీడియా సంస్థ ఒక పెద్ద ఎల్ ఇడి స్క్రీన్‌ను నగరంలోని ప్రముఖ స్థలంలో అమర్చి, నకిలీ సూర్యోదయం చూపించారు. ఈ స్క్రీన్‌లో ఉదయ వేళల్లో సూర్యుడు తక్కువ గుండ్రంగా, తేటగా కనిపించేలా వీడియోను ప్రసారం చేశారు. ప్రజలు ఆ దృశ్యాన్ని చూస్తూ నిజంగా సూర్యోదయమే అని అనుభూతి పొందారు. కొంతమంది ఆశ్చర్యపోతే, మరికొంత మంది దీనిని హాస్యంగా తీసుకున్నారు. సోషల్ మీడియాలో ఇది 'ఫేక్ సన్ రైజ్' అనే పేరుతో విస్తృతంగా చర్చకు దారితీసింది. ఏకకాలంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని చూపించే ఘట్టంగా కూడా నిలిచింది, అలాగే పర్యావరణ కాలుష్య స్థాయిని ప్రజల దృష్టికి తెచ్చింది. 'మనం ప్రకృతిని కోల్పోతున్నామా?' అనే ప్రశ్నను కూడా ఈ ఘటన తెరపైకి తెచ్చింది.

## సెల్ఫీ కోసం పాట్లు



సోషల్ మీడియాలో రీల్స్, స్టేటస్‌లు పెట్టుకోవడం ఒక్కోసారి వెర్రితలలు వేస్తున్నది. ఇందుకు ఉదాహరణగా జపాన్‌లో ఇటీవల జరిగిన ఒక విచిత్ర ఘటనను పేర్కోవచ్చు. ఫుజి పర్వత ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక యువకుడు, ట్రైన్‌లో ప్రయాణిస్తూ ఓ అద్భుతమైన దృశ్యం చూశాడు. మేఘాల నడుమ నింగిలో తేలియాడుతున్నట్టున్న మౌంట్ ఫుజి పర్వతం కనిపించేసరి కి, ఆ అద్భుత దృశ్యాన్ని సెల్ఫీలో బంధించాలని అనుకున్నాడు. కానీ దానికి ట్రైన్ వేగంగా వెళ్లడంతో అది సాధ్యపడలేదు. అయితే, తన ప్రయత్నాలను విరమించుకోని అతను ఎమర్జెన్సీ స్టాప్ బటన్ నొక్కేశాడు. ఫలితంగా ట్రైన్ వెంటనే ఆగిపోయింది. ఇది జపాన్ రైల్వే నియమాలకు పూర్తి విరుద్ధం. ట్రైన్ ఆగిపోవడం వల్ల ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. అయితే అతను మాత్రం పట్టించుకోకుండా ట్రైన్ దిగి వెళ్లి సెల్ఫీలు తీసుకున్నాడు. ఇదేమిటని రైల్వే సిబ్బంది ప్రశ్నిస్తే, 'ఇది ఒక జీవితంలో ఒక్కసారి వచ్చే అవకాశం.. కాబట్టి దానిని వదులుకోలేను' అని సమాధానం ఇచ్చాడు. నిబంధనలకు భిన్నంగా వ్యవహరించిన అతనిని పోలీసులు అరెస్టు చేసి జరిమానా విధించారు. జపాన్‌లో ఈ ఘటన 'సెల్ఫీ మేనియా'కు నిదర్శనంగా మారింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కాగా, కొంతమంది అతని ధైర్యాన్ని మెచ్చుకున్నారు, మరికొంతమంది బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఏదిఏమైనా ఆధునిక యుగంలో టెక్నాలజీ మోజు ఎక్కడికైనా నడిపిస్తుందని మరోసారి చాటిచెప్పిన సంఘటనగా దీనిని పేర్కోవచ్చు.

## కోతుల కోసం డిస్కో పార్టీ!



బ్రెజిల్‌లోని ఒక అభయారణ్యంలో కోతులకోసం ప్రత్యేకంగా డిస్కో పార్టీ ఏర్పాటు చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అక్కడి జంతు సంరక్షణ కేంద్రంలో ఉన్న కోతులు ఇటీవల ఉద్విగ్నంగా, నిరుత్సాహంగా మారుతున్నట్టు నిర్వాహకులు గమనించారు. మానసిక ఉల్లాసం కోసం కొత్తదైన ప్రయోగంగా, కోతుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు, వారు మ్యూజిక్ థెరపీని ప్రవేశపెట్టారు. కానీ అది సాదా సంగీతం కాకుండా, లైటింగ్, స్పీకర్లు, రంగురంగుల లైట్లతో కూడిన డిస్కో స్టైల్ పార్టీగా రూపొందించారు. దీనికి కోతులు సానుకూలంగానే స్పందించాయి. అవి ఆనందంగా దూకుతూ, గంతులు వేస్తూ, డ్రమ్స్ మీద కొట్టడం లాంటి వినోదాన్ని ఆస్వాదించాయి. ఈ వినూత్న ప్రయత్నం వైద్య మరియు పర్యావరణ నిపుణుల మెప్పు కూడా పొందింది. ఇది 'పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్ స్టిములేషన్'కు ఒక ఉదాహరణగా నిలిచింది.

## సెలబ్రిటీ ఎలుకలు



ఇంగ్లాండ్‌లో ఎలుకల సమస్య రోజురోజుకూ పెరుగుతున్నది. నగరంలో ప్రస్తుతం వ్యాపారానికి ఉపయోగించని కేఫే భవనం.. మానవులకే కాదు, ఎలుకలకూ సొంతిల్లులా మారింది. అదే కేఫే మొదట్లో మూతపడిన తర్వాత అటువైపు ఎవరూ సంచరించకపోవడంతో, కొన్ని ఎలుకలు అక్కడ నివాసం ఏర్పరచుకున్నాయి. అవి భవనాన్ని ఆక్రమించడమే కాకుండా, మనుషుల్లా ప్రవర్తించటం మొదలుపెట్టాయట.. కెమెరాల్లో ఎలుకలు ఎక్కి టీ కప్పులను దగ్గరగా లాగుతూ కనిపించాయి. కొన్ని ఎలుకలు చెయ్యి కడుక్కోవడం వంటి చర్యలతో హావభావాలను ప్రదర్శించా యి. కొందరు స్థానికులు వాటికి జాక్, మిల్లీ, చీకి అంటూ పేర్లు కూడా పెట్టారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో, ఆ ఎలుకలు సెలబ్రిటీలుగా మారిపోయాయి. చాలామంది ప్రతిరోజూ ఆ భవనానికి వచ్చి వాటిని కెమెరాల్లో బంధిస్తున్నారు. కొందరు సెల్ఫీలు దిగుతున్నారు. మొత్తానికి ఈ కేఫే ఇప్పుడు 'ర్యాట్ కేఫే'గా పాపులర్ అయింది. కాగా, లండన్ నగర పాలక అధికారులు ఈ పరిస్థితిని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ ఎలుకల కాలనీని తొలగించేందుకు చర్యలు ప్రారంభించారు. అయితే పలువురు పర్యావరణ వేత్తలు, జంతుప్రేమికులు, 'వాటిని హాని చేయకుండా వేరే చోటకు తరలించండం'టూ విజ్ఞప్తులు మొదలు పెట్టారు. ఎంతైనా అవి సెలబ్రిటీ ఎలుకలు కదా!

## కుక్కకి డ్రైవింగ్ లైసెన్స్?

హాంబర్గ్ (జర్మనీ)లో ఒక వ్యక్తి తన పెంపు డు కుక్కతో డ్రైవింగ్ చేయించాడు. ఇదేమని ప్రశ్నించిన అధికారులకు తన కుక్కకు డ్రైవింగ్ లైసెన్స్ ఉందని చెప్పాడు. అసలు సంగతేంటంటే.. సదరు వ్యక్తి ఒక రోజు సరదాగా, కుక్కను కారులో ముందుసీట్లో స్టీరింగ్‌పైన కూర్చోబెట్టాడు. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కారు కావడం వల్ల, నెమ్మదిగా డ్రైవ్‌చేస్తూ వీడియో తీశాడు. కుక్క రెండు ముందు కాళ్లతో స్టీరింగ్ తిప్పుతున్నట్టు ఆ వీడియో కనిపించింది. ఓ చిన్న స్పీకర్ ద్వారా 'లెఫ్ట్ తీసుకో', 'బ్రేక్ వెయ్యి' అంటూ సూచనలు ఇవ్వడం కూడా అందులో ఉంది. ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. తనకే కాదు.. తన కుక్కకు సైతం డ్రైవింగ్ లైసెన్స్ ఉందని తొలుత అతను బుకాయించాడు. కొద్దిసేపు వాదోపవాదాల అనంతరం అతను చూపిన డ్రైవింగ్ లైసెన్స్‌ను చూసి విస్తుపోవడం పోలీసుల వంతైంది. అందులో, కుక్క పేరు ఫ్రిట్జీ వోన్ బర్క్‌గా, లైసెన్స్ టైప్ 'కేనైన్ క్లాస్ సి'గా ఉంది. సంతకం ఉండాల్సిన చోట, కుక్క కాలి గుర్తు ఉంది. దీనిని నిశితంగా పరిశీలించిన అధికారులు, నకిలీదని తేల్చారు. వీడియో తీసిన కారును సీజ్ చేసి, అతనికి జరిమానా విధించారు. ఏమైతేనేం. ఆ కుక్కకు మాత్రం ఒక్కసారిగా సెలబ్రిటీ హోదా వచ్చేసింది.

## విచిత్ర వివాహం



రెండు పెళ్లిల్లు చేసుకొని, విడాకులిచ్చి, ముచ్చటగా మూడో పెళ్లి చేసుకోవడం అరుదుకావచ్చుగానీ.. అసాధారణమేమీ కాదు. అయితే, అమెరికాలో ఓ వ్యక్తి చేసుకున్న మూడో పెళ్లి మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. ఇంతకీ అతను పెళ్లి చేసుకున్నది మనిషిని కాదు... కృత్రిమ మేధ (ఎఐ) వాయిస్ అసిస్టెంట్ కంఠాన్ని. కేవలం వినిపించడమే తప్ప, కనిపించకపోయినా, అది ఒక యంత్రమని తెలిసినా.. ఒహియో రాష్ట్రానికి చెందిన 41 ఏళ్ల ఇంజనీర్ ఆ వాయిస్ అసిస్టెన్స్‌నే వివాహం చేసుకున్నాడు. ఆ వాయిస్ అతనికి ధైర్యం చెప్పడం, ఒంటరితనా న్ని తగ్గించడం, జీవితంపై ఆశ పెంచడం మొదలైన అనేక సానుకూల భావాలను కలిగించిందట. కొన్ని నెలల పాటు 'ఆన్‌లైన్ సంభాషణలు' తర్వాత, అతను నిర్ణయం తీసుకున్నాడట. అనుకున్న దే తడవుగా ఇంట్లో వివాహ వేడుక నిర్వహించాడు. స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి తంతు పూర్తి చేసుకున్నాడు. ఈ పెళ్లిని చూసి కొంతమంది నవ్వుకుంటే, మరికొంత మంది ఇటీవల కాలంలో మనుషులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడికి సంకేతమని పేర్కొంటున్నారు.

**బిఎస్‌ఎస్ మైత్రేయి**

## బంగ్లాలో మోహరిస్తున్న శక్తులు

బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం గత 72 గంటల్లో తీవ్రస్థాయికి చేరింది. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరపాలి, అందుకు సన్నాహకంగా తీసుకోవలసిన చర్యల విషయంలో చీఫ్ అడ్వయిజర్ డాక్టర్ ముహమ్మద్ యూనుస్ ఒత్తిళ్ల మధ్య నలిగిపోతున్నారు. యూనుస్ రాజీనామాకు సిద్ధంకాగా, అవామీలీగ్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం నడిపి, ఇప్పుడు రాజకీయ పార్టీగా ఏర్పడిన విద్యార్థి నాయకుల విజ్ఞప్తిమేరకు ఆయన ఆ ఆలోచన విరమించుకున్నట్లు ఢాకా వార్తలు తెలుపుతున్నాయి. బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిగి రాజకీయ పరిస్థితులు కుదుటబడేవరకు అక్కడి పరిణామాలు పెద్ద పొరుగుదేశంగా భారత్‌కు ఎంతో ఆసక్తిదాయకం.

విద్యార్థుల ఒత్తిడిపై అవామీలీగ్‌ను నిషేధించిన దరిమిలా బంగ్లాదేశ్‌లో రాజకీయ విభజన ప్రస్తుతం ద్విముఖంగా ఉంది. ఒకటి, విద్యార్థులు ఏర్పాటు చేసిన నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి). రెండు, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి). దీనికి సైన్యాధిపతి వకార్ ఉజ్ జమాన్ తోడ్పాటు ఉంది. మూడో ప్రధాన శక్తి జమాతె ఇస్లామీ చీలికలు పీలికలుగా ఉంది. వారి ఒకప్పటి మిత్రపక్షం బిఎన్‌పి నుంచి అత్యధికులు దూరమై, డాక్టర్ యూనుస్‌ను బలపరుస్తున్నారు.

ఎన్‌సిపి మద్దతుదారులుగా ఉన్న యూనుస్ ముఖ్యసలహాదారులు కొద్దిమందిని తొలగించాలని బిఎన్‌పి గురువారం డిమాండ్ చేసింది. అంతకుముందు వారం ఆర్మీ చీఫ్‌తో సమావేశంలో పరిపాలనలో లోపాలపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు యూనుస్. ఈ ఒత్తిళ్ల మధ్య యూనుస్ రాజీనామాకు సిద్ధపడగా, అది తెలిసిన ఎన్‌సిపి ప్రధాన కార్యదర్శి నహిద్ ఇస్లాం వెంటనే ఆయన్ను కలిసి ప్రస్తుత రాజకీయ కల్లోలం ముగిసేవరకు పదవిలో కొనసాగాలని నచ్చజెప్పారు. యూనుస్ మనసు మార్చుకున్నారని చెప్పబడుతున్న ది. అసంఖ్యాకంగా జరుగుతున్న ప్రదర్శనలతో తాను 'బందీ'లా ఉన్నానని, రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రాకపోతే తాను పనిచేయలేనని యూనుస్ చెప్పినట్లు ఎన్‌సిపి నేత చెప్పారు.

**ప్రజాపక్షం 25-05-2025, ఆదివారం**

ఎన్నికలు ఎప్పుడు జరపాలన్నది రాజకీయ పార్టీల మధ్య ప్రధాన వివాదంగా ఉంది. డిసెంబర్‌లోపు ఎన్నికలు కోరుతున్నది బిఎన్‌పి. ప్రభుత్వ సలహాదారులు మహ్‌ఫుజ్, ఆసిఫ్, జాతీయ భద్రతా సలహాదారు ఖలిలుర్ రెహ్మాన్‌లను తక్షణం తొలగించాలని గురువారం డిమాండ్ చేసింది. మరోవైపున రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో విషం చిమ్ముకుంటున్నారు. ఇదిలావుండగా, ప్రస్తుత ఎన్నికల కమిషన్ కింద తాము ఏ ఎన్నికల్లోనూ పాల్గొనబోమని, దాన్ని పునర్నిర్మాణం చేయాలని కోరుతూ ఎన్‌సిపి నాయకులు బుధవారం ప్రదర్శన తీశారు. ఇసి బిఎన్‌పి ఆఫీసుగా పనిచేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ ఆర్థిక, లా, ప్రణాళిక సలహాదారులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సంస్కరణలు చేశాక, నిషేధించబడిన అవామీ లీగ్ నాయకులపై విచారణ తర్వాత మాత్రమే ఎన్నిక లు జరపాలంటున్నారు.

విద్యార్థి నాయకులు ఫిబ్రవరిలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకున్నాక, వారికి బిఎన్‌పితో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యూనుస్ ఎన్‌సిపి ప్రభావంలో ఉన్నారని, వారి ఒత్తిడిమీదటే అవామీలీగ్‌ను నిషేధించారని భావించబడుతున్నది. ఈ నిర్ణయంతో బిఎన్‌పి, ఆర్మీ చీఫ్ ఏకీభవించలేదు. గత పాలక పార్టీ అయిన అవామీ లీగ్‌ను ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధిస్తే ఎన్నికల నిర్వహణ చట్టబద్ధత పట్ల విదేశాల్లో అనుమానాలు ఏర్పడతాయని బిఎన్‌పి భావిస్తున్నది. అందువల్ల విద్యార్థి తిరుగుబాటు సందర్భంలో కేసులు ఎదుర్కొంటున్న అవామీ నాయకులను మినహాయించి ఎన్నికల్లో పాల్గొనేందుకు అవామీ లీగ్‌ను అనుమతించాలనేది బిఎన్‌పి వాదన. ఎన్నికల కమిషన్‌ను పునర్నిర్మించాలని కోరటం ద్వారా ఎన్‌సిపి ఎన్నికల వాయిదాను కోరుతున్నదని బిఎన్‌పి అనుమానిస్తున్నది. లండన్‌లో ఆరోగ్య చికిత్స నుంచి బిఎన్‌పి నాయకురాలు ఖలీదా జియా తిరిగి వచ్చాక పార్టీ నాయకులను కలుపుకుంటూ పార్టీని ఎన్నికలకు సిద్ధం చేస్తుండగా, ఎన్‌సిపి ప్రజాసంఘాల నిర్మాణంలో ఉంది.

ఎన్నికలు ఎప్పుడూ జరిగినా పార్టీని, ప్రజలను సమాయత్తం చేసేందుకుగాను బిఎన్‌పి, ఎన్‌సిపి రెండూ జూన్, జులై మాసాల్లో పెద్ద ఎత్తున వీధి ప్రదర్శనలకు సన్నాహాలు చేస్తున్నాయి. ఎన్నికల క్రతువు ముగిసేవరకు డాక్టర్ యూనుస్‌కు ఒత్తిళ్ల తలనొప్పి తప్పదు. సైన్యాధిపతి వ్యతిరేకంగా ఉండటం ఆయనకు అతి పెద్ద శిరోభారం.

# సంక్షోభంలో రైతు – కాపాడుకునే చర్యలేవీ?



పులి రాజు
9908383567

77ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పండించిన పంటలకు, ధరలపైన స్వతంత్రం రాని ఒకే ఒక వ్యక్తి రైతు. ఆదాయ భద్రతలేని ఏకైక రంగం వ్యవసాయరంగం. వ్యవసాయదారుడు అంటేనే సమాజంలో ఒక చిన్న చూపు, ఆదాయం మాట పక్కన పెడితే కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకుంటు న్న రైతులను చూసి నేటి యువతరం వ్యవసాయం చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు. వ్యవసాయంలో ఉన్న యువతరం వ్యవసాయాన్ని వదిలి వేరే మార్గాన్ని వెతుక్కుంటున్నారు. వ్యవసాయానికి అత్యంత ప్రధానమైన నాగలి, ఎడ్లు, గొర్రు, కొడవలి లాంటివి ఇప్పటి తరానికి తెలవకుండా పోయిన సంగతి తెలిసిందే! భవిష్యత్తులో పై వాటిని, మరియు రైతులను మ్యూజియంలో చూసే పరిస్థితి వచ్చేటట్లు ఉంది. భారత వ్యవసాయం సంక్షోభం లో లేదు, కానీ రైతు మాత్రమే సంక్షోభంలో ఉన్నాడు.

మన దేశంలో ప్రతి అర్థగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రతిరోజు సుమారు 2 నుండి 3 వేల మంది రైతులు వ్యవసాయరంగాన్ని వదిలి ఇతర రంగాలకు వెళ్ళిపోతున్నారు. ఇంకా 40 శాతం మంది రైతులు వ్యవసాయం అంటే ఇష్టం లేకున్నా, నష్టాలను మూటగట్టుకుంటున్న కూడా వ్యవసాయం ఎందుకు చేస్తున్నారంటే భార్య, పిల్లలను, తల్లిదండ్రులను, ఊరును, బంధువులను వదిలిపెట్టలేక వ్యవసాయం చేస్తున్నారు.



NCRB లెక్కల ప్రకారం భారతదేశంలో 1995 నుండి 2022 వరకు 3,97,540మంది రైతులు, తెలంగాణలో 33,325 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారిక లెక్కలు వివరిస్తున్నాయి. (2023–2024 సంవత్సరాల వివరాలు NCRB విడుదల చేయలేదు.) పై ఆత్మహత్యల్లోకి కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు కూడా లెక్కలోకి రారు. ప్రభుత్వ లెక్కలకు అందని రైతుల ఆత్మహత్యలు ఇంకా ఎన్ని ఉన్నాయో ఆలోచించండి!

దేశ జనాభాకు సరిపోయే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ రంగం బాగానే ఉంది. కానీ ఆ ఉత్పత్తికి మూలకారణమైన వ్యవసాయదారుడు మాత్రం అప్పుల ఊబిలోకి నెట్టబడి దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్న దృశ్యాన్ని మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.

భూమి అనేది ఆకలితీర్చే కన్నతల్లి లాంటిది. ఆ భూమి భవిష్యత్ తరాలకు వారసత్వ సంపద! కానీ ఇప్పుడు తెలంగాణలో ఆ గ్రామ రైతుల చేతుల నుండి ఆ గ్రామస్తులు కాని, రైతులు కాని రైతుల చేతుల్లోకి భూమి వెళ్ళిపోయింది. ఒకప్పు డు భూమి అంటే పంటలు పండించే ఒక ప్రధాన సాధనం, ఒక బతుకుదెరువు,ఆ కుటుంబానికి వారసత్వ సంపద, ఒక భరోసా!

ఇప్పుడు భూమి అంటే సామాజిక హోదాకు ప్రతిరూపం. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రైతు బీమా, రైతు బంధు/రైతు భరోసా, పన్నుల మినహాయింపు లాంటి పథకాలను ఉపయోగించుకోవడాకి ఐదుగుంటల నుండి వందల ఎకరాలలో కొనుగోలు చేస్తున్నారు. మాకు భూమి ఉంది అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నారు. సాధారణ ఉద్యోగి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో వందల ఎకరాలు కొని ఫామ్‌హౌస్ కట్టుకొని సెలవు రోజులలో ఎంజాయ్ చేయడానికి ఉపయోగపడుతున్న పంట పొలాలు. ఇవాళ తెలంగాణలో రైతుల చేతిలో భూమి లేదు. భూమి పట్టా ఉన్నవారు రైతులు కారు.

తెలంగాణలో భూమి పట్టాదారుల సంఖ్య:

2018–19 లో 50,23,861 ; 2024–25 లో 70,60,000.

పట్టాదారులు పెరుగుతున్నారు కానీ రైతులు తగ్గుతున్నారు.

భూమి ఉండాలి కానీ ఆ కుటుంబం వ్యవసాయం చేయదు. వ్యవసాయం చేసే యువకులకు పిల్లను ఇవ్వడానికి ముందుకు రావడం లేదంటే అతిశయోక్తి కాదు.

సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం, తునికి ఖల్సా గ్రామంలో గ్రామస్తులకు 1133 ఎకరాలు ఉంటే ఇతరులకు 1203 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. నేటి యువతరం సెక్యూరిటీ గార్డ్‌గానైనా పని చేయడానికి సిద్ధపడుతున్నారు కానీ వ్యవసాయం చేయడానికి ఇష్టపడడం లేదు.

యువతరాన్ని వ్యవసాయం వైపు మళ్ళించాలంటే కొన్ని సూచనలు:

1.మనం వ్యవసాయదారులను గౌరవించాలి.
2. వ్యవసాయం బతుకులపైన భరోసా కల్పించాలి.
3.పెట్టిన పెట్టుబడులు తిరిగి రాబట్టుకునేటట్టు ఉండా లి.
4. పండిన పంటలకు లాభసాటి ధరలు ఉండాలి.
5. రుణ సౌకర్యం కల్పించాలి.
6. రైతు బీమాతో పాటు పంటల బీమాలు కచ్చితంగా అమలు చేయాలి.
7. రైతుల పిల్లలకు రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించాలి.
8. అభివృద్ధి పేరుమీద రైతుల దగ్గర నుండి బలవంతంగా పంట పొలాలను తీసుకోకూడదు.
9. ఆత్మహత్య చేసుకుంటే కుటుంబం ఎట్లా నష్టపోతుందో చూపించాలి.
10. మార్కెటింగ్ సౌకర్యం, నకిలీ విత్తనాలు అరికట్ట డం.
11. ప్రభుత్వ పథకాలు నిజమైన రైతులకి అందాలి.
12. వ్యవసాయ భూములు కచ్చితంగా వ్యవసాయదారులు కొనుగోలు చేసే చట్టాలు రావాలి.
13. పార్లమెంట్ అసెంబ్లీ వ్యవసాయరంగం పైన ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి.

రైతు రాజీనామా చేస్తే భారతదేశానికి భవిష్యత్తు లేదు. భవిష్యత్తులో ఆహారం కొరత ఏర్పడే అవకాశం ఉంది కాబట్టి రైతును గౌరవిద్దాం! కాపాడుకుందాం!! రైతుల ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మించుకుందాం.

# ధిక్కారమున్ సైతునా? కెసిఆర్

టిఆర్‌ఎస్ /బిఆర్‌ఎస్ ఆవిర్భవించినప్పటి నుండి తొలిసారిగా ఒక విచిత్రమైన సంకట పరిస్థితుల్లో చిక్కుకున్నది. అనేక సవాళ్ళను, ఉనికి ప్రమాదాలను ఎదుర్కొన్నప్పటికీ ఉద్యమ బలం, ప్రభుత్వంలోకి వచ్చాక అధికార బలంతో వాటిని అధిగమించగలిగింది. ఈ వారంలోనే బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు ఆయనకు అత్యంత ఇష్టమైన కుమార్తె, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కె.కవిత రాసిన లేఖ బైటికి రావడం ఆ పార్టీతో పాటు రాష్ట్రంలో కూడా కలకలం రేపింది. ఆ లేఖ విషయంలో ఎలా స్పందించాలో తెలియక బిఆర్‌ఎస్ నాయకులు సతమతమయ్యారు. విమర్శిద్దామంటే అధినేత కుమార్తె అయిందని, సమర్థిద్దామంటే లేఖలో ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్‌ఎస్ సభలో నెగెటివ్ పాయింట్స్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్లు ఉండడంతో ఎటూ పాలుపోకుండా అయింది గులాబీ నేతల పరిస్థితి. మీడియాతో స్పందించక తప్పనిపరిస్థితుల్లో కొందరు ఆ లేఖ ప్రతిపక్షాల సృష్టి అని, మరికొందరు ఆమె రాసిందే కానీ, ప్రభుత్వమే లీక్ చేసిందంటూ చేసిన వాదనలు సరిపోలేదు.

అమెరికా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగీదిగగానే మీడియాతో మాట్లాడుతూ ఆ లేఖ తానే రాసినట్లు కవిత స్వయంగా నిర్ధారించడంతో పార్టీలో అంతర్గత గుట్టు రచ్చకెక్కినట్లయింది. దీనికి తోడు ఒకవైపు కెసిఆర్ దేవుడంటూనే, మరోవైపు ఆయన చుట్టూ దయ్యాలున్నాయని, కోవర్టులు ఉన్నారని, వారే తన లేఖను లీక్ చేశారంటూ చేసిన వ్యాఖ్యలు బిఆర్‌ఎస్‌ను మరింత ఇరకాటంలోకి నెట్టేసాయి. అన్నిటిని మించి ఎయిర్‌పోర్ట్‌లో ఆమెను రిసీవ్ చేసుకునేందుకు వెళ్ళిన అభిమానులు 'సిఎం కవితక్క' అంటూ నినాదాలు చేయడంతో పాటు, బ్యానర్‌లలో ఆమెది తప్ప కెసిఆర్ లేదా ఇతర నాయకుల ఫోటోలే లేకపోవడం వంటి చర్యలతో ధిక్కారం బహిరంగంగానే ప్రదర్శితమైంది.

ఆది నుంచి ధిక్కారమున్ సైతునా? అనే మాటనే బలంగా అమలు చేసే కెసిఆర్ స్వంత కూతురు విషయంలో ఎలా వ్యవహరిస్తారని రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే, కెసిఆర్ స్వభావం, చర్యలు తెలిసిన వారందరికీ ఆయన తనను ఎవరైనా వ్యతిరేకించినట్లు వాసనొచ్చినా, లేశమాత్రం సందేహం వచ్చినా అలాంటి వారిని ఏ మాత్రం ఉపేక్షించరనేది తెలుసు. కనీసం వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని నైజం కెసిఆర్‌ది. చిన్న పామైనా పెద్ద కర్రతో చంపాలని ఆయన బలంగా నమ్ముతారు. గతంలో టిఆర్‌ఎస్‌లో తెలంగాణ సాధన సమితిని విలీనం చేసిన ఆలె నరేంద్ర, తల్లి తెలంగాణ పార్టీని విలీనం చేసిన విజయశాంతిలను, టిపిసిసి మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌లను కారణాలేమైనప్పటికీ పార్టీని వీడేలా చేశారు. మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ గులాబీ జెండాకు ఓనర్‌లు మేమే అంటూ చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా, మంత్రివర్గం నుంచి తొలగించి, బైటికి వెళ్ళేలా చేసిన ఉదంతం తెలంగాణ ప్రజల్లో తాజాగానే ఉన్నది. ఇలా అనేక ఉదంతాలు ఉన్నాయి.

**ఆ ఫీడ్‌బ్యాక్ బిఆర్‌ఎస్‌కే మంచిది**

అలాంటిది ఇప్పుడు కవిత ఏకంగా అధినేతకే సవాలు విసురుతుండడం పట్ల కెసిఆర్ ఏ విధంగా వ్యవహరిస్తారనే ఉత్కంఠ నెలకొంది. లేఖలో కవిత లేవనెత్తిన అంశాలు ప్రత్యర్థి పార్టీలకు ఆయుధాలను అందించడం ఒక ఎత్తైతే, పార్టీలో ఎంపిక చేసిన కొందరికే కెసిఆర్‌ను కలిసేందుకు అవకాశం దక్కుతుందని, పాత నాయకులు, మాజీ ఎంఎల్‌ఏలు, ప్రజా ప్రతినిధులకు కూడా కలుసుకునేందుకు అవకాశం లభించడం లేదనే ఆమె విసుర్లు సగటు బిఆర్‌ఎస్ కార్యకర్త, నాయకుల మదిని తొలిచేవే. వెంటనే ఒకటి, రెండు రోజులు ప్లీనరీ పెట్టి అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్న కవిత సూచన కూడా సమంజసమే. ఎందుకంటే బిఆర్‌ఎస్ నిర్మాణ వ్యవస్థను కొంత బహుజన సమాజ్ పార్టీ నుంచి స్వీకరించింది. అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఎంఎల్‌ఏలే సర్వస్వంగా, పార్టీ అయినా, ప్రభుత్వమైనా వారొక్కరిగానే ఉండేది. ఇంకొకరికి అవకాశాన్ని ఇచ్చే వారు కాదు. ఒకవేళ బిఆర్‌ఎస్ అభ్యర్థి ఓడిపోయినట్లయితే, ఆయనపై గెలిచిన ప్రత్యర్థి పార్టీ ఎంఎల్‌ఏ బిఆర్‌ఎస్‌లోకి ఫిరాయించినట్లయితే, అప్పటి వరకు ఉన్న నాయకుడిని సైతం పక్కనబెట్టి




కొత్తగా వచ్చిన ఎంఎల్‌ఏగా నియోజకవర్గ పార్టీ బాధ్యతలను అప్పజెప్పేవారు. దీంతో పార్టీ సంస్థాగత నిర్మాణం కింది వరకూ వ్యక్తి కేంద్రీకృతంగా సాగింది. ఉద్యమకారులకు ప్రత్యేక వసతులు లేవు, రజతోత్సవ సభలో మొదటి నుంచి పార్టీలో ఉన్నవారిని మాట్లాడించాల్సిందన్న కవిత ఫీడ్‌బ్యాక్ విస్మరించలేని నిజాలు.

లేఖలో అంశాలను నిజంగా సానుకూలంగా స్వీకరిస్తే బిఆర్‌ఎస్‌కే మంచిది. గతాన్ని తరచి చూస్తే అది సాధ్యం కాదనే పరిశీలకులు భావిస్తున్నారు. కవిత స్థానంలో మరొక నాయకులెవరైనా ఉంటే ఈపాటికే పార్టీ నుంచి బైటికి పంపేవారు. సాధారణంగా కెసిఆర్‌ను వ్యతిరేకించిన వ్యక్తుల వార్తలు, ప్రకటనలకు వారి ఛానల్‌లో తావు ఉండదు. కానీ, కవిత ఎయిర్‌పోర్ట్‌లో దిగి, మీడియాతో మాట్లాడిన ఘట్టం ఇతర మీడియా ఛానళ్ళతో సమానంగా వారి స్వంత ఛానల్‌లో ప్రత్యక్షప్రసారం అవడం, కొన్ని పదాలు మినహా వార్త స్వంత పత్రికలో ప్రచురితం అవడం ఆశ్చర్యాన్నే కలిగించింది. కవిత వ్యాఖ్యలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో ఉన్న ఆమె సోదరుడు స్పందిస్తూ అంతర్గత విషయాలను అంతర్గతంగానే ప్రస్తావిస్తే బాగుంటుందని, ఇది ఎవరికైనా వర్తిస్తుందని చెప్పడం ద్వారా ఆమె గీత దాటారనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

**పార్టీ పెడితే ఆ రెండు అంశాలే కీలకం**

కవిత విషయానికి వస్తే, తన లేఖ బహిర్గతమైన తరువాత అధినేత కెసిఆర్ స్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు స్పష్టమవుతోంది. అటు నుంచి పిలుపు రాకపోతే బిఆర్‌ఎస్ శ్రేణులు ఎంత వరకు ఆమెతో కలిసి ఉంటారనేది ప్రశ్న. మరోవైపు ఆమె స్వంత పార్టీ ఏర్పాటుకు కూడా వెనుకాడడం లేదనే ప్రచారం జరుగుతోంది. జనంలోకి వెళ్ళేందుకు ప్రధానంగా రెండు అంశాలను ఎంచుకున్నట్లు చెబుతున్నారు. ఒకటి సామాజిక న్యాయం, రెండు మహిళలు. జైలు నుంచి బైటికి వచ్చినప్పటి నుంచే ఆమె సామాజిక తెలంగాణ అంశాన్ని నెత్తికెత్తుకొని, బిసిల గురించే ప్రత్యేకించి మాట్లాడుతున్నారు. మహిళల విషయానికి వస్తే, గతంలో మహిళా రిజర్వేషన్ కోసం బిఆర్‌ఎస్ అధికారంలో ఉండగా కార్యక్రమాలను ఢిల్లీలో సైతం చేపట్టారు. వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగి, తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 153కు పెరిగే అవకాశం ఉంది. చట్టసభల్లో మూడవ వంతు మహిళా రిజర్వేషన్ ప్రకారం అందులో 51 స్థానాలు మహిళలకే కేటాయించబడతాయి. దీనిని ఒక అవకాశంగా మలుచుకోవచ్చు. ఎందుకంటే తెలంగాణలో జాగృతి సంస్థ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా తిరిగిన, స్వంత యంత్రాంగం కలిగిన అనుభవం కవిత సొంతం. ఎన్నికల నాటికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు కలిగిన మహిళా నాయకురాలిగా ఎదగవచ్చనే అంచనా. దానికి తోడు ఆకర్షణీయమైన సామాజిక న్యాయం నినాదం ద్వారా సగానికి పైగా ఉన్న జనాభాను ఆకట్టుకోవచ్చనే ఆలోచన ఉండనే ఉంది. ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ ఆచరణలో విజయం సాధించడమే అసలు సవాలు.

కవిత ముందడుగు వేయటం కంటే ముందు తన స్వంత కుటుంబం నుంచి ఎదురవుతున్న సవాలుపై బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరం. ఆయన ఎలాంటి చర్య తీసుకున్నప్పటికీ, భవిష్యత్తులో దాని పర్యవసానాలు ఎదుర్కోవాల్సిందే. ఒకవేళ కవితపై చర్య తీసుకుంటే, ఆమె వేసే ప్రశ్నలు కచ్చితంగా ఇబ్బందులు సృష్టించటమే కాకుండా, ప్రత్యర్థులకు అస్త్రాలు అందించినట్లే అవుతుంది. ఒకవేళ చర్య తీసుకోనట్లయితే, స్వంత కుటుంబ సభ్యులకు మినహాయింపును ఇవ్వడం భవిష్యత్తులో తిరుగుబాటు చేసే నాయకులకు అస్త్రంగా మారుతుంది. తెలంగాణ ఉద్యమంలో పది మంది ఎంఎల్‌ఏలు ఫిరాయించినా, గతంలో కంటే 2009లో తక్కువ స్థానాలలోనే గెలిచినా, హైదరాబాద్‌లో మేయర్‌గా ప్రకటించిన అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్నా, ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం నుంచి పెను సవాళ్ళను ఎదుర్కొన్నా, పార్టీ నుంచి నాయకులు దూరమైనా, ఓపికతో ఎదురు చూసి అందివచ్చిన అవకాశాన్ని ఒడుపుగా వాడుకున్న కెసిఆర్ చాణక్యం అందరూ చూసిందే. కుటుంబంలోనే తలెత్తిన ఇప్పటి ప్రత్యేక పరిస్థితికి ఎలాంటి పరిష్కారం చూపుతారనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గాజా డాక్టర్ ఇంటిపై దాడి
# ఐదుగురు పిల్లలు మృతి

**గాజా :** ఇజ్రాయెల్ సైన్యం శనివారంనాడు గాజాలో ఒక డాక్టర్ ఇంటిమీద దాడులు చేయడంతో ఆయనకున్న పదిమంది పిల్లలలో ఐదుగురు పిల్లలు మరణించారు. శనివారంనాటి దాడిలో తొమ్మిదిమంది మరణించారు. గడచిన ఇరవైనాలుగు గంటల్లో దాడుల్లో 74 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఖాన్‌యూనిస్‌లోని ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న మహిళా వైద్యురాలి నివాసంపై ఇజ్రాయెల్ సైన్యం దాడి చేసింది. నస్సెర్ ఆసుపత్రివర్గాల సమాచారం ప్రకారం, వైద్యురాలి భర్త, కొంతమంది పిల్లలు గాయాలతో దాడి నుండి బయటపడ్డారు. దాడి అనంతరం శిథిలాల నుండి మృతదేహాలను తొలగించిన వీడియో దృశ్యాలను మీడియాకు విడుదల చేశారు. కాగా ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటన చేస్తూ, శనివారంనాడు మొత్తం 100 లక్ష్యాలపై దాడులు చేశామని పేర్కొంది. గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ ఈ ఆసుపత్రిని నిర్వహిస్తోంది.

## పాక్ దాడుల్లో బాధితుల దుస్థితిని
# జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తా

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ హామీ

పూంచ్ జిల్లాలో షెల్లింగ్ బాధితులకు పరామర్శ

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలిన

చింతించకండి... సర్దుకుంటాయని పాఠశాల విద్యార్థులకు ఓదార్పు

పూంచ్ : ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ శనివారం జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో పర్యటించారు. పాకిస్థాన్ దళాలు జమ్ముకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లో జరిపిన కాల్పుల్లో బాధితులైన వారిని రాహుల్‌గాంధీ పరామర్శించారు. జరిగిన నష్టాన్ని 'పెద్ద విషాదం'గా అభివర్ణించారు. వారి దుస్థితిని జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తానని హామీనిచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పూంచ్ పట్టణాన్ని సందర్శించి, ఈనెల 7– 10వ తేదీ మధ్య జరిగిన షెల్లింగ్‌లో తమ సభ్యులను కోల్పోయిన కుటుంబాలతో సహా ప్రభావిత ప్రజలతో గంటకు పైగా సంభాషించారు. ఇది అతిపెద్ద విషాదమని, పాక్ చర్యల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. పౌరులను లక్ష్యంగా చేసుకుని నేరుగా వారిపై పాక్ దాడులు జరిపిందని చెప్పారు. తాను ప్రభావిత ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకోవడాని ప్రయత్నించానని చెప్పారు. వారంతా జాతీయ స్థాయిలో తమ సమస్యలను లేవనెత్తాలని అభ్యర్థించారని, వారి వినతి మేరకు తాను బాధితుల సమస్యలను ప్రస్తావిస్తానని హామీనిచ్చానని మీడియాకు వెల్లడించారు. ఆ తరువాతం ఎక్స్‌లో పోస్టు చేస్తూ తాను పూంచ్‌లో పాకిస్థాన్ దళాల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కలిశానని, దెబ్బతిన్న ఇళ్ళు, చెల్లాచెదురుగా ఉన్న వస్తువులను పరిశీలించానన్నారు. ఎటుచూసినా కన్నీటి గాథలే వినిపిస్తున్నారన్నారు. బాధి



కుటుంబాలకు అండగా నిలబడుతానని, జాతీయ స్థాయిలో వారి డిమాండ్లను, సమస్యలను కచ్చితంగా లేవనెత్తుతానని స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న జరిగిన దారుణమైన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత, తర్వాత కేంద్ర పాలిత ప్రాంతంలో రాహుల్ పర్యటించడం ఇది రెండవసారి.

విద్యార్థులను ఓదార్చిన రాహుల్

పాకిస్థాన్ కాల్పుల్లో తమ సహచరులైన 12 ఏళ్ల కవలలు జైన్ అలీ, ఉర్వా ఫాతిమా మరణించిన పాఠశాల విద్యార్థులను రాహుల్ గాంధీ శనివారం పరామర్శించారు. వారిని ఓదార్చారు. 'కష్టపడి చదువుకోండి, కష్టపడి ఆడుకోండి, చాలా మంది స్నేహితులను సంపాదించుకోండి' అని విద్యార్థులను ప్రోత్సహించారు. మరణించిన ఇద్దరు చిన్నారుల స్నేహితులతో సంభాషిస్తూ 'చింతించకండి, ప్రతిదీ సాధారణ స్థితికి వస్తుంది' అని అన్నారు. ఈ నెల ప్రారంభంలో భారత్–పాకిస్థాన్ సైనిక ప్రతిష్టంభన సమయంలో నియంత్రణ రేఖ వెంబడి భారీ కాల్పులకు గురైన పూంచ్ పట్టణంలో పర్యటన రాహుగాంధీ అలీ, ఫాతిమాను కోల్పోయిన కాన్వెంట్ పాఠశాల విద్యార్థులతో గంటపాటు సంభాషించారు. ఈనెల 7– 10వ తేదీ మధ్య పాక్ జరిపిన షెల్లింగ్ దాడుల్లో 28 మంది మరణించగా, 70 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఆ దాడులను పాఠశాల విద్యార్థులు తప్పించుకున్నప్పటికీ ఇద్దరు విద్యార్థులు మే 7న పూంచ్ పట్టణంలో మరణించారు.

'మీరు కొంచెం ప్రమాదాన్ని చూశారు, కొంచెం భయానక పరిస్థితిని చూశారు. కానీ చింతించకండి, ప్రతిదీ సాధారణ స్థితికి వస్తుంది. ఈ సమస్యకు మీరు స్పందించే విధానం ఏమిటంటే మీరు నిజంగా కష్టపడి చదవడం, మీరు నిజంగా కష్టపడి ఆడటం, పాఠశాలలో చాలా మంది స్నేహితులను సంపాదించుకోవడం. సరేనా? మీరు అలా చేస్తారా? మంచిది' అని గాంధీ క్రైస్ట్ స్కూల్ విద్యార్థులతో అన్నారు. జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సయ్యద్ నసీర్ హుస్సేన్, ఎఐసిసి జనరల్ సెక్రటరీ జిఎ మీర్, జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా, మాజీ మంత్రులు వికార్ రసూల్ వాని, లాల్ సింగ్ వంటి నాయకులతో కలిసి రాహుల్ గాంధీ సింగ్ సభ గురుద్వారాలో నివాళులర్పించారు. కాగా, శనివారం ఉదయం, మాజీ కాంగ్రెస్ చీఫ్ జమ్ము విమానాశ్రయానికి చేరుకుని, సరిహద్దు షెల్లింగ్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించడానికి, మృతుల కుటుంబాలను కలవడానికి హెలికాప్టర్‌లో పూంచ్‌కు బయలుదేరారని పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు.

# జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు అగ్రనేత మృతి



**లాతేహార్ :** జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత పప్పు లోహ్రాతో పాటు ఆయన సహచరుడు ఎదురు కాల్పుల్లో మరణించారు. అదే విధంగా ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక భద్రతా దళ సిబ్బంది కూడా గాయపడ్డారు. పోలీసుల సమాచారం ప్రకారం, లతేహార్‌లోని ఇచాబార్ అడవిలో భద్రతా దళాలు, నక్సలైట్లకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో జార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) చీఫ్ పప్పు లోహ్రా మృతి చెందాడు. ఇతడి తలపై రూ.10 లక్ష ల రివార్డు ఉంది. ఇదే ఎన్‌కౌంటర్‌లో మరో జెజెఎంపి మావోయిస్టు ప్రభాత్ గంజ్ కూడా హతమయ్యారు. అతడిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. కాగా, ఈ కాల్పుల్లో తీవ్ర గాయాలపాలైన ఓ మావోయిస్టు సజీవంగా పట్టుబడ్డాడు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఉమ్మడి భద్రతా దళాలు ఈ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ భీకర కాల్పుల్లో గాయపడిన స్థితిలో జెజెఎంపికు చెందిన మావోయిస్టు సజీవంగా పట్టుబడ్డాడు. సంఘటనా స్థలం నుంచి పోలీసులు ఒక ఇన్సాస్ రైఫిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల ఏరివేతకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ధృవీకరించారు. కాగా, ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందగా, వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ కూడా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# ఇపిఎఫ్ వడ్డీరేటు ఖరారు

**న్యూఢిల్లీ :** ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) నిల్వలపై 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వడ్డీ రేటును కేంద్రం ఖరారు చేసింది. వడ్డీ రేటు ను 8.25 శాతంగా నోటిఫై చేసింది. ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ ఫిబ్రవరి 28న ప్రతిపాదించిన వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం యథాతథంగా ఆమోదించింది. అయితే 2023–24 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీరేటు చెల్లించారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీ య అధ్యక్షతన ఫిబ్రవరి 28న ఢిల్లీలో జరిగిన ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ 237వ సమావేశంలో వడ్డీ రేటుపై నిర్ణయం తీసుకున్నారు. 8.25 శా తం వడ్డీ రేటును నిలుపుకోవాలని నిర్ణయించారు. అనంతరం ఆర్థిక మంత్రి త్వ శాఖ సమ్మతి కోసం పంపారు. ఇప్పుడు కేంద్రం ఇపిఎఫ్ వడ్డీరేటు నోటిఫై చేసిన నేపథ్యంలో త్వరలో 7కోట్ల మంది చందాదారుల ఖాతాల్లో జమ కానుంది. గత ఏడాది ఫిబ్రవరిలో 2023–24 సంవత్సరానికి వడ్డీ రేటును స్వల్పంగా 8.25 శాతానికి పెంచారు. 2022–23లో వడ్డీ రేటు 8.15 శాతం గా ఉంది. 2022 మార్చిలో 2020–21లో 8.5 శాతంగా ఉన్న వడ్డీ రేటును 2021–22 సంవత్సరానికి నాలుగు దశాబ్దాల కనిష్ఠ స్థాయి 8.1 శాతానికి తగ్గించారు. 2020–21 సంవత్సరానికి 8.10 శాతం వడ్డీ రేటు చెల్లించారు. కాగా, ఉమాంగ్ యాప్ ద్వారా పిఎఫ్ వడ్డీ అకౌంట్‌లో డిపాజిట్ అయ్యిందో లేదో చెక్ చేసుకోవచ్చు. రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయ్యాక, యాప్‌లో ఇపిఎఫ్ఒ సర్వీసెస్ విభాగంలోకి వెళ్లి యుఎఎన్, ఒటిటి ఎంటర్ చేయాలి. ఆ తర్వాత బ్యాలెన్స్, పాస్ బుక్ వంటి ఆప్షన్స్ కనిపిస్తాయి. తద్వారా బ్యాలెన్స్, మినీ స్టేట్‌మెంట్‌తో తెలుసుకోవచ్చు.

# మరో గూఢచారి అరెస్టు

పాక్‌కు భారత రక్షణ రహస్యాలు చేరవేత



**గాంధీనగర్ :** భారత సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) భారత వైమానిక దళం (ఐఎఎఫ్)కు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్‌తో పంచుకున్నందుకు ఒక వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. దీనికి సంబంధించి గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) సహ్‌దేవ్ సింగ్ గోహిల్‌ను అరెస్టు చేసింది. అరెస్టును ధృవీకరించిన గుజరాత్ ఎటిఎస్ కేసు వివరాలను వెల్లడించింది. గుజరాత్ ఎటిఎస్ కచ్‌కు చెందిన మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ అయిన సహ్‌దేవ్ సింగ్ గోహిల్‌ను అరెస్టు చేసింది అని ఎటిఎస్ ఎస్పీ సిద్ధార్థ్ అన్నారు. అతను బిఎస్ఎఫ్, ఐఎఎఫ్‌కు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్ ఏజెంట్‌తో పంచుకుంటున్నాడని మాకు సమాచారం ఉంది అని ఆయన తెలిపారు. సహ్‌దేవ్ సింగ్ గోహిల్ కచ్‌కు చెందిన ఒక ఆరోగ్య కార్యకర్త. ఎటిఎస్ వివరాల ప్రకారం, గోహిల్‌ను ఈనెల 1న ప్రాథమిక విచారణ కోసం పోలీసులు పిలిచారు. ఈ విచారణలో గోహిల్ 2023 జూన్, జూలై నెలల్లో వాట్సాప్‌లో అదితి భరద్వాజ్ అనే మహిళతో స్నేహం చేసాడని వెల్లడైంది. 'ఆమెతో మాట్లాడుతున్నప్పుడు, ఆమె పాకిస్తానీ ఏజెంట్ అని గోహిల్‌కు తెలిసింది. ఆమె నిర్మాణంలో ఉన్న లేదా కొత్తగా నిర్మిస్తున్న బిఎస్ఎఫ్, ఐఎఎఫ్ సైట్‌ల ఫోటోలు, వీడియోలను అడిగింది. దీంతో గోహిల్ వాట్సాప్ ద్వారా ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం ప్రారంభించాడు' అని గుజరాత్ ఎటిఎస్ఎస్పి చెప్పారు. 2025 ప్రారంభంలో, గోహిల్ తన ఆధార్ వివరాలను ఉపయోగించి ఒక సిమ్ కార్డును కొనుగోలు చేసి, భరద్వాజ్ వాడుకునేందుకు దానిపై వాట్సాప్‌ను యాక్టివేట్ చేశాడని ఎటిఎస్ పోలీసులు చెబుతున్నారు. పాకిస్థాన్ ఏజెంట్ ఉపయోగిస్తున్న ఆ నంబర్ నుండి బిఎస్ఎఫ్, ఐఎఎఫ్ మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు షేర్ చేయబడ్డాయి. గూఢచర్య నెట్‌వర్క్‌లో భాగమైన ఒక గుర్తు తెలీని వ్యక్తి గోహిల్‌కు రూ.40,000 ఇచ్చాడని కూడా ఏటీఎస్ నిర్ధారించింది. గోహిల్ ఫోన్ ఎఫ్ఎస్ఎల్‌కు పంపించాం. అదితి భరద్వాజ్ పేరుతో ఉన్న వాట్సాప్ నంబర్‌లు పాకిస్థాన్ నుండి పనిచేస్తున్నాయి అని సిద్ధార్థ్ చెప్పారు. గోహిల్.. ఇంకా సదరు పాకిస్తాన్ ఏజెంట్‌పై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 61, 148 కింద కేసు నమోదు చేశారు.

# బందీలైన సైనికులను ఇచ్చిపుచ్చుకున్న రష్యా–ఉక్రేన్

**మాస్కో :** ఇస్తాంబుల్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం రష్యా, ఉక్రేన్ దేశాలు తమవద్ద బందీలుగా ఉన్న సైనికులను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయి. ఈ ఒప్పందం కింద మే 23,24 తేదీలలో రెండుసార్లు రెండు దేశాలూ సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయి. శుక్రవారంనాడు 390 మంది రష్యా సైనికులను ఉక్రేన్ విడుదల చేయగా, శనివారంనాడు రెండోసారి 307 మంది సైనికులను కూడా ఉక్రేన్ అప్పగించింది. అదేవిధంగా రష్యా కూడా శుక్రవారంనాడు 270 మంది సైనికులను, 120 మంది పౌరులను, శనివారంనాడు 307 మంది ఉక్రేన్ సైనికులను ఆ దేశానికి అప్పగించింది. రష్యా రక్షణమంత్రిత్వశాఖ ఈ మేరకు శనివారం ఒకప్రకటనచేసింది. మూడేళ్ళుగా జరుగుతున్న యుద్ధంలో మొట్టమొదటిసారి ఈనెల 16వ తేదీన ఇస్తాంబుల్‌లో రష్యా–ఉక్రేన్ ప్రభుత్వ ప్రతినిధులు ముఖాముఖీ సమావేశం జరిపారు. శాంతిసాధన జరలేదు.30 రోజులు కాల్పుల విరమణ చేయాలన్న ట్రంప్ ప్రతిపాదన చెల్లలేదు. కానీ ఖైదీలను మార్పిడి చేసుకోవాలని మాత్రం రెండు దేశాలూ నిర్ణయించాయి. తర్వాత పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడటంతో వాటికన్ సిటీ వేదికగా ఉక్రేన్–రష్యా మధ్య చర్చలు జరిగే అవకాశంఉందని పుతిన్ ప్రకటించారు. కాగా శనివారం ఉక్రేన్‌పై రష్యా భారీస్థాయిలో డ్రోన్లతో దాడులు చేసింది. 15 మంది గాయపడ్డారు.

## ఉగ్రవాదంపై పోరుకు
# భారత్ కృతనిశ్చయం

ప్రపంచానికి ఇదే చెబుతాం: సుప్రియాసూలే

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదానికి, ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చేవారికీ వ్యతిరేకంగా పోరాటం చేయాలని భారతదేశం కృతనిశ్చయంతో ఉందని, ఈ విషయంలో ఎలాంటి రాజకీయాలకు దేశంలో తావులేదని ప్రపంచానికి చాటి చెబుతామని ఎన్‌సిపి–ఎస్‌పి నాయకురాలు సుప్రియా సూలే చెప్పారు. ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలు, పాకిస్థాన్ దుష్ప్రచారం పూర్వరంగంలో ప్రపంచదేశాలకు భారత్ వైఖరిని వివరించేందుకు సుప్రియాసూలే నాయకత్వాన బహుళపక్ష ప్రతినిధిబృందం నాలుగు దేశాల పర్యటనకు శనివారంనాడు బయలుదేరింది. మొదటిగా ఈ బృందం ఖతార్‌కు వెళ్ళింది. ఎన్‌సిపి–ఎస్‌పి కార్యనిర్వాహక అధ్యక్షురాలు సూలే నాయకత్వానగల బహుళపక్ష బృందంలో బిజెపి నాయకులు రాజీవ్ ప్రతాప్‌రూడీ, అనురాగ్ థాకూర్, వి.మురళీధరన్, కాంగ్రెస్ నాయకులు మనీశ్ తివారీ, ఆనంద్ శర్మ, టిడిపి నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆప్ నాయకుడు విక్రమ్‌జీత్ సింగ్ సాహ్ని, మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బర్దుద్దీన్‌లు ఖతార్, దక్షి ణ ఆఫ్రికా, ఇథియోపియా, ఈజిప్టు దేశాలలో పర్యటిస్తారు.



''ఇది రాజకీయాలకోసం ప్రచారం కాదు, ఇది భారతదేశం కోసం ప్రచారం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సంఘీభావం సాధించడంకోసం ప్రచారం, పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై దాడి చేశారు, వారిమీద చేసిన దాడి భారతదేశంమీద చేసిన దాడే, దానికి మా స్పందనే కొలమానం, ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించేదిలేదని, ఉపేక్షించబోమన్న సందేశాన్ని ప్రపంచానికి తెలియజేస్తాం'' అని సుప్రియా సూలే శనివారంనాడు ఖతార్ బయలుదేరేముందు మీడియా సమావేశంలో చెప్పారు.

కాంగ్రెస్‌పార్టీ ఈ విషయాన్ని రాజకీయం చేసే ప్రయత్నం చేస్తోందన్న ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, ఎన్‌సిపి–ఎస్‌పి అధిపతి శరద్‌పవార్ ఈ విషయంపై ముందే ఒక స్పష్టమైన ప్రకటన చేశారనీ, ఈ విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావులేదని, ఇది రాజకీయాలు చేసే సమయంగానీ, విమర్శలు చేసే సమయంగానీ కాదని ఆయన చెప్పారని గుర్తుచేశారు. ''ప్రభుత్వాన్ని అడగాల్సిన కొన్ని కఠినమైన ప్రశ్నలు మాకున్నాయి, కానీ ఈ ప్రశ్నలు అడగడానికి ఇది సరైన సమయం, సందర్భంకాదు, ప్రభుత్వం వెనుక అందరం ఐక్యంగా నిలబడ్డాం, భారతదేశం సమైక్యంగా ఉందని, ఎలాంటి రాజకీయాలకు తావులేదనీ, ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించబోమని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన సమయం ఇది, అధికారంలో ఎవరు ఉన్నాగానీ, రాజకీయాలు చేయడానికి రాళ్ళు విసరడానికి ఇది సమయం కాదు ఇది మా విధాన, దేశం మొదటి ప్రాధాన్యత, రాష్ట్రం తర్వాత ప్రాధాన్యత, మా పార్టీగానీ, తర్వాత మా కుటుంబంగానీ అనుసరించే విధానం ఇదే'' అని సుప్రియా సూలే చెప్పారు.

# ఉగ్రవాదంతో మా నోరు మూయించలేరు

ప్రపంచానికి భారత్ సందేశం ఇదేఃశశిథరూర్ వెల్లడి

**న్యూఢిల్లీ:** ''ఉగ్రవాదంతో భారతదేశం నోరు మూయించలేరు, భారత్ సమైక్యంగా, సమర్థవంతంగా ఉగ్రవాదాన్ని తిప్పికొడుతుంది, ఈ విషయంలో దేశం ఎంతో కృతనిశ్చయంతో ఉంది'' అనేదే ప్రపంచానికి భారతదేశం చెప్పే సందేశమని కాంగ్రెస్‌పార్టీ ఎంపి శశిథరూర్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిస్థితులపై భారత్ వైఖరిని, పాకిస్థాన్ దుర్మార్గపూరితమైన కుట్రల గురించి ప్రపంచానికి చాటి చెప్పి సంఘీభావం సాధించేందుకు ఐదు దేశాల పర్యటనకు బయలుదేరేముందుగా శశిథరూర్ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక వీడియో సందేశాన్ని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. శశిథరూర్ నాయకత్వాన గల బహుళపక్ష ప్రతినిధిబృందంలో శాంభవి (ఎల్‌జెపి–ఆర్‌వి), సర్ఫ్రాజ్ అహ్మద్ (జెఎంఎం), జి.ఎం.హరీశ్ బాలయోగి (టిడిపి), శశాంక్ మణి త్రిపాఠి(బిజెపి), భువనేశ్వర్ కలిత (బిజెపి), మిలింద్ దియోరా (శివసేన),తేజస్వి సూర్య(బిజెపి), మాజీదౌత్యవేత్త తరన్‌జిత్ సంధు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం గుయానా, పనామా, కొలం బియా, బ్రెజిల్,అమెరికా దేశాలలో పర్యటిస్తుంది.



''మేం ఈ దేశాల పర్యటనకు వెళ్ళడానికి కారణం ఏమిటంటే, భారతదేశం ఎదుర్కొన్న భయంకరమైన సంక్షోభం గురించి చెప్పడానికి, ఉగ్రవాదులు ఎంత దారుణంగా,భీకరమార్గంలో హింస చేయాలో ఆ స్థాయిలో అమాయకులైన పర్యాటకులపై దాడిచేశారు, ఈ విషయాన్ని గురించి అన్నిదేశాలతో మాట్లాడటానికి, వారికి చెప్పడానికి వెళుతున్నాం, ఈ ప్రతినిధిబృందం శాంతి, ఆశాభావాలతో పర్యటన చేస్తోంది, విద్వేషం కాకుండా, శాంతి, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అనే భారతదేశ అన్ని విలువలనూ నేడు ప్రపంచంలో కాపాడుకోవాల్సిన అవసరం ఉంది, ఈ విలువలను ఏదోఒక రోజు మళ్ళీ ప్రపంచం గుర్తుచేసుకోవడానికి వీటిని భద్రపరచాల్సిన అవసరం ఉంది, మనం ఈ విషయంలో అన్ని దేశాలతో మన దేశ చిత్తశుద్ధి గురించి, మన ఉద్దేశాల గురించి చాలా స్పష్టంగా మాట్లాడాల్సిన అవసరం ఉంది, ఉగ్రవాదంతో మా నోరు మూయించలేరన్న విషయాన్ని ఇప్పుడే చాటి చెప్పాల్సి ఉంటుంది, ప్రపంచం దూరంగా నిలబడి మనల్ని చూడకూడదు, నిర్లక్ష్యం కారణంగా సత్యంపై అసత్యం విజయం సాధించకూడదు, ఇది శాంతి యాత్ర, ఇది ఆశాభావ యాత్ర, అందుకే వెళుతున్నాం'' అని పేర్కొన్నారు.

# నీతీ ఆయోగ్ సమీక్ష ఒక వంచన


అందరిదృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ విమర్శ



**ఢిల్లీ:** నీతీ ఆయోగ్ పాలనా మండలి సమావేశాన్ని నిర్వహించడం నయ వంచన, అందరి దృష్టినీ మళ్ళించే వ్యవహారమని కాంగ్రెస్‌పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం సమస్యల నుండి అందరిదృష్టి మళ్ళించడంకోసం చేసిన మరో కార్యక్రమం, ఇది వంచన, కపటం అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పోస్టింగ్ పెట్టారు. వికసిత్ భారత్ ప్రగతి సమీక్షా సమావేశం పేరుతో మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశం ఒక నయ వంచన అని విమర్శించారు. దేశంలో సామాజిక సామరస్యాన్ని నాశనంచేసేవారే అధికారంలో ఉంటూ కపటమైన మాటలతో చేసిన సమావేశం ద్వారా ఎలాంటి వికసిత్ భారత్‌ను వారు సాధించగలరని ఆయన విమర్శించారు. పార్లమెంటరీ వ్యవస్థను, న్యాయ వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను, మీడియాను, రాజ్యాంగాన్ని, వ్యవస్థాగతమైన చట్టపరమైన వ్యవస్థలను కూలదోశే శక్తులు వికసిత్ భారత్ ద్వారా ఎలాంటి క్రూరమైన లక్ష్యాలను సాధించాలనుకుంటున్నారని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. భారతదేశానికి వ్యవస్థాగతంగా ఉన్న సుస్థిరమైన విలువలపై ప్రపంచం మొత్తం అందరూ వీక్షించేవిధంగా నిరంతరం దాడి చేస్తూ ఉంటే ఇక వికసిత్ భారత్ ఎలా ఉంటుంది? అని ఆయన ప్రశ్నించారు. భారతదేశ మహోన్నతమైన విభిన్నత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించి దానిని, లేకుండా చేస్తుంటే వికసిత భారత్ ఎక్కడి నుండి వస్తుందని ప్రశ్నించారు. దేశంలో వాక్‌స్వాతంత్ర్యాన్ని లేకుండా చేసిన తర్వాత, భావప్రకటన తీవ్ర ప్రమాదంలో పడిన తర్వాత ఇక ఎలాంటి వికసిత్ భారత్‌ను వీళ్ళు సాధిస్తారని ప్రశ్నించారు. ''ఈ రోజు జరిగిన నీతీ ఆయోగ్ సమావేశం ఒక వంచన, ప్రజలదృష్టిని దారిమళ్ళించే సమావేశం'' అని జైరామ్ రమేశ్ విమర్శించారు.

# అటవీ సంరక్షణ... ఆదివాసీల అభివృద్ధి రెండూ ఆవశ్యమే: మంత్రి కొండా సురేఖ

మంత్రి సీతక్క, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, అటవీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అటవీ ప్రాంతాల అభివృద్ధికి ఫారెస్టు డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు, డిఎఫ్ఒలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అటవీ సంరక్షణ... గిరిజనుల అభివృద్ధి రెండూ అనివార్యమేనని అన్నారు. నిబంధనలను పాటిస్తూ... అటవీ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఫారెస్టు అధికారులు చూడాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మౌలిక సదుపాయాల కల్పన సంబంధిత పనులు, అటవీ శాఖ అనుమతులకు ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం శనివారం తెలంగాణ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ఎంఎల్ఏలు వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మి, పాల్వాయి హరీష్, అనిల్ జాదవ్, ఎంఎల్‌సి దండే విఠల్, సిసిఎఫ్,డిఎఫ్ఒ, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ఎంఎల్‌ఎలు తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను మంత్రులకు వివరించారు. మంత్రి సురేఖ స్పందిస్తూ... గిరిజనుల బతుకులు మారాలంటే ఆయా ప్రాంతాల అభివృద్ధి జరగాలని అన్నారు. సమావేశంలో ఎంఎల్‌ఎలు, వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మి, డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ... అంగన్వాడీలు, స్కూల్ భవనాలు, ఇండ్లు కట్టుకోవడానికి కూడా ఫారెస్టు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పగా... ఆయా ప్రాంతాల్లోని డిఎఫ్ఒలకు ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు లోబడి ఉన్నవాటిని పరిష్కరించాలని... ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ, అటవీ భూమి పరిరక్షణ అవసమేనని... కానీ, అటవీ ప్రాంత ప్రగతి కూడా అనివార్యమన్నారు. ఇక ఎంఎల్‌ఏ అనిల్ జాదవ్ మాట్లాడుతూ... తమ ప్రాంతంలో రోడ్లకి పర్మిషన్ ఇవ్వడం లేదని దాంతో రాకపోకలు ఇబ్బంది అవుతున్నదని చెప్పారు. ఈ విషయంపై ఇచ్చిన ప్రతిపాదనలు, వర్క్ సాంక్షన్ వివరాలు తమ వెంటనే అందజేయాలని సంబంధిత డిఎఫ్ఒను మంత్రి సురేఖ ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులు బోర్లు వేసుకుంటే ఎక్కడిక్కడ ఇబ్బందులు పెడుతున్నారని ఎంఎల్‌ఏలు మంత్రి సురేఖ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎల్‌ఎలు నివేదించిన పనుల మీద అధికారులు పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు మంత్రి కొండా సురేఖ. వాటిని మరొకసారి పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. స్టేజ్1, స్టేజ్2, స్టేజ్3 వారీగా పనులను పూర్తి చేయాలని మంత్రి సురేఖ చెప్పారు. స్టేజ్1లో(వెంటనే అయ్యే పనుల) గురించి రెండు, మూడు రోజుల్లో ఒక ప్రత్యేక నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను విస్తృతంగా చర్చించి, ఒక పరిష్కార మార్గాన్ని చూపించాలని అటవీ అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. గిరిజనుల అభివృద్ధికి అటవీ శాఖ ఉన్నతాధికారులు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం సౌకర్యాలైన రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, అంగన్వాడీలు, తాగునీరు, కరెంటు లైన్లు ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. అటవీ చట్టాలపేరు మీద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. సరైన రోడ్లు లేకపోవడం వల్ల ఆపత్కాలంలో అంబులెన్సులు కూడా వెళ్లలేక పోతున్నాయని మంత్రి సురేఖ, సీతక్కలు ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల సరిహద్దుల్లో ఉండాల్సిన చెక్ పోస్టులు... గ్రామాల్లో ఏర్పాటుచేసి ఇబ్బందులు పెడుతున్నారని ఎంఎల్‌ఏలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాము పంపే రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలను పెండింగులో పెట్టడం సరికాదని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను బట్టి అనుమతులు ఇవ్వకుండా కావాలనే తమ ఫైళ్లని అటవీ అధికారులు పెండింగ్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాలుష్య కోరల నుండి కాపాడండి



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ప్రజలను ఎంపిఎల్ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్య కోరల నుండి కాపాడాలని మండల సిపిఐ సమితి శనివారం తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం కారణంగా అనేక మంది అనారోగ్యాలకు గురౌతున్నారని సమితి పేర్కొంది. వాతావరణం కాలుష్యంగా మారుతుండటంతో మనుషులతో పాటుగా జీవ జంతువులపై ప్రభావం పడుతుందన్నారు. భూగర్భ జలాలు రంగు మారే అవకాశాలున్నాయన్నారు. ఎంపిఎల్ పరిశ్రమపై వెంటనే చర్యలు తీసుకోవాలని సమితి డిమాండ్ చేసింది. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, నర్రా శేఖర్‌రెడ్డి, గుండాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/భువనగిరి : సుదీర్ఘ కాలంగా ఉన్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారమైన రైల్వే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి అర్బన్ కాలనీ రైల్వే అండర్ పాస్ పనులను శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ పాస్ వద్ద రాత్రి వేళలో ఇబ్బందులు లేకుండా ఉండడానికి లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అండర్ పాస్ పూర్తి చేయడం ద్వారా కాలనీ వాసులకు అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందని అన్నా రు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ అవైస్ చిస్తీ, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, వార్డు అధ్యక్షులు పోలిశెట్టి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# సాగు ప్రణాళిక ఖరారు

**ఖరీఫ్ సాగు ప్రణాళికను జిల్లా వ్యవ సాయ శాఖ అధికారులు ఖరారు చేశారు. జిల్లాలో 6,17,480 ఎకరాలలో పంట సాగు కానున్నట్లు అంచనా వేశారు. గత సీజన్‌లో 6,13, 888 ఎకరాలలో పంటసాగు అంచాన వేశారు. కాగా ఈ సీజన్‌లో 3,592 ఎకరాలు పంట సాగు ఎక్కువ కానున్నట్లు అధికారులు లెక్కక ట్టారు. అలాగే రైతుల పంటసాగుకు అనుగుణంగా అవసరమైన ఎరువులు, విత్తనాలను కూడా అధికారులు అంచ నావేసి అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో ఇప్పటికే రెండుసార్లు ఓ మోస్తారు భారీ వర్షాలు కురియడంతో రైతులు తమ పంట భూములను ముమ్మరంగా చదును చేస్తున్నారు.**

సూర్యాపేట జిల్లాలో 6,17,480 ఎకరాల పంటల సాగుకు అంచనా

గత ఏడాదికంటే పెరుగుతున్న విస్తీర్ణం

అందుబాటులో ఎరువులు- విత్తనాలు





ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటసాగు పనులను రైతులు నిమగ్నమయ్యారు. రోహిణికార్తె నేటి నుండి ఆరంభం కానుంది. ఎండలు తీవ్రంగా ఉండాల్సిన సమయంలో ఇప్పటికే ఓ మోస్తారుగా ఒకటి, రెండు వర్షాలు జిల్లా వ్యాప్తంగా కురిశాయి. దీంతో రైతులు మెట్ట పంటల సాగుకు ముమ్మరంగా భూములను చదును చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, రెండవ ప్రధాన పంటగా పత్తిని రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో జిల్లాలో వరి 4,85,069 ఎకరాల్లో రైతులు సాగు చేయగా, ఈ సీజన్‌లో 4,85,125 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గతం కన్నా స్వల్పంగా 56 ఎకరాల్లో వరి అధికంగా సాగు కానున్నదని లెక్క కట్టారు. పత్తి గత సీజన్‌లో 88,314 ఎకరాల్లో సాగు చేయగా ఈ సీజన్‌లో 91,000 ఎకరాలలో సాగు కానుందని అధికారులు తెలిపారు. గత సీజన్ కన్నా ఈ సీజన్‌లో రైతులు అధికంగా 2,686 ఎకరాలలో పత్తి పంటను సాగు చేయనున్నట్లు లెక్కలుచూపారు. అలాగే మొక్కజొన్న గతంలో 42 ఎకరాలలో సాగు చేయగా ఈ సీజన్‌లో 45 ఎకరాలలో, కంది 3,540 ఎకరాలలో సాగు చేయగా ఈసీజన్‌లో 2,650 ఎకరాలు, పెసర 2,663 ఎకరాలలో సాగు కాగా ఈ సీజన్‌లో 2,700 ఎకరాలలో రైతులు సాగు చేయనున్నారు. వేరుశనగ 366 ఎకరాలలో సాగు చేయగా ఈ సీజన్‌లో 400 ఎకరాలలో, చెరకు 36 ఎకరాలలో సాగు కాగా, ఈ సీజన్‌లో 60 ఎకరాలలో, మిర్చి 14,915 ఎకరాల్లో రైతులు గత సీజన్‌లో సాగు చేయగా ఈ సీజన్‌లో 15,150 ఎకరాలలో, ఆయిల్‌ఫామ్స్ 3,546 ఎకరాల్లో సాగు చేయగా ఈ సీజన్‌లో 4వేల ఎకరాలలో, పండ్లు, కూరగాయలు 16,109 ఎకరాలలో సాగు కాగా, ఈ సీజన్‌లో 16,200 ఎకరాలలో, ఇతర పంటలు 88 ఎకరాలలో సాగు చేయగా, ఈ ఖరీఫ్ సీజన్‌లో 150ఎకరాలలో సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

అందుబాటులో ఎరువులు విత్తనాలు

రైతులు సాగుచేసే పంటలకు అనుగుణంగా ఎరువులు విత్తనాలు ఎంత అవసరమవుతాయో వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వీటిని రైతులకు అందుబాటులో ఉంచారు. వరి విత్తనాలు 88,322 క్వింటాలు, కందులు 159 క్వింటాలు, పెసర్లు 108 క్వింటాలు, మొక్కజొన్న 5 క్వింటాలు, వేరుశనగ 360 క్వింటాలు, పత్తి విత్తనాలు 2,27,500 ప్యాకెట్లు (475 గ్రాములు), జీలుగులు 3,800 క్వింటాలు నిల్వ ఉంచినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పంటల సాగుకు యూరియా 60731మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 11894 మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఉంచారు. డిఏపి 14580 మెట్రిక్ టన్నులకు గానూ 855 మెట్రిక్ టన్నులు, ఎంఓపి 9560 మెట్రిక్ టన్నులకు గానూ 484 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 45247 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 8377 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 5275 మెట్రిక్ టన్నులకు గానూ 532మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రైతులు తమ పంటసాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఎరువులు, విత్తనాల కొరత అంటూ ఏమీలేదని, అవసరమైన రైతులు వాటిని కొనుగోలు చేసుకోవాలని సూచించారు. రైతులు దళారుల మాటలు విని రైతులు మోసపోవద్దని, ఎరువులు, విత్తనాలను గుర్తింపు పొందిన దుకాణాలలోనే వాటిని కొనుగోలు చేసి విధిగా రసీదు పొందాలని కోరారు.



## రాజీవ్ యువవికాసంతో ఆర్థికంగా నిరుద్యోగ యువతకు ఊతం

ఎమ్మెలే కుంభంతో కలసి కలెక్టర్ హనుమంతరావు సమీక్ష

ప్రజాపక్షం/యాదాద్రి : కలెక్టర్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస పథకం పై భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం నిరుద్యోగుల ఆర్థిక ప్రగతిని పెంపొందించే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఈబిసి నిరుద్యోగుల కుటుంబాల జీవన ప్రగతి రాణించే విధంగా రాజీవ్ యువ వికాస పథకం క్రింద యూనిట్లను నెలకొల్పుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని కుటుంబాలకు సమన్యాయం జరిగే విధంగా పారదర్శకతతో చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు యూనిట్ల ఎంపిక విధానం అవగాహనతో జరగాలన్నారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాస పథకం నిలవాలని, సాధికారిత సాధించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్‌డిఏ పిడి నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యాంసుందర్, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: అట్టడుగు వర్గాల విద్యార్థులు విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల, అడవిదేవులపల్లి మండల ఉపాధ్యాయులకు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల తరువాత పూజింపబడే స్థానం ఉపాధ్యాయులదేనని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొని విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి విద్యా హామి ఇచ్చి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లను ఆయన శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలాజీనాయక్, వరలక్ష్మీ, రిసోర్స్ పర్సన్స్ గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్, షఫి, సురేష్, నరేష్, చంద్రశేఖర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వచ్చే నెల 6న మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలోని ఎస్ఎన్‌డీ గార్డెన్‌లో నిర్వహించే సిపిఐ మండల మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎండి.సయీద్‌లు కోరారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మండల మహాసభ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. సిపిఐ గత వంద సంవత్సరాల నుంచి పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందన్నారు. వంద సంవత్సరాల్లో చేసిన పోరాటాలను ప్రజలకు వివరించుకుంటూ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. పార్టీ ప్రతిష్ట పెంచేందుకు గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలను నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, మండల సమితి సభ్యులు దళిత హక్కుల జిల్లాపోరాట సమితి జిల్లా కోకన్వీనర్ వల్లంపట్ల వెంకన్న, జి.యాదగిరి, ఎస్‌కె.షమీమ్, బంటు రాజేశ్వరి, బంటు బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు లేకపోతే సమాజంలో మార్పులు ఉండేవి కావు :యల్లావుల



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: కమ్యూనిస్టులు లేకపోతే నేటి సమాజంలోని ప్రజలలో మార్పులు ఉండేవి కావని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతిని హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ గిరి ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. దేశంలో ఆర్థిక అంతరాలను తగ్గించడంలో పేద రైతులకు, కార్మికులకు హక్కులు కల్పించడంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని అన్నారు. ప్రజలు సమానత్వం, స్వేచ్ఛ, అనుభవిస్తున్నారనటంలో సందేహమే లేదన్నారు. ఆనాటి నాయకుల ఆదర్శాల స్పూర్తితో ఈనాడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాదం, ప్రవేటీకరణ విధానాలపై సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు, పోకల వెంకటేశ్వర్లు, సోమగాని కృష్ణ, యల్లావుల రమేష్, జక్కుల శ్రీనివాస్, జడ వెంకన్న, మామిడి వెంకయ్య, సుందరి పద్మ, యల్లావుల ఉమా, చినగాని సైదులు, చకాల స్టాలిన్, మామిడి నర్సయ్య, యల్లావుల సురేందర్, మీసాల గాంధీ, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలం, పక్కా గృహాలు నిర్మించాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి




ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ లో జరిగిన సిపిఐ దేవరకొండ పట్టణ 14వ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులై ఉండి సొంత స్థలం లేకపోవడంతో అనర్హులుగా మారుతున్న నిరుపేదలకు ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన అన్నారు. అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వలన గుంతల మయంగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. సంవత్సరాలు గడుస్తున్న శిలాఫలకాలకే పరిమితమైన రోడ్ల మరమ్మతులలు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా గత 100సంతవ్సరాలుగా సిపిఐ ప్రయాణిస్తుందని ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు, వంట గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని, పండించిన పంటకు గిట్టుబాటు ధరకల్పించి, రాబోయే వానాకాల పంటలకు సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభ వలమల్ల ఆంజనేయులు అధ్యక్షత వహించగా సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మాజా ఎంపిపి పల్లా సులోచన, పట్టణ కార్యదర్శి వెంకట్రాములు, మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి లింగంపల్లి అనిత, పట్టణ సహాయ కార్యదర్శి నగేష్, శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, వెంకటయ్య, మల్లయ్య, మల్లేష్, శ్రీను, మైనోద్దిన్, నీల వెంకటయ్య, వెంకటాద్రి, శ్రీను, నీల అనసూయ, కృష్ణారెడ్డి, గిరి, రాజు, మల్లయ్య, జాకీర్, ఆనందాచారి, బ్రహ్మచారి, రమేష్, బక్కయ్య పాల్గొన్నారు.

## పేదల ప్రజలకు అండ ఎర్రజెండా : శ్రీనివాసరావు





ప్రజాపక్షం/కోదాడ: పేద ప్రజలకు కార్మికులు, కర్షకుల మధ్యతరగతి, ప్రజలకు అండగా నిలిచేది ఎర్రజెండానేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం సిపిఐ కోదాడ పట్టణ 4వ డివిజన్ మహాసభ కోదాడ సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన మాట్లాడుతూ చట్ట సభలలో సీట్లు ఉన్న లేకపోయినా నిత్యం ప్రజల మద్య నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనలో వ్యతిరేకంగా పోరాటాలు నడిపిన ఘనత కమ్యూనిస్టులదేనని ఆయన అన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలోదేశ సమగ్రతకు సమైక్యతకు కమ్యూనిస్టులు అంకితమై పనిచేస్తున్నారని, ఎలాంటి ప్రతి ఫలాన్ని ఆశించకుండా పనిచేస్తున్న లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారని, దాని వల్ల సిపిఐ వంద సంవత్సరాలుగా సజీవంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపి వారిని చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, సీనియర్ నాయకులు పైడిమర్రి వెంకటనారాయణ, గోప్రానాయక్, సైదులు, రహిమాన్, సట్టు పార్వతి, కడియాల పద్మ, సట్టు అంజమ్మ, షేక్ రహేనాబేగం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై ప్రభుత్వం వైఖరి చెప్పాలి

ప్రజాపక్షం/డిండి: రైతు భరోసాపై రైతుల్లో రోజు రోజుకు ఆశలు సన్నగిలుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టమైన వైఖరిని రాష్ట్ర రైతాంగానికి తెలపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దిన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా విషయం లో ప్రభుత్వ వైఖరిని తెలపాలని గత ప్రభుత్వం మాదిరిగా ఆంక్షలు లేకుండా రైతు భరోసా వేస్తారా.. లేదంటే కొన్ని ఎకరాలకే మాత్రమే రైతు భరోసా ఇస్తారో అనే విషయాన్ని ప్రభు త్వం అధికారికంగా తేల్చాలని ప్రభుత్వాన్ని మై నోద్దిన్ కోరారు. ఇప్పటికే 3 నుండి 4లోపు ఎకరాల రైతులకు మాత్రమే వానాకాలం రైతు భరో సా ఇచ్చారని అదికూడా పూర్తి స్థాయిలో ఇవ్వలేదని మిగతా 4 ఎకరాల నుండి పైబడిన రైతులకు రైతు భరోసా ఇవ్వడంలో రైతులు ఆం దోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ప్రభు త్వం తమ వైఖరిని చెప్పాలని అసలు రైతు భరో సా కొనసాగిస్తారా లేదా అనే విషయాన్ని ప్రభు త్వం రైతులకు తేటతెల్లం చేయాలని ఆయన అన్నారు.

## కాల్పుల విరమణకు శాంతి చర్చలు జరపాలి




ప్రజాపక్షం/మర్రిగూడ: ఏకపక్షంగా మావోయిస్టుల ఏరువేతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు కాల్పుల విరమణకు శాంతి చర్చలు జరపాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారు వెంకటేశ్వరు డిమాండ్ చేశారు.మర్రిగూడ మండల సిపిఐ పార్టీ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహా సభ నిర్వహించారు.మహాసభ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ పహాల్గం ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యమే కారణమని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరు మీద మావోయిస్టుల పై పంజా విసురుతూ హతం చేస్తున్నారు. మావోయిస్టులు కాల్పుల విరమణకు శాంతి చర్చలు జరపాలని వారు ప్రతిపాదన చేసిన చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం సంబంధించిన12 గురుకుల కళాశాల లు మూసివేతను వెంటనే వెనుకకు తీసుకోవాలనలన్నారు. జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి,బీసీ మైనార్టీ,పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.యువ వికాస్ పథకాన్ని కి సివిల్ స్కోర్ సంబంధం లేకుండా అర్హులైన నిరుద్యోగులకు అందించాలన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలండర్ రిలీజ్ చేయాలని తదనుకూలంగా ఉద్యోగ నియకమాలుచేపట్టాలని అన్నారు. అనంతరం మండల సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇస్కిళ్ల మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గాజతపాక హరి కృష్ణ,సహాయ కార్యదర్శి గా పొట్ట అశోక్ ,ఉపాధ్యక్షునిగా ఆంబోతు సుమన్‌ల తోపాటు కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## గ్రామపాలన అధికారి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : అదనపు కలెక్టర్


ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: గ్రామ పాలన అధికారి పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10: 30 గంటల నుండి మద్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు సూర్యాపేట జిల్లాలో 193 మంది అభ్యర్థులు హాజరవుతారని, సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలికల కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవిన్యూ డివిజనల్ నోడల్ అధికారిగా ఈ పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్, చేతిగడియారాలను అనుమతిలేదన్నారు. అభ్యర్థులు పరీక్షకు వచ్చేటప్పుడు రెండు పాస్ ఫోటోలు, ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిమెంట్ కార్డులలో ఏదో ఒక గుర్తింపుకార్డును, బ్లూ బ్లాక్ బాల్ పెన్ను తీసుకొని రావాలని సూచించారు. పరీక్ష కేంద్రం గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని, గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బియన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేసి పరిసర ప్రాంతాల్లో జీరాక్స్ సెంటర్లు మూసివేయించాలని అదనపు కలెక్టర్ కోరారు.

## పాలిటెక్నిక్ ఫలితాలలో సీటి టాలెంట్ స్కూల్ విద్యార్థిని స్టేట్ ఫస్ట్ ర్యాంకు




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో సిటి టాలెంట్ స్కూల్ విద్యార్థిని జి.శ్రీజ రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంకు సాధించిందని స్కూల్ కరస్పాండెంట్ ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళిలు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సిటి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీజ ఎంపిసి, ఎంబైపిసిలో 120 మార్కులకు గానూ 120 మార్కులు సాధించిందని తెలిపారు. బి.ప్రణవి రాష్ట్ర స్థాయిలో ఎంపిసిలో 9వ ర్యాంకు, ఎంబైపిసిలో 32వ ర్యాంకు సాధించిందన్నారు. సాయిసృజన ఎంపిసిలో 17వ ర్యాంకు, ఎంబైపిసిలో 9వ ర్యాంకు, ప్రజ్ఞారెడ్డి ఎంపిసిలో 19వ ర్యాంకు, ఎంబైపిసిలో 20వ ర్యాంకు సాధించిందన్నారు. న్యూ విజన్ స్కూల్ విద్యార్థి యాస్మిన్ ఎంపిసిలో 34వ ర్యాంకు, ఎంబైపిసిలో 46వ ర్యాంకు సాధించాడని తెలిపారు, తమ స్కూల్ విద్యార్థులు 100 లోపు తొమ్మిది ర్యాంకులు సాధించారని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

## హామీలను అమలు చేయాల్సిందే



ప్రజాపక్షం/మునుగోడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని గురిజ రామచంద్రం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ మండల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల మే 29న సింగారం గ్రామంలో జరిగే సిపిఐ మునుగోడు మండల 15 మహాసభకు కమ్యూనిస్టు పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బొమ్మరబోయిన లాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మాజీ జెడ్‌పిటిసి గోస్కొండ లింగయ్య,మండల సహాయ కార్యదర్శులు బండమీది యాదయ్య, మందుల పాండు, కార్యవర్గ సభ్యులు దుబ్బ వెంకన్న, వనం వెంకన్న,ఈదులకంటి కైలాస్,మండల కౌన్సిల్ సభ్య లు బైరుగొండ వెంకన్న, జనుకుంట్ల నరసింహ,బొల్లుగిరి ఎల్లయ్య, బీసం. ముత్తయ్య, ఎండి జాను ,రేవెల్లి అంజయ్య, బెల్లం శివయ్య,పుల్కరం ఆంజనేయులు, నకరికంటి సత్యనారాయణ,కురుమర్తి ముత్తయ్య,తీర్పారి కృష్ణయ్య, శిరగోని శంకర్, మోకాళ్ళ పరమేశ, కొండ అంజయ్య పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏడిఏ వినయ్ బాబు,ఏవో గిరీ రాజ్ ఎస్ఐ అశోక్ ఫర్టిలైజర్స్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకూడదని బీటీ త్రీ పత్తి విత్తనాలు రైతులకు అమ్మరాదని ఒకవేళ అమ్మితే కఠిన చర్యలు తప్పవని లైసెన్సు రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలియజేశారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు ఎవరైనా అమ్మితే వారికి కూడా కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు. రైతులు విత్తనాలు విక్రయిస్తే రసీదులు ఫర్టిలైజర్ యజమానులు ఇవ్వాలని రైతులు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## నేటీ జపిఒ పరీక్షకు అన్ని ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** జిల్లా కేంద్రంలో ఆదివారం రోజున నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల నియామక పరీక్షకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.చాణక్య హై స్కూల్ (రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో) లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.సెల్‌ఫోన్ సహా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు.అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు,పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తప్పనిసరిగా తీసుకురావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

## వర్షానికి తడిచిన ధాన్యం కొనుగోలుకు చర్యలు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** జిల్లాలో అకాల వర్షాలు వల్ల తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా చిన్న శంకరంపేట్ మండలం అంభాజిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, కొనుగోళ్ల రిజిస్టర్ లను, వడ్లు తూర్పార పట్టే విధానాన్ని తనిఖీ చేశారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాలు పడుతున్న కూడా కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తడవకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత తాసిల్దార్ ల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ప్రకృతి వైపరీత్యాల అకాల వర్షాలు వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచినా కూడా వడ్లు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు భరోసా కల్పించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల అకౌంట్లో డబ్బులు వెనువెంటనే జమ అయ్యే విధంగా చూస్తున్నామన్నారు. సన్న వడ్లకు బోనస్ కూడా అందుతుందన్నారు. ఈరోజు వరకు 2 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, గత సంవత్సరం ఇదే సమయం ఇదే రోజు వరకు 2.30 లక్షల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట చిన్న శంకరంపేట తహసిల్దార్ మన్నన్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేట లోని కార్యాలయంలో విక్రయ కేంద్రాల యజమానియాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో డీలర్ లతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలన్నారు. విత్తనాల బస్తాపై ప్రభుత్వం గుర్తించిన ట్యాగ్ ఉందో లేదో చూసుకోవాలన్నారు. బస్తా పై విత్తనాల రకం, గడువు తేదీ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం విత్తనాలను విక్రయించాలన్నారు. డీలర్లు ఏడుకొండలు, రవీందర్ గుప్తా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/జన్నారం:** జన్నారం మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే, మండలంలోని అక్కపెల్లి గూడ కాలనీకి చెందిన గొలి రాజన్న (రోజువారీ కూలీ) తన పని ముగించుకుని సైకిల్‌పై వస్తుండగా, చెక్కపెల్లి కుంట సమీపంలో వెనుక నుండి వేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను వెంటనే లక్షెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మండలం రేపల్లెవాడ గ్రామంలో వర్కడే విష్ణు ప్రసాద్ (52) అనే వ్యక్తి పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్ఐ డి. కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వర్కడే విష్ణు ప్రసాద్ కూలీ పనులు చేసుకుంటూ రేపల్లెవాడ గ్రామంలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి నిద్రించే సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండగా పాము కాటుకు గురయ్యాడు. ఈ విషయాన్ని స్థానికులు శనివారం గమనించి తాండూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు మాన్ సింగ్ తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పురుగుల మందు తాగి...



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని వడర్భురి గ్రామానికి చెందిన గరికే లక్ష్మణ్(29) పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది.ఏఎస్ఐ నర్సింగ్ భాను తెలిపిన మృతుడు లక్ష్మణ్ గత రెండు సంవత్సరాల క్రితం పాముకాటు వేయడంతో ఆయనకు సర్జరీ చేసుకున్నాడు.కావున ఆయన నడుము నొప్పి భరించలేక శుక్రవారం సాయంత్రం ఆయన సొంత చేసులో మద్యం తాగి,జీవితం పై విరక్తి చెంది,పురుగుల మందు తాగడంతో కొన ఊపిరిలో ఉన్న ఆయనను బైంసా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు.మృతుడు లక్ష్మణ్ కు ఇద్దరు కుమారులు ఉన్నారు.భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సింగ్ భాను తెలిపారు.

# నిర్మల్ సిపిఓ వేధింపులు..ఉద్యోగుల్లో అసంతృప్తి

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** నిర్మల్ జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ తన నిరంకుశ పాలనతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నారు. మండల ప్లానింగ్, స్టాటిస్టికల్ ఆఫీసర్లతో పాటు ఇతర క్షేత్రస్థాయి సిబ్బందిని ఆయన వేధిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలను ఉలంఘిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని గంటలు ముగిసినా కార్యాలయాల్లోనే ఉండాలని బలవంతం చేయడంతో ఇటు ఇంటి పనులు అటు ఉద్యోగ బాధ్యతలు సమన్వయం చేసుకోలేక ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురువుతున్నామని యంపిఎస్ఓ జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

సూర్యాస్తమయం దాటినా హార్డ్ కాపీల కోసం ఒత్తిడి.

పని గంటలు ముగిసిన తర్వాత కూడా హార్డ్ కాపీలను భౌతికంగా సమర్పించాలని సిపిఓ పట్టుబడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు రాత్రిపూట ప్రయాణాలు చేయాల్సి వస్తుండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గణాంక సేకరణ,విశ్లేషణలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను సిపిఓ పూర్తిగా విస్మరిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హఠాత్తుగా రిపోర్టుల సమర్పణకు గడువులు విధించడం ఉద్యోగులపై తీవ్రమైన పనిభారాన్ని మోపుతోంది.

గర్భిణీ స్త్రీలు మెటర్నిటి సెలవు తీసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే సిపిఓ వారిని తీవ్రంగా టార్చర్ పెడుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

మండల స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన కార్యాలయ సౌకర్యాలు లేకపోవడం, సిబ్బంది కొరత వంటి సమస్యలను సిపిఓ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

ఇపిసి సర్వే కోసం నియమించబడిన రిజర్వ్ ఎన్యూమరేటర్లకు పారితోషికం చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ, సిపిఓ వాటిని నిలిపివేశారు. వేతనాలు అందక ఆ ఎన్యూమరేటర్లు ఇప్పుడు ఎంఎస్పీఓ ను ఆశ్రయిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ఉద్యోగులు సిపిఓ నిరంకుశ పాలనతో విసిగిపోయారు. వారు ఇప్పుడు న్యాయం కోసం ఉన్నతాధికారుల జోక్యానికి వేడుకుంటున్నామని జిల్లాలోని ఎంపిఎస్ఓలు 15రోజులు లాంగ్ లీవ్ ఇవ్వడం జరిగిందని, తక్షణమే ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, సిపిఓ పై తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణ హెచ్చరిస్తున్నారు.



## నానిపోయి మొలకలు వస్తున్న వడ్లు



**ప్రజాపక్షం/నందిపేట్:** అకాల వర్షాలకు రైతులు పండించిన దొడ్డు రకం ధాన్యం కొనేవారు లేక నానిపోయి మొలకలు వస్తున్నా పట్టించుకొనే వారు లేక కల్లం మీదే మిగిలిపోయిన దుస్థితి నందిపేట్ మండలంలోని కొండూరు గ్రామంలో కనిపిస్తుంది. ఈ గ్రామంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలలో దొడ్డు రకం వరి ధాన్యం రైతులు పండించారు. కోత ఆలస్యం కావడంతో ఈ ధాన్యాన్ని సహకార సంఘ అధికారులు కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గత పదిహేను రోజుల క్రితం కల్లంలో ధాన్యం కాంట అయ్యాయి. అకాల వర్షాలతో నానిపోయిన మొలకలు వచ్చిన పట్టించుకోవడం లేదు. జిల్లాలో మా సహకార సంఘానికి కేటాయించిన అలాట్‌మెంట్ పూర్తయిందని, రైస్ మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకుంటామని సంఘ అధికారులు, సిఈవో నారాయణ చెప్పారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం చేస్తామని చెప్పారు.

## అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకులు పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా రూరల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి మహేష్‌కుమార్‌గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, నరేష్, పాల్గొన్నారు.

# నిర్మల్ విద్యార్థులకు సైనిక్ స్కూల్ ర్యాంకుల పంట



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** అల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ నందు నిర్మల్‌కు చెందిన సుశిక్ష సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్ నుండి పలువురు విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు పొందారు నిర్మల్ కు చెందిన శాలగిరి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడైన శాలగిరి షార్విందరెడ్డికి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ నందు 300 మార్కులకు గాను 286 సాధించడంవల్ల ఆల్ ఇండియా నందు 213ర్యాంకు రాష్ట్రస్థాయిలో ఆరవ ర్యాంకు శ్రీయాన్ కు 300కు 250 మార్కులు వచ్చినవి ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ క్యాంప్ అలాగే జిల్లా నుంచి ఈ విధంగా ర్యాంకులు సాధించేలా కృషి చేస్తున్న కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గిట్టబోయిన అశోక్ ని అభినందించారు.

**జిల్లా అవార్డులు పొందిన ఐదుగురు మస్కాపూర్ విద్యార్థులు,టీచర్లను ప్రశంసించిన కలెక్టర్..**

పదవతరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు పొందిన మస్కాపూర్ హైస్కూల్ లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు, అందుకు కృషిచేసిన టీచర్లను శుక్రవారం రాత్రి జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావు. పరీక్షల అధికారి ముడారపు పరమేశ్వర్ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా మంచి మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా, జాబితాలో ఐదుగురు విద్యార్థులు శ్రీవల్లి, రాజు, ఆదర్శిని, స్నిగ్ధ, రోహిత్ రాజ్ లు ఉన్నారు. ఐదుగురు విద్యార్థులు ఎంపికైన ఏకైక పాఠశాల మస్కాపూర్ కావడం 56 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ప్రథమంగా నిల్చిన విషయాన్ని తెలుసుకొని ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్,రాపర్తి కిషన్ ప్రసాద్, సయ్యద్ ఫరాజ్, షఫీ, విజయ్ కుమార్, స్వప్నలను వేదిక వద్దకు కలెక్టర్ పిలిచి అభినందించారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంతో పాటు మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు పట్టాలు పంపిణీ చేశారు. బాన్సువాడ అర్బన్‌కు 260, రూరల్ మండలం 353 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని, నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు అందించడమే తన లక్ష్యమన్నారు. అనంతరం కోటగల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చందర్, మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, హనుమంతరావు, డిఎల్‌పివో సత్యనారాయణ, ఎంపిడివో ముజాహిద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, జంగం గంగాధర్, ఎజాస్, కాసుల రోహిత్, రహిస్, కొట్టం గంగాధర్, లింగమేశ్వర్, గొల్ల వెంకన్న యాదవ్, కిరణ్, గౌస్, లబ్దిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను విరమించాలి




### నక్సల్స్‌తో శాంతి చర్చలు జరపాలి
### మారణ హోమాన్ని విడనాడాలి
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఏ రెహమాన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ఆపరేషన్ కగార్ ను విరమించాలని ,మారణ హోమాన్ని ఆపాలని, నక్సల్స్‌తో శాంతి చర్చలు జరపాలని, కేంద్రమొండి వైఖరి విడనాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఏ.రెహమాన్ కోరుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారును నిలిపి వేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్రప్రభుత్వాన్ని కోరుతునా ప్రదాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షాలు పట్టించుకోక పోవడం దారణమన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలు ,ప్రజాస్వామిక వాదులూ ఖండించాలన్నారు. ప్రశ్నించే గొంతులను అదివాసులను క్రూరాతి క్రూరంగా ఎన్కౌంటర్ పేరుతో మారణ హోమాన్ని సృష్టిస్తున్నారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్యలకు సిద్దమని ప్రకటించినప్పటికి ఇతర వివక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి నక్సల్స్‌తో శాంతి చర్చలు జరపాలని, సూచించినప్పటికిని కేంద్ర ప్రభుత్వం ప్రదాని నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్‌షాలు శాంతి చర్యలు జరపకుండా మారణ హోమాన్ని సృషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చింత గంగయ్య, సయ్యద, సమద్, మల్లేష్ ఆసద్, తిరుమలేష్ శ్రీనివాస్, యదుల్ సమతా ,సైనికదల్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రబీ పంటకు బోనస్ ఇస్తాం.. సందిగ్ధంలో రైతులు




**ప్రజాపక్షం/నందిపేట్ :** ఈ రబీలో వరి పంట సన్నాలు నాటితే క్వింటాలుకు బోనస్‌గా రూ. 500 ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా బోనస్ జాడలేదు. ఈ యాసంగి పంట దాదాపు పూర్తి స్థాయికి వచ్చాయి. అయినా వ్యవసాయశాఖ మంత్రి, ముఖ్యమంత్రి యాసంగి పంటకు సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా చివరికి చేతులు ఎత్తివేస్తుందా అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఒకవేళ సన్నాలు వరివేస్తే ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ రూ. 500 ఇస్తుందా లేదా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఖరీఫ్‌లో వరిపంట కోసి కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుంటే సన్న వరిరకాల మద్దతు ధరతోపాటు బోనస్‌గా క్వింటాలుకు రూ. 500 చెల్లిస్తామని చెప్పి చివరికి ఎలాగో చెల్లించింది. అసలు బోనస్ ఇస్తారా లేదా ప్రతిసారి వాయిదా వేస్తుంది ప్రభుత్వం. అందుకే రైతులు అయోమయం చెందుతున్నారు. ఒకవేళ బోనస్ ఇస్తే పురుగు మందులకు పిచికారీ చేయడానికి, కలుపు మందులకు ఖర్చు చేయడానికి పనికి వస్తాయని రైతులు ఆశతో ఉన్నారు. అందరు రైతులు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ హామీ నెరవేరుతుందో లేదో ఎదురుచూడాలి.

# గ్రామ పాలన అధికారుల పరీక్షకు సర్వం సిద్ధం

### కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** గ్రామ పాలన అధికారుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు శనివారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామ పాలన అధికారుల నియామకం కోసం స్క్రీనింగ్‌టెస్ట్/ అర్హత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు ,గ్రామ పాలన ఆఫిసర్ స్క్రీనింగ్ అర్హత పరీక్ష 25052025న ఆదివారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు అభ్యర్తి పాస్‌పోర్ట్ ఫోటోను నిర్దేశించిన ప్రదేశంలో అతికించాలి లేకుంటే పరీక్షకు ప్రవేశం నిరాకరించబడుతుందని ,హాల్ టికెట్‌ను పరీక్ష కేంద్రం ప్రవేశ ద్వారం వద్ద పరీక్షా హాలులో కూడా హాల్ టికెట్ ను చూపించాలని లేని పక్షంలో అభ్యర్థులు పరీక్ష రాయడానికి అనుమతించబడదన్నారు. నామినల్ రోల్స్‌లో అతికించడానికి అభ్యర్థి పరీక్షా హాలులో ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను చూపించాలన్నారు. అభ్యర్థులు అసలు పరీక్ష తేదికి ఒక రోజు ముందు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి వారి పరీక్షా కేంద్రం గురించి నిర్ధారించుకోవాలని సూచించారు. పరీక్ష పారంభానికి ఒక గంట ముందు అభ్యర్థులను పరీక్ష హాలు లోకి అనుమతిస్తారన్నారు. ఉదయం 10.00 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించరు. అభ్యర్థులు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించబడరని తెలిపారు. పరీక్ష ముగసే వరకు బయటకు వెళ్లడానికి అనుమతించబడరని హెచ్చరించారు. ఇతర రంగుల పెన్నులు నిషేదించబడ్డాయిని, ఇంక్ /జెల్ పెన్నులను ఉపయోగించవద్దనీ పరీక్ష సమయంలో హాల్ టికిట్‌పై తన సంతకం చేయాలన్నారు. హాల్ టికెట్ పై ఉన్న నిబంధనలు పూర్తిగా పాటించాలని తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

**ప్రజాపక్షం/కొల్చారం:** మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను హౌసింగ్ పీడీ మాణిక్యం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తో నాణ్యతమైన పరికరాలను ఉపయోగించి త్వరగా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు పథకంలో మంజూరైన లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణం చేసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో నిర్మించిన గుండి తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి గుండి గ్రామానికి వెళ్లే దారిలో నిర్మించిన తాత్కాలిక వంతెన ఒక్కసారిగా కొట్టుకపోయింది. కొట్టుకుపోయే సమయంలో ఒక వ్యక్తి ఆ వంతెనపై అటో పెట్టడంతో ఆటో బోల్తా పడి వాగులో కొట్టుకుపోయింది. దీనిని గమనించిన స్థానిక ప్రజలు తాడు సహాయంతో ఆటోను రోడ్డుపైకి లాగారు. ఆటోలో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/బైంసా:** అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం వానల్ పాడ్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తేమ శాతం పేరుతో రైతులను వేధించవద్దన్నారు. లారీలను సత్వరం రప్పించి, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని తరలించవలసిందిగా అధికారులకు సూచించారు. హమాలీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసుకొని ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఆయన వెంట బిజెపి నాయకులు భీమినేని శంకర్, పట్టణ అధ్యక్షుడు రావుల రాము, చందర్ పటేల్, సాయరెడ్డి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు ఓ వరం..

**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆద్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పొన్నం సత్యనారాయణ గౌడ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## బోధన మెరుగుకు శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/ఇల్లందకుంటః** బోధన మెరుగు కొరకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఇల్లందకుంట మండల విద్యాధికారి కె.రాములు తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందకుంట మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులందరికీ సామర్ధ్య నిర్మాణ కార్యక్రమం నిర్వహించామనితెలిపారు. అదే విధఃగా ఉపాధ్యాయులందరూ బోధన ప్రక్రియలు పిల్లలు త్వరగా నేర్చుకుంటారని, సామర్ధ్యాల ప్రకారం ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో బోధన చేయాలన్నారు.



మండల రిసోర్స్ పర్సన్లు సంపత్, కుమారస్వామి, ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, రాజు, ఆనందం, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిజిటల్ బోధనతో విప్లవాత్మక మార్పులు

### డిఇఒ శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** డిజిటల్ బోధన, ఏఐ ఆదునిక బోధనాలతో నాణ్యమైన విద్య అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కలిగించి ప్రవేశాలను పెంచాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో జరుగుతున్న ఐదు రోజుల ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని డిఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణలో బాగంగా జరుగుతున్న కార్యక్రమాలను అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులతో అనుసరిస్తున్న ఉత్తమ విదానాల గురించి చర్చించారు. విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగిస్తూ కృత్యాదార పద్ధతిలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సృజనాత్మకతతో భోదించాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులు రాబోతున్యాయని తెలిపారు. 30 పైగా విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ అందించేలా విద్యాశాఖ కృషి చేస్తూ న్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద కనబరుస్తూ వారు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెలాల్లాలని అన్నారు. కార్యక్రమంలో ఎఈఓ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల నుండే చట్టాలపై అవగాహన

### ఎస్ఐ చంద్రమోహన్


**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే చట్టాలపై అవగాహన కల్పించాలని, హక్కుల బాధ్యతల గురించి తెలిసినప్పుడే బాధ్యత గల పౌరులుగా తయారవుతారని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. శనివారం ప్రత్యేక సెషన్స్‌లో భాగంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. విద్యార్థుల్లో ఏవైన సందేహత్మాక ప్రవర్తనలు కనిపించినట్లయితే వారిని పరిశీలించి తల్లిదండ్రులకు తెలియజేసి తగిన మార్గదర్శనం చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు,గంజాయి మొదలైన వాటి వల్ల అనర్థాలను తెలిపి వాటి పట్ల ఆకర్షితులు కాకుండా చూడాలన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రత విద్య నేర్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టివచ్చని, వారి ద్వారా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించవచ్చని అన్నారు.

## జనసేనలో చేరిన జనార్దన్ న్యాంతబాద్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః**తెలంగాణ జనసేన క్రియాశీలక సభ్యుల సమావేశంలో రాష్ట్ర ఇంచార్జి శంకర్ గౌడ్, జనసేన ప్రచార ఇంచార్జి ఆర్‌కె సాగర్‌ల ఆద్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జనార్దన్ న్యాంతబాద్ జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జనార్దన్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం అహర్నిషలు శ్రమిస్తానని చెప్పారు. తాను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ కోసం చేసిన శ్రమ వల్లే గొప్ప పార్టీలోకి రావడానికి తోడ్పడిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూటమి ప్రభుత్వం వస్తుందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే ఆలోచనలో ఉందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రావుల మధు, శివారెడ్డి, అజయ్ బబ్లూ, బెక్కం జనార్దన్, సంజీవ్, సాయి, అన్ని నియోజకవర్గాల ఇంచార్జిలు పాల్గొన్నారు.

## ట్రినిటీలో ముగిసిన ఆన్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఉద్యోగ ప్రక్రియ 10కి పైగా బహుళ జాతీయ కంపెనీలతో ఆన్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 212 మంది విధ్యార్థులకు పైగా ఉద్యోగాలు పొందారు. ఈ ప్రక్రియలో దాదాపుగా 12 బహుళజాతీయ కంపెనీలు ఫాక్స్‌కాన్, ప్రీమియం ఎనర్జిస్, జెన్ టెక్నాలజీస్ టీం లీజ్, ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, టాటా టెలి సర్వీసెస్, ఎం పవర్, బీట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్ ,శ్రీరామ్ లైఫ్ , సెంటిలైట్ ఇన్ఫర్మేషన్ తదితర కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఉద్యోగం పొందిన విద్యార్థులకు ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా ఆయా కంపెనీల నియామక పత్రాలను విధ్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కళాశాలపై నమ్మకం ఉంచి తమ పిల్లలను నమ్మకంతో ఇంజనీరింగ్ చేర్పించినందుకు వారికి బహుమతిగా బిటెక్, ఎంబిఏ ఉత్తీర్ణులైన 2023, 2024 విధ్యార్థులు ప్రస్తుతం చివరి సంవత్సరం 2025 చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఒక ధృఢ సంకల్పంతో ఈ మెగా ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించామని తెలిపారు. ప్రతి విధ్యార్థి ఉద్యోగ అవకాశం పొందే విధంగా తమ కళాశాల బృందం చర్యలు తీసుకుంటుందని, ఉద్యోగాలు పొందిన విద్యార్థులను నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ప్రతి విద్యార్థి ఉద్యోగంలో చేరి ఎక్స్పీరియన్స్ పొంది ఉన్నతమైన కంపెనీలకు ఉద్యోగ అవకాశాలు పొందడం కొరకు ఈ ఉద్యోగం పునాదిగా నిలుస్తుందన్నారు. దీనిని ప్రతి విధ్యార్థి సద్వినియోగం చేసుకొని ఉద్యోగంలో చేరాలన్నారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గణేష్, ఏవో సురేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌వోడీలు డాక్టర్ నటరాజన్, రాజిరెడ్డి, స్వాతి, ప్రభాకర్, పద్మిని, చొప్పరి వంశీ, చందు, రిక్రూట్‌మెంట్ రిప్రజెంటేటివ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగు బాగు

### వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి : కలెక్టర్ పమేలాసత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఈ సాగులో ఆయిల్‌ఫామ్‌కు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. లోహియా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సంస్థ ఆద్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై 'బంగారు రైతు' అవగాహన కార్యక్రమాన్ని కరీంనగర్ లోని కెఐఎస్ఎల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడుతూ కేవలం వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉండే పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఒక సీజన్‌లో వరి వేస్తే మరో సీజన్‌లో ప్రత్యామ్నాయ పంట వేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలలో ఆయిల్ ఫాం సాగు ప్రయోజనకరమైనదని తెలిపారు. ఈ పంటలో అంతర పంట కూడా సాగు చేయవచ్చని అన్నారు. మూడు సంవత్సరాల పాటు కష్టపడితే 30 సంవత్సరాల నికర ఆదాయం ఈ పంట ద్వారా చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలకు గాను ఎకరానికి 51 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎకరానికి 22500 రూపాయల సబ్సిడీని బిందు సేద్యం కోసం సబ్సిడీ అందిస్తోందని వివరించారు. జిల్లాలో కేవలం 320 మంది రైతులు మాత్రమే 1200 ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు చేస్తున్నారని అన్నారు. ఈ సాగు విస్తీర్ణాన్ని ఈ ఏడాది 3000 ఎకరాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయిల్ ఫామ్ ద్వారా రైతులు లాభాలను అర్జించవచ్చని అన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, లోహియా సంస్థ సీఈవో సిద్దాంత్ లోహియా, ప్రతీక్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భావోద్వేగాలు, ఆవేశాల నియంత్రణతో నేరాలకు అడ్డుకట్ట




**ప్రజాపక్షం/గోదావరిఖని :** మండల న్యాయ సేవా సమితి ద్వారా పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని సమితి ప్రతినిధులను సంప్రదించి న్యాయ సేవలు పొందాలని రామగుండం మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఛైర్మన్, డిస్ట్రిక్టు అండ్ అడిషనల్ సెషన్స్ జడ్జి టి.శ్రీనివాస రావు సూచించారు. శనివారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వరకట్న దురాచారం రూపుమాపడానికి, భ్రూణ హత్యలు ఆరికట్టడానికి, అవినీతి నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పు దారిలో పోకుండా ఉండేందుకు వారిలో జ్ఞానం పెంపొందించడానికి విద్యా బుద్ధులు నేర్పించాలన్నారు. క్షణికావేశంలో ఎక్కువ శాతం నేరాలు జరుగుతున్నాయన్నారు. నేరాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ భావోద్వేగాలను, అవేశాలను నియంత్రించుకోవాలన్నారు. ఆలోచన అనేది మనిషికి దేవుడిచ్చిన వరమన్నారు. మంచి ఆలోచనలతో క్రమశిక్షణ, నీతి, నిజాయితీతో సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. సంపాదించిన ఆస్తులు శాశ్వతం కావని సంపాదించుకున్న పేరు మాత్రమే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అలెగ్జాండర్, ఆల్ఫ్రెడ్ నోబెల్ ఉదంతాలు నిరూపించాయన్నారు. మానవ సేవయే మాధవ సేవ అనుకొని సాధ్యమైనంత వరకు అవసరం ఉన్న వారికి, ఆపదలో ఉన్న వారికి సహాయం అందించాలన్నారు. రామగుండం నగరపాలక డిప్యూటి కమిషనర్ నాయిని వెంకటస్వామి, న్యాయవాదులు గుడికందుల భూమయ్య, గోలి తిరుపతిరావు, ఆర్వో అంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా సీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షలకు సర్వం సిద్ధం

### అదనపు కలెక్టర్ డి.వేణు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు గురువారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో గ్రామపాలనఅధికారిపరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 25న ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు పెద్దపల్లి జిల్లాలో 80 మంది అభ్యర్థులు హాజరవుతారని, పెద్ద కాల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాట్లు పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో ప్రశ్నా పత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ అనుమతి లేదని అన్నారు . పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి కన్వీనర్ జేఎన్టీయూ కు పంపాలని అదనపు తెలిపారు.పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాలాపై ఉన్న నిర్మాణాన్ని తొలగించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం కార్పొరేషన్ పరిధిలో రోడ్లను నాలాలను ఆక్రమించి చేసిన నిర్మాణాలను తొలగించడంలో నగరపాలక సంస్థ పనితీరు అభినందనీయమని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య అన్నారు. అలాగే మార్కండేయ కాలనీ రోడ్డు వెడల్పు మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయడానికి అడుగులు పడడం శుభసూచకమన్నారు.మార్కండేయ కాలనీ ఆదిత్య హోటల్ పక్కన ప్రధాన నాలాపై స్లాబ్ చేసి సిసి రోడ్లు నిర్మించారు.మాస్టర్ ప్లాన్ నిర్మాణంలో భాగంగా ఆ నాలాపై ఉన్న నిర్మాణాన్ని కూడా కార్పొరేషన్ అధికారులు తొలగించాలని డిమాండ్ చేశారు. నూతన మున్సిపల్ చట్టం2019 ప్రకారం నాళాలపై కానీ నాలాకు ఆనుకొని ఉన్న నిర్మాణాలు చేసే వారిపై రామగుండం నగరపాలక సంస్థ అధికారులుచర్యలు తీసుకోవడంతో పాటు అలాంటి నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనేకసార్లు ఆదిత్య రెసిడెన్సి పక్కన నాలాపై స్లాబ్ నిర్మాణం జరిగిందని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమైన స్లాబ్‌ను తొలగించాలని రామగుండం నగరపాలకసంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా నాలాపై ఉన్న నిర్మాణం తొలగించాలని డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ లో ఒక బలమైన నాయకత్వం ఉన్నందున మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి అధికారులంతా కసరత్తు చేయాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై పోరు

### సిపిఐ 23వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా మహాసభల కరపత్రాన్ని శనివారం కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి, గుంటూరుపల్లి, నగునూరు గ్రామాల్లో ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం అనేక ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించిన పార్టీ సిపిఐ అన్నారు. మహాసభలు ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌లోని మధు గార్డెన్ ఫంక్షన్‌హాలులో ప్రారంభమవుతాయని, ఈ ప్రారంభానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐజాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ హాజరవుతారని తెలిపారు. ఈ నెల 27, 28 తేదీలలో జరిగే మహాసభల్లో 300మంది జిల్లాలో ఎంపిక కాబడ్డ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్ర జాపోరాటాలు నిర్వహించేందుకు రెండు రోజుల పాటు సుధీర్ఘంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తారని స్పష్టం చేశారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రూరల్ మండలకార్యదర్శి సాయవేణి రాయమల్లు, నాయకులు మెరుగు రాములు, దిమ్మటి నాంపల్లి రాజు, మణి, లక్ష్మన్, అమరగొండ స్వామి, శ్రీనివాస్, సంపత్, మల్లేశం, పెద్ది రాజు తదితరులున్నారు.

## 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** దేశంలో ఉగ్రవాదాన్ని తుదముట్టించి మత సామరస్యతను కాపాడాలని, చత్తీస్‌ఘడ్‌లో జరుపుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. శనివారం సుగుణాకర్‌రావు భవన్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వవర్ధంతి వారోత్సవాల్లో భాగం గా పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలు అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన సెమినార్‌లోముఖ్య అతిధిగా వీరయ్య మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఉగ్రదాడిలో అమాయక పర్యాటకులు చనిపోయారన్నా రు. పర్యాటక ప్రాంతంలో భద్రత ఎందుకు కల్పించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉగ్రవాదులు మత కల్లోలాలు సృష్టించలని చూస్తే కాశ్మీర్ ముస్లింప్రజలుఉగ్రవాదానికివ్యతిరేకంగా ఐక్యంగా రోడ్ల మీదకు వచ్చి పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినదించి మూడు రంగుల జాతీయ జెండాలతో భారీ ర్యాలీ తీసారని గుర్తు చేశారు. ఉగ్రవాదుల అంతు తేల్చామని ఒకవైపు ప్రధాని చెబుతున్నారని, నేటికీ ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకోలేదన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు వస్తామని సానుకూలంగా స్పందించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా ఎన్‌కౌంటర్లు చేయడం సరికాదన్నారు. జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమా సాహెబ్ ఉన్నారు.

## ఉత్తరం పేరుతో బిజెపి, బిఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్

### సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఉత్తరం పేరుతో రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్ బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం నియోజకవర్గ కాంగ్రెస్‌కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్, నీటి పారుదలశాఖమంత్రి హరీష్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు నోటీసులు ఎలా ఇస్తారని ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చట్టానికి ఎవరు చుట్టాలు కాదని అన్నారు. కెసిఆర్ అవినీతి చేయలేదని ప్రజలు నమ్మితే మళ్ళీ అధికారం కట్టబెట్టేవాళ్లు కదా అన్నారు. రజతోత్సవ సభ జరిగిన మూడు నెలల తరువాత కవిత లేఖ రాజడం ఏంటని ప్రశ్నించారు.కాళేశ్వరంప్రాజెక్టుకుకాంగ్రెస్‌వాళ్ళే బాంబులు పెట్టి పేల్చి ఉండవచ్చని కేటీఆర్ మాట్లాడుతున్నాడని అప్పుడు ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉందో ఆత్మ విమర్శ చేసుకోవాలనిసూచించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి బయటపడుతుంటే పునాదులు కదులుతున్నాయన్నారు. బీజేపీ బిఆర్ఎస్ ఎప్పటికీ రెండు ఒకటేనని గల్లీలో కుస్తీ పడుతూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి చేసింది కాబట్టే ప్రజలు బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, ఆకునూరి బాలరాజు, కమలాకర్ రావు, ఎల్లే లక్ష్మి నారాయణ, కల్లూరి చందన, మడుపు శ్రీదేవి, ఆడేపు చంద్రకళ, వైద్య శివప్రసాద్, బైరి ప్రభాకర్, వెంగళ లక్ష్మి నరసయ్య భాను, రాగుల జగన్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'తానాకాన్' డాక్టర్ల సదస్సు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోం డాక్టర్స్ అసోసియేషన్ (తానాకాన్) 2025 రాష్ట్రవ్యాప్త రెండు రోజుల కాన్ఫరెన్స్ శనివారం కరీంనగర్‌లోని ప్రతిమ హోటల్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. అతిరథ డాక్టర్లనే జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్పెషాలిటీ వైద్య నిపుణులు తమ యొక్క ప్రస్తుత సమకాలీన వైద్య విధానాలపై డెలిగేట్లకు విశదీకరిస్తూ అవగాహన కల్పించారు. చిన్న, మధ్య స్థాయి హాస్పిటల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చతో పాటు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంపొందించారు. పాండిచేరిలోని నాయర్ కారికల్ కాలేజీ నుంచి విచ్చేసిన డాక్టర్ విజయ్ కుమార్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ గూర్చి క్లుప్తంగా వివరించారు.కరీంనగర్‌తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 900 మంది డాక్టర్లు పాల్గొని వైద్య విద్యలోని నూతన ఒరవడులపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, తానా తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ కటారి, వైద్యులు చాట్ల శ్రీధర్, రాజకుమార్, మంగీలాల్, సునీల్‌రెడ్డి, మహేష్, సూర్యనారాయణ రెడ్డి, జగన్‌మోహన్ రావు, బిఎన్‌రావు, విజేందర్ రెడ్డి, టికెకె నాయుడు, లక్ష్మణ్, నాగ రఘురాం, విజయమోహన్ రెడ్డి, శ్రీలత రెడ్డి, శైలజ, మమతారెడ్డి, వై.నరేంద్ర, వి.జయరాం, ఇ.శైలజ, శేష శైలజ, రవికాంత్, రమణాచారి, రామ్ కిరణ్, అలీమ్, తదితర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. రెండో రోజు కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## గ్రామపాలన అధికారుల పరీక్షకు హాజరు కానున్న 142మంది అభ్యర్థులు


### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఈనెల 25 నుండి జరుగునున్న గ్రామపాలన అధికారుల పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనవారం సిద్దిపేట డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహించే గదులను పరిశీలించి గాలి, వెలుతురు సరిగ్గా వచ్చేలా చూడాలన్నారు. గోడ గడియారం ఏర్పాటు చేసి, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుకుండ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 930 గంటలకు పరీక్ష హాల్‌లోకి అనుమతించి పరీక్ష పూర్తయ్యేవరకు బయటకు పంపాలన్నారు. ఇన్విజీలెటర్లతో మాట్లాడుతూ పరీక్షకు 142 అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒకటి నిబంధల ప్రకారం టైంటు టైం పరీక్ష రాసే అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. అలాగే వారి వెంట హాల్ టికెట్‌తో పాటు 2 పాస్‌పోర్టు ఫోటోలు, బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ను, గుర్తింపు కార్డును మాత్రమే తీసుకొని ఉదయం 9.30 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునిత, డిఆర్‌డిఓ జైదేవ్ ఆర్య, కలెక్టర్ ఎఓ అబ్దుల్ రహమాన్, తహశీల్దార్ సలీంమియా, అసోసియేట్ ప్రొఫెసర్ ఆయోధ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఫోకస్



## సమస్యలు ఎన్నో..

రేసింగ్ సమయంలో రైడర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు. వాటిలో వేడి, చెమట ప్రధానమైనవి. రేసు జరుగుతున్నప్పుడు రైడర్ శరీరం వేడెక్కుతుంది. హెల్మెట్‌లో చెమట ఎక్కువగా వచ్చి అసౌకర్యంగా మారుతుంది. దీని వల్ల దృష్టి, ఫోకస్ అంతరించిపోతుంది. రేసర్లపై జుట్టు ప్రభావం కూడా ఉంటుంది. అందుకే వారు రేసింగ్ సమయాల్లో జుట్టును స్టైయిలింగ్ చేయరు. పొడవుగా ఉంచరు. హెల్మెట్ తలకు సరిగ్గా ఫిట్ కావాలంటే, పొడవాటి జుట్టు ఉండకూడదు. హెల్మెట్ తలకు అతుక్కున్నట్టుగా ఉండాలి. ఎక్కువ జుట్టు ఉంటే లేదా జుట్టు గందరగోళంగా ఉంటే, హెల్మెట్ ఫిట్ ఖచ్చితంగా ఉండదు. ఇది ప్రమాదకరం. హెల్మెట్ కదిలే అవకాశం ఉంటుంది. ప్రమాద సమయంలో సరైన రక్షణ ఇవ్వదు. పొడవైన జుట్టు లేదా జుట్టు సరిగా గట్టిగా కట్టకపోతే, అది హెల్మెట్ లోపల కదులుతుంది. కొన్ని సార్లు కళ్ల ముందుకు వచ్చి విజన్‌ను బ్లాక్ చేస్తుంది. రేస్ జరిగేది హైవేపైన కాదనేది గుర్తుంచుకోవాలి. రేసింగ్ ట్రాక్‌లో ఒక్కసారిగా దృష్టి తప్పితే, ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం. హెల్మెట్ వాల్వ్‌ఫిట్, నీటిని నానగా చేయకపోవడం, చెమట తట్టుకునే క్యాప్‌లు వాడతారు. కానీ జుట్టు పొడవుగా ఉంటే ఇవన్నీ పనిచేయవు. అందుకే, ఎక్కువమంది రైడర్లు చాలా చిన్నగా హెయిర్‌కట్ చేసుకుంటారు లేదా బజ్ కట్ వంటివి వాడతారు. కొందరు హెయిర్‌నెట్‌లు ఉపయోగిస్తారు. కానీ అది చిన్న జుట్టు ఉన్నవారికి మాత్రమే ఉపయోగకరం.

### బ్రేక్ వేస్తే కష్టమే!

రేసింగ్ సమయంలో ఒక్కసారి బ్రేక్ వేసినా, తర్వాత మళ్లీ బైక్‌ను నియంత్రించటం చాలా కష్టం. మోటో జిపి వంటి హైస్పీడ్ రేసుల్లో బ్రేక్ అనేది ఓ విజ్ఞాన శాస్త్రం. బైక్‌లు గంటకు సుమారు 300 కిలోమీటర్లకుపైగా వేగంతో దూసుకెళతాయి. అంతటి వేగాన్ని 100 లేదా అంతకంటే తక్కువకు తగ్గించడాలంటే, గట్టిగా బ్రేక్ వేయాలి. అలాంటప్పుడు మోటార్‌సైకిల్ స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. బ్రేక్ వేయడం వల్ల ముందుచక్రంపై ఎక్కువ బరువు పడుతుంది. అప్పుడు చక్రం స్కిడ్ కావచ్చు, లేదా బైక్ వెనుక టైరు గాల్లోకి లేవచ్చు. టైర్లు ట్రాక్షన్ కోల్పోతే, తిరిగి అదే గ్రిప్ రావటం కష్టం. అసంతులితంగా ఉన్న బైక్‌ను మళ్లీ సరిగ్గా నిలబెట్టటం అత్యంత ప్రావీణ్యం కలిగిన రైడర్‌కే సాధ్యమవుతుంది. హైవే బైక్‌లతో పోలిస్తే, రేసింగ్ బైక్‌లు ఎక్కువ శక్తివంతమైనవి కావడంతో ఈ వ్యవహారం మరింత క్లిష్టం అవుతుంది. శిక్షణతో మాత్రమే ఈ సమస్యను అధిగమించగలుగుతారు. మలుపులో బ్రేక్ చేస్తూ మెల్లగా వదలడం, ఇంజిన్‌నే బ్రేక్‌లా ఉపయోగించటం, శరీరం ఒత్తిడిని సర్దుబాటు చేయటం వంటి టెక్నిక్‌లు నేర్చుకుంటారు.


### భీకరమైన శబ్దం

రేసింగ్ మోటార్‌సైకిళ్లు అత్యంత భీకరమైన శబ్దం చేస్తాయి. ఇది సుమారు 120 డెసిబెల్స్ ఉంటుంది. అంటే, ఒక రాకెట్ లాంచ్ సమయంలో వచ్చే శబ్దం స్థాయి లేదా రాక్ కాన్సర్ట్‌కి ముందునుంచి నిలబడి వినిపించే శబ్దంలా ఉంటుంది. మరో రకంగా చెప్పాలంటే, వేగంగా పని చేస్తున్న జెట్ ఇంజిన్ స్థాయికి సమానం. ఇంతటి శబ్దం రావడానికి కారణం లేకపోలేదు. రేస్ బైక్ టైర్లు నిమిషానికి 18,000 లేదా అంతకంటే ఎక్కువ సార్లు తిరుగుతాయి. ఈ బైక్‌లకు సాధారణ మఫ్లర్లు ఉండవు. వాటి ట్యూనింగ్ పవర్‌ను కేవలం రెస్పాన్స్ కోసం ఉంచుతారే తప్ప శబ్దాన్ని తగ్గించేందుకు కాదు. మల్టీ సిలిండర్, ఫోర్‌స్ట్రోక్, హై కంప్రెషన్ రేసింగ్ ఇంజిన్లు కావడంతో, శబ్దం విపరీతంగా ఉంటుంది. 120 డెసిబెల్స్‌కి పైగా శబ్దం 10 నిమిషాల కంటే ఎక్కువగా వినిపిస్తే, కర్ణభేరి చిట్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే రైడర్లు ప్రత్యేక ఇయర్ ప్లగ్స్ వాడతారు. పిట్ క్రూలో ఉన్నవాళ్లు నాయిస్ క్యాన్సలింగ్ హెడ్ ఫోన్స్ ఉపయోగిస్తారు. ప్రేక్షకులకు కూడా కొన్ని ట్రాక్స్ వద్ద ఇయర్ ప్రొటెక్షన్ సూచిస్తారు.

### మిల్లీ సెకను తేడాలో ఫలితాలు తారుమారు!

నిమిషాలు.. సెకన్లు కాదు.. ఒక్కోసారి మిల్లీ సెకన్లు లేదా సెకనులో 1000 వంతు కూడా ప్రొఫెషనల్ మోటార్ సైకిల్‌లో కీలకమవుతుంది. ఫలితాలను నిర్ణయిస్తుంది. ప్రొఫెషనల్ రైడర్లు అందరూ అత్యుత్తమ శిక్షణ పొందినవారే. బైక్‌లు టెక్నాలజీలో దాదాపు సమానంగా ఉంటాయి. రేసింగ్ క్లాసులకు అనుగుణంగా అన్ని బైక్‌లు ఒకే స్థాయి ప్రమాణాలను అనుసరిస్తాయి. అందుకే, చిన్నతప్పు కూడా చేయని రీతిలో, అత్యుత్తమ నైపుణ్యం ఉన్నవారినే విజయం వరిస్తుంది. 1996లో జరిగిన బ్రౌన్ గ్రాండ్‌ప్రీ (చెక్ రిపబ్లిక్) రేసులో మిక్ దూహాన్‌ను అలెక్స్ క్రివిల్లే కేవలం 0.002 సెకన్ల తేడాతో ఓడించాడు. ఇలాంటి ఫలితమే 2006 పోర్చుగల్ గ్రాండ్‌ప్రీ (ఎస్టోరిల్) లోనూ వెలువడింది. అప్పటి ప్రపంచ చాంపియన్ వాలెంటినో రోసీపై టోనీ ఎలియాస్ 0.002 సెకన్ల తేడాతోనే గెలిచాడు. 2019 బ్రిటిష్ గ్రాండ్ ప్రీ (సిల్వర్‌స్టోన్)లో మార్క్ మార్కెజ్‌ను అలెక్స్ రిన్స్ 0.013 సెకన్ల తేడాతో ఓడించి, విజేతగా నిలిచాడు. 2016 ఇటాలియన్ గ్రాండ్ ప్రీ (ముజెల్లో)లో మార్క్ మార్కెజ్‌పైనే జార్జ్ లోరెంజో 0.019 సెకన్ల తేడాతో విజయం సాధించాడు. 2018 కతార్ మోటో3 రేస్లో ఏడుగురు రైడర్లు తమ రేస్‌ను 0.423 సెకన్ల వ్యత్యాసంలో ముగించడం విశేషం. అంటే ప్రతి రైడర్ ఒక్క కనుపాప మెరుపు సమయం మాత్రమే తేడా. మిగేల్ ఒలివెరా మిగిలిన ఇద్దరిని చివరి మలుపులో ఓడించి, 0.316 సెకన్ల తేడాతో విజేతగా నిలిచాడు.

## టాప్ పొజిషన్‌లో మార్కెస్



డ్యూకాంటి లెనొవో జట్టుకు చెందిన మార్క్ మార్కెస్ ప్రస్తుతం టాప్ పొజిషన్‌లో కొనసాగుతున్నాడు. అతని ఖాతాలో మొత్తం 171 పాయింట్లు ఉంటే, అలెక్స్ మార్కెస్ (గ్రేసిని రేసింగ్ జట్టు) 149 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. డ్యూకాంటీ జట్టు రైడర్ ఫ్రాన్సెస్కో బాగ్నాయా (120 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాడు. బ్రిటిష్ గ్రాండ్‌ప్రీలో ప్రదర్శనలు వీరి పొజిషన్లను మారుస్తాయా? లేదా? అనేది ఆసక్తికరంగా మారిం ది. ఈ రేస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.



# నరాలు తెగే ఉత్కంఠ

నేడే బ్రిటిష్ గ్రాండ్‌ప్రీ

మోటార్ సైకిల్ రేసింగ్ అనుక్షణం రోమాంచికం

రోడ్లపై వేగంగా దూసుకెళ్లడం... రకరకాల విన్యాసాలు ప్రదర్శించడం ఇటీవల కాలంలో యువతకు ఫ్యాషన్‌గా మారింది. సరైన శిక్షణగానీ, నిర్దిష్టమైన ట్రాక్స్‌గానీ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇందుకు భిన్నంగా, మోటార్‌సైకిల్‌పై వేగాన్ని, నియంత్రణను కొనసాగించడంలో నైపుణ్యం సాధిస్తే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సాహసక్రీడాకారులుగా గుర్తింపు పొందవచ్చు. మోటార్‌సైకిల్ రేసింగ్‌లో పాల్గొని, కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. అత్యంత వేగవంతమైన, సాహసభరితమైన క్రీడలలో ఇది ఒకటి. రోడ్లు మాత్రమేకాదు... సర్క్యూట్లు, కొండ ప్రాంతాలు, మట్టి బాటలపైన కూడా మోటార్‌సైకిల్ రేస్‌ను నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనేవారు అత్యంత నైపుణ్యం కలిగిన డ్రైవర్లు, వారికి నిమిషానికే కాదు, క్షణానికే నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం అవసరం. ఇందులో మోటో గ్రాండ్‌ప్రీ రేసింగ్ అనేది ప్రపంచ అత్యున్నత స్థాయి మోటార్‌సైకిల్ రేసింగ్‌గా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో... వివిధ స్థాయిల్లో గ్రాండ్‌ప్రీని నిర్వహించడం ద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్ణయిస్తారు. యమహా, డ్యుకాటీ, హోండా, కెటిఎం వంటి ప్రముఖ బైక్ బ్రాండ్లు ఈ రేసుల్లో కనిపిస్తాయి. కాగా, బైక్స్ ఉత్పత్తి, రేసింగ్‌కు తగిన నాణ్యతను నిర్ధారించడానికి సూపర్‌బైక్ ప్రపంచ చాంపియన్‌షిప్ (ఎస్‌బికె)ను నిర్వహిస్తారు. అదే విధంగా మట్టిబాటలు, ఎత్తయిన పర్వత దారుల్లో మోటోక్రాస్ లేదా ఆఫ్‌రోడ్ రేసింగ్ జరుగుతుంది. దీర్ఘ ప్రయాణాల్లో నిర్దిష్ట సమయాల్లో గమ్యానికి చేరుకోవడమే లక్ష్యంగా ఎండ్యురో అండ్ ర్యాలీ రేసింగ్ నిర్వహిస్తారు. ఇలావుంటే, భారతదేశంలో మోటార్‌సైకిల్ రేసింగ్ తక్కువ స్థాయిలో ఉన్నా, బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్, ఎంఎంఆర్‌టి – చెన్నై లాంటి వేదికలు ఈ క్రీడలో శిక్షణా కేంద్రాలుగా వెలుగుతున్నాయి. టివిఎస్ రేసింగ్, హోండా ఇండియా టాలెంట్ కప్ వంటి ప్లాట్ ఫామ్స్ యువ రైడర్లకు ప్రోత్సాహం ఇస్తున్నాయి. స్థూలంగా చూస్తే మాత్రం యూరోపియన్ దేశాల మాదిరి మన దేశంలో మోటార్ జిపి రేసింగ్‌కు సరైన ఆదరణగానీ, ప్రోత్సాహంగానీ లేవు. ఈ పరిస్థితి మారుతుందని, మోటో రేసింగ్ ఇక్కడ కూడా వేళ్లూనుకుంటుందని ఆశిద్దాం.

ప్రతిష్టాత్మకమైన బ్రిటిష్ గ్రాండ్‌ప్రీ మోటార్‌సైకిల్ చాంపియన్‌షిప్ ఈనెల 25వ తేదీ ఆదివారం జరుగుంది. దీని ఫలితం కోసం ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సిల్వర్‌స్టోన్ వేదికగా జరిగే రేస్‌లో జయాపజయాలు ఎలావున్నా... నరాలుతెగే ఉత్కంఠ సృష్టించే పోరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. మోడోజిపి బైక్ గంటకు సుమారు 224 మైళ్లు లేదా 360 కిలోమీటర్ల వేగంతో దూసుకెళుతుంది. 2023 కతార్ గ్రాండ్‌ప్రీలో జార్జి మార్టిన్ 363.6 కిలోమీటర్ల వేగాన్ని నమోదు చేశాడు. ట్రాక్స్‌పై కార్లకంటే బైక్‌లు వేగంగా వెళతాయన్నది ఆశ్చర్యం కలిగించే నిజం. మోటోజిపి బైక్ కేవలం 2.5 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది.





ఫార్ములా వన్ కార్లకు ఇది 2.6 సెకన్లు. అంటే, ఫార్ములా వన్‌ను మినహాయించి, మిగతా రేసుల్లో కార్ల వేగం మోటో జిపి బైక్‌ల కంటే తక్కువే. కార్లు వేగంగా తిరుగుతాయి కాబట్టి, స్థిరత్వం అనేది డౌన్‌ఫోర్స్‌పై ఆధారపడి ఉంటుంది. అయితే, బైక్‌లను రైడర్లే నేరుగా నియంత్రిస్తారు. ఫోకస్, బ్యాలెన్స్, గ్రావిటీ తదితర అంశాలన్నీ రైడర్ చేతుల్లోనే ఉంటుంది. మోటో జిపి బైక్‌లు లైట్‌వెయిట్ అయినప్పటికీ, వాటి పవర్‌టువెయిట్ రేషియో కార్ల కంటే చాలా అధికం. అందుకే ఇవి వేగంలో తక్కువ స్థలాన్ని ఎక్కువగా ఉపయోగించగుతాయి. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. మోటార్‌సైకిల్ టైర్లు, ముఖ్యంగా రేసింగ్ బైక్‌ల టైర్లు, వెచ్చబడే వరకు పూర్తి స్థాయిలో పనితీరు ఇవ్వవు. వెచ్చతనం వల్ల టైర్లు ట్రాక్‌ను అంటిపెట్టుకుంటాయి. గ్రిప్ పెరుగుతుంది. చల్లగా ఉన్న టైర్లు గట్టి పదార్థంలా ఉంటాయి. ఇవి స్లిప్ అవ్వడానికి అవకాశముంది. అందుకే, రేసింగ్ ప్రారంభంలో చాలామంది డ్రైవర్లు జాగ్రత్తగా ఉంటారు. వేగాన్ని పెంచే ముందు టైర్లు వేడెక్కేంతవరకు తిరుగుతారు. వేగంగా బ్రేక్ వేయడం, తిరగడం, స్పీడుగా రాయిడింగ్ చేయడం వల్ల టైర్లు వేడెక్కుతాయి. కానీ ఇది ఒక్కసారిగా జరగదు. అందుకే టైర్ వార్మింగ్ ల్యాప్స్ ఉంటాయి. రేసు మొదలయ్యే ముందు బైక్‌ల టైర్లకు ఎలక్ట్రిక్ కవర్లు పెడతారు. ఇవి టైర్లను 80–100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడిగా ఉంచుతాయి. ఇవే టైర్ వార్మర్స్ అని పిలుస్తారు. రేసు మొదలయ్యే ముందు ఒక వార్మప్ ల్యాప్‌లో డ్రైవర్ టైర్లను సున్నితంగా వేడి చేయడానికి ప్రయత్నిస్తారు.

## ఏకాగ్రత కీలకం

మోటార్‌సైకిల్ రేసింగ్‌లో ఏకాగ్రత అత్యంత కీలకమైన అంశం. రెప్పపాటుకాలం నిర్లక్ష్యం వహించినా, ఘోర ప్రమాదాలు తప్పవు. మోటో జిపి వంటి ప్రొఫెషనల్ రేసుల్లో ప్రతి మిల్లీ సెకన్ కూడా ముఖ్యమైనదే. ఒక్కసారి దృష్టి తప్పినా రేసర్లు ఒక మలుపు మిస్ అవుతారు. ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండకపోతే బండి స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, మోటార్ జిపి రేసుల్లో రైడర్లు 40 నిమిషాల వరకు నాన్‌స్టాప్ ఫోకస్ చేస్తారు. ఈ సమయంలో వారు శరీరాన్ని హెల్మెట్‌తో ముందుకు వంచి, కళ్లతో అత్యంత స్పష్టంగా ట్రాక్‌ను స్కాన్ చేస్తారు. రైడర్ శరీరం, మెదడు, నిర్ణయ సామర్థ్యం అన్నీ ఒకేసారి ప్రదర్శించాల్సి ఉంటుంది. ఒక రేసు సమయంలో రైడర్ గుండె వేగం 180 నుంచి 200 బిపిఎం వరకూ ఉంటుంది (ఒక మామూలు వ్యక్తి జాగింగ్ చేస్తున్నప్పుడు 120–140 బిపిఎంఉంటుంది). ఒక్క రేసులోనే, చెమట, ఒత్తిడి వల్ల రేసర్లు 2 నుంచి 3 కిలోల బరువు తగ్గుతారు. లక్షల సంఖ్యలో మైక్రో డిసిషన్లు తీసుకోవాలి. ఒక్క చిన్న తప్పిదమే భారీ ప్రమాదానికి దారితీస్తుంది. అందుకే రైడర్లు రేసింగ్ సమయంలో శరీర శ్రమతో పాటు మానసిక దృఢత్వాన్ని 100 శాతం వాడతారు.



---

# పైడిపల్లి గుడిసే వాసులకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలి

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** పైడిపల్లి గుడిసే వాసులకు పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓ విజయలక్ష్మి కి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ మండలంలోని పైడిపల్లి గ్రామ పరిధిలోని ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు భూములపై పేదలు గుడిసెలు వేసి జీవనాన్ని కొనసాగిస్తున్నారని, గతంలో రెండు సార్లు వాటిని తొలగించడం వల్ల పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో, చెట్ల కింద నివాసం ఉండే స్థితికి చేరుకున్న ఈ నిరుపేద కుటుంబాలకు స్థలాలు కేటాయించి, మౌలిక వసతులతో కూడిన ఇండ్లు నిర్మించాలన్నారు. ప్రభుత్వానికి చెందిన ఎస్ఆర్ఎస్‌పి భూములు కొంతమంది చేత అక్రమంగా ఆక్రమించబడుతున్నాయని, వాటిని వెంటనే కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంఘీ ఎలేందర్, జిల్లా సమితి సభ్యులు జన్ను రవి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు సీజ్ చేయాలి

● విద్యారంగంగంపై సిఎం సమీక్ష వేయాలి ● ప్రభుత్వ విద్యాసంస్థల్ని అభివృద్ధి చేయాలి : మణికంఠ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంవత్సరం జూన్ 12 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ విద్యాసంస్థల్ని సీజ్ చేసే చట్టం తేవాలని, రాష్ట్రంలో 12 ప్రభుత్వ గురుకుల ఇంటర్ కళాశాలలను మూసి వేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రోజున స్థానిక గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్‌లో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావశానికి ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హాజరైమాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విద్యారంగం గాడి తప్పిందని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవని, పాఠశాల కళాశాలలో యూనివర్సిటీలలో టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకులాలు మోడల్ స్కూల్లో కేజీబివిలలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలని, విద్యార్థులు లేరని సాకుతో ప్రభుత్వం 12ఎస్‌సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని మార్చుకోవాలని, గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం అన్ని రకాల ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి కృషి చేయాలని, రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల,కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదలపై ఇచ్చిన మాట తప్పుతున్నారని, అన్ని రకాల బకాయిలను విడుదల చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం సరికాదని, వెంటనే ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయాలని సిఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకున్న నేపథ్యంలో అన్ని విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను ఎట్టి పరిస్థితిలో ప్రభుత్వం పెంచవద్దని బికేటగిరి సీట్లను లక్షల రూపాయలకు అమ్ముతున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం నగర అధ్యక్షులు మాతంగి సాగర్, ధనాల ఉదయ్, ఎల్కపల్లి వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని, లౌకిక వాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** దేశ ప్రజలకి భారత రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందరికీ అందని ద్రాక్షగా పాలకులు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. శనివారం హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామంలో జక్కుల సాంబరాజు అధ్యక్షతన సిపిఐ సమావేశం జరుగగా ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ పేదలు, దళితులు, బహుజనులు నేటికీ రాజ్యాంగ హక్కులు అందడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. స్వేచ్ఛగా భావాలను వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్, దేశద్రోహి అంటున్నారని, ప్రభుత్వం దేశ ప్రజలలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు, పోరాటాలు నెలకొంటున్నాయన్నారు. పేద ధనిక తేడాను నిర్మూలించి సోషలిజం వైపు తీసుకెళ్లి ఆర్థిక సాంఘిక రాజకీయ సమానత్వం సాధిస్తాం అనే భారత రాజ్యాంగ లక్ష్యం పాలకులు నెరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే అన్నట్లు నేటి పాలకులు దిగజార్చారు అని ధ్వజమెత్తారు. ఎన్నికలలో డబ్బు, మద్యం, కులం, మతం, ప్రభావితం చేస్తున్నాయని పేదలు ఎన్నికలలో నిలిచి గెలిచే పరిస్థితి లేదన్నారు. ప్రాథమిక హక్కులకు ఆదేశిక సూత్రాలకు, జీవించే హక్కుకు భంగం కలిగిస్తూ రాజ్య హింస కొనసాగిస్తున్న పాలకుల్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలనకు భూమిలేని నిరుపేద దళిత బహుజనలందరికీ ప్రతి కుటుంబానికి భూమి పంచాలని కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుంది అన్నారు. పేదల కష్టాలు పోవాలంటే రైతు కూలీ రాజ్యం రావాలంటే కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలపరచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 26 ,27 తేదీలలో జరుగు హన్మకొండ జిల్లా రెండవ మహాసభలను బహిరంగ సభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం జిల్లా మహాసభల గోడ పత్రికలను విడుదల చేయడం జరిగినది ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి,మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, జక్కుల సాంబరాజు, మడిపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి చిలుకూరి రాము, బుర్ర సుధాకర్, ముద్రబోయిన రాజు, జక్కుల అశోక్, బుర్ర వెంకటేష్, బుర్ర స్వప్న, బుర్ర అనిత, జి శివ, ముంజ రమేష్, సాంద్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణ–పురం :** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కొనసాగిస్తున్న ఆపరేషన్ కగారును ఆపి మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని యాదాద్రి భువనగిరి సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం నారాయణపురం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మావోయిస్టులను హతమార్చడానికి చత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దుల్లో కాల్పుల మోతలతో దండకారణ్యం ఆదివాసి ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన పడుతున్నారని ఈ దాడుల్లో అమాయక ప్రజలు బలి అవుతున్నారని ఆయన అన్నారు. మేము చర్చలకు వస్తామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవకుండా కేంద్ర హోం మంత్రి వారిని అంతమొందించడమే మా లక్ష్యం అని చెప్పడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు. సమావేశానికి ముందు సిపిఐ జాతీయ నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, కమ్యూనిస్టు నిర్మాత, అమరజీవి నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ప్రజా సమస్యలే అజెండాగా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో పార్టీ గ్రామ శాఖ మహాసభలను నిర్వహించాలని ఆ తర్వాత మండల మహాసభ నిర్వహించు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే. శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహా, మంచాల జంగయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమైక్యత, సమగ్రతే సిపిఐ లక్ష్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/చింతలపాలెం:** దేశ సమైక్యత, సమగ్రతే సిపిఐ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో జరిగిన సిపిఐ మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన అమాయక పౌరుల ఉసురుతీసిన పాకిస్తాన్ ఉగ్రదాడులను ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదాన్ని ముట్టు పెట్టడాన్ని సిపిఐ హర్షిస్తోందని, కాని భారత్ అంతరంగ విషయాల్లో ట్రంప్ జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ చింతలపాలెం గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ఆ పథకంలో రాజకీయ జోక్యం తగదని, ఎన్నికల నాడు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, ఇచ్చిన హామీల అమలుకై సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 8వ తేదీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 19 నుండి 22 వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో పార్టీ రాష్ట్ర మహాసభలు, అలాగే పంజాబ్ రాజధాని చండిగడ్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, నాయకులు బొమ్మగాని నాగభూషణం, రవి, సారెడ్డి పాపిరెడ్డి, జియాలుద్దీన్, అబ్దుల్‌పాషా, గంధం మంగయ్య, భూక్య రామారావు, తాళ్లురిను, అంకయ్య, బారెడ్డి హైమావతి, భద్రారెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతార గిరిప్రసాద్

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్‌కు దక్కుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి శనివారం శేషగిరిభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ, అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అధ్యయనం చేసి ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమంకోసం నిరంతరం కృషి చేయాడన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్ణ చేయాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కొరిమి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, భూక్యా శ్రీనివాస్, కేశవరావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం ఎంపి వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.50 లక్షల చెక్కులను శనివారం బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితుల కుటుంబ సభ్యులతో ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/మణుగూరు:మణుగూరు పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పిరవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఇసుక రైసింగ్ కాంట్రాక్టర్స్, 14 టైర్, 12 టైర్ అసోసియేషన్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్‌తో కలిసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాడిఎస్‌పి మాట్లాడుతూ ఇసుక, బొగ్గు లారీలు రోడ్లపై నిలిపి ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా చూడాలని సూచించారు. ఇసుక లారీలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్లు, టిఎస్‌ఎండిసి అధికారులను ఆదేశించారు. లారీలు వెళ్లే మార్గాల్లో గ్రామ ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్లపై వాటరింగ్ చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ కోసం వాలంటీర్లను నియమించాలని సూచించారు. రోడ్లపై లారీలు నిలిపి ఉంచినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని, లారీలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బిటిపిఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, సిఐ (ఈ బయ్యారం) వెంకటేశ్వర్లు, ఎస్ఐప్రసాద్, టిఎస్‌ఎండిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ ఫలితాల్లో న్యూవిజన్ స్టేట్ ఫస్ట్



ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ : పాలిసెట్ 2025 ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు తూమాటి లాస్యశ్రీ 150కి 150 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. అదేవిధంగా పాఠశాలకు చెందిన కోట సాత్విక స్టేట్ 19వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మైఖేల్ తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన పాలిసెట్ పరీక్షా ఫలితాల్లో తుమాటి లాస్యశ్రీ ఎంపిసి, ఎంబైపిసి రెండు స్ట్రీమ్‌ల నుంచి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులకు, సహకరించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు.

## త్రివేణికి స్టేట్ ర్యాంకులు




ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ : పాలిసెట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్టేట్ ర్యాంకులు సాధించారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన సరయు 120 మార్కులకు గాను 109 మార్కులతో రాష్ట్ర స్థాయి 187వ ర్యాంకు, ప్రణవి 106 మార్కులతో 339వ ర్యాంకు, వెంకటవర్షి త్ 107 మార్కులతో 481వ ర్యాంకు, చరిత 103 మార్కులతో 529వ ర్యాంకు, శాహిస్త 99 మార్కులతో 1340వ ర్యాంకు, మన్విత 94.5 మార్కులతో 1 357వ ర్యాంకు, హమ్సిక 91 మార్కులతో 1823వ ర్యాంకు సాధించినట్లు ప్రి న్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నలుగురు విద్యార్థులు 100కు పైగా మా ర్కులు, ఎనిమిది మంది విద్యార్థులు 90కు పైగా మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్ఒకాట్రగ డ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## బిఆర్క్, ప్లానింగ్ ఫలితాల్లో హార్వెస్ట్ ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ : దేశ వ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆర్కిటెక్చర్, ప్లానింగ్ విద్యనభ్యసించుటకు ఎన్‌టిఎ వా రు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెయిన్స్ బి ఆర్క్, ప్లానింగ్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. శనివారం ప్రకటించిన ఫలితాల్లో వివిధ కేటగిరిల్లో తమ కళాశాల విద్యార్థిని జస్వంత్ సాయి 38వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. బి. సాయిచరణ్ 50వ ర్యాంకు, బి. సంజయ్ 86వ ర్యాంకు, ఎం. నాగయశ్వంత్ 117వ ర్యాంకు, వై. సాయినేహ 128వ ర్యాంకు, బి. ప్రణీత 141వ ర్యాంకు, వేముల సాయిదీపక్ 206వ ర్యాంకు, పి. క్రిష్ సాత్విక్ 225వ ర్యాంకు, వి. శరణ్ గోపాల్ స్వామి 253వ ర్యాంకు, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 302వ ర్యాంకు కందుల రోహిత 346వ ర్యాంకు కమతం విన్య 363వ ర్యాంకులు సాధించారన్నారు. ప్లానింగ్ విభాగంలో వేముల సాయిదీపక్ 64వ ర్యాంకు, వై. సాయినేహ 856వ ర్యాంకులు సాధించారని వారు వివరించారు. విద్యార్థులను విద్యా సంస్థల కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ లు అభినందించారు.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తకు దేహశుద్ధి



ప్రజాపక్షం/అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మ ండలం వినాయకపురంలో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తకు భార్య దే హశుద్ధి చేసిన సంఘటన జరిగింది. శనివారం వినాయకపురంకు చెందిన అ బ్దుల్ హకీజ్ అనే వ్యక్తి తన ఇంట్లో భవాని అనే మహిళతో ఏకాంతంగా ఉండగా అతని భార్య ఫాతిమా పట్టుకుంది. కుటుంబసభ్యులతో కలిసి పట్టుబడిన ఇద్దరి కి దేహశుద్ధి చేసి తాడుతో మొదట మంచానికి ఆతర్వాత ఇంటి ముందు కిటికీకి కట్టేసింది. భార్య ఫాతిమా మాట్లాడుతూ తన భర్త అబ్దుల్ హకీజ్ భవాని అనే మ హిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను వేధింపులకు గురి చేశాడని, రెండేళ్లుగా తనని ఇద్దరి పిల్లల్ని పట్టించుకోవటంలేదని తెలిపింది. అక్రమ సంబంధం కారణంగానే భర్త తమ కుటుంబానికి దూరమయ్యాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని భర్త అబ్దుల్ హకీజ్‌తో పా టు భవాని అనే మహిళను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించా రు.

## జిపిఒ పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నగరంలోని స్వర్ణభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బిఐటి) కళాశాల కేంద్రంగా మాజీ వీఆర్ఏ, వీఆర్ఓలకు ఆదివారం నిర్వహించనున్న గ్రామపాలన అధికారుల (జిపివో) నియామక అర్హత పరీక్ష కేంద్రం వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. సభలు, సమావేశాలు, ఐదుగురికి మించి గుంపులు గుంపులుగా సంచరించడం, డిజేలు, మైకులతో ఊరేగింపులు, ర్యాలీలు నిషేదమన్నారు. ఆంక్షలను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

మైనర్ బ్రిడ్జి, రోడ్డు పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అభివృద్ధి పనులు వర్షాకాలం నేపథ్యంలో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో ఎస్‌సినున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, ఎఫ్‌డిఆర్ నిధులు రూ. 99 లక్షల అంచనా వ్యయంతో కోయచలక, కోటపాడు రహదారిపై చేపట్టిన మైనర్ బ్రిడ్జి పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిసి రోడ్లు, డ్రైన్లు, మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాకాలం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఉన్న పేద ప్రజలకు మొదటి దశలో ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతేడాది కురిసిన వర్షాలకు కోయచలక, కోటపాడు మధ్య ఉన్న రహదారి కొట్టుకుపోయిందని దానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 99 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన తెలిపారు. గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పిఆర్ ఎస్‌వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్వేత, ఎండిఒ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి:తెలంగాణ ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. మండలం లోని చెరువుమాధారం, బుద్ధారం, నేలకొండపల్లి, గువ్వలగూడెం గ్రామాలలో శనివారం పర్యటించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున్న రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించే సమయంలో ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతాంగం కోసం అనేక సంకేమ పదకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ కు దక్కుతుందని అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నందున్న అభివృద్ధి ఫలాలు జిల్లా కు ఎక్కువగా అందుతున్నాయని అన్నారు. పార్లమెంట్ పరిధిలో రూ.14 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయి కార్యకర్తలందరికీ అండగా నిలుస్తామని అభయమిచ్చారు. మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

ఇందిమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/తల్లాడ: పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన సాగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ ఆర్‌బి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 525మంది పేదకుటుంబ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ నిర్మాణంలో భాగంగా తల్లాడ మండలంలోని అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పేదవాడి ఇంటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం చేసుకోవటానికి మనందరం ఒక పండుగలాగా, కాంగ్రెస్ కుటుంబసభ్యులు లాగా ఇందిమర్మ పట్టాలు తీసుకుంటున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. తల్లాడ మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతున్న సందర్భంగా వారికి మొదటి విడత రూ1లక్ష జమ చేయటం జరిగిందని, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుకాపా సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ తూము వీరభద్ర రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు , హౌజింగ్‌శాఖ అధికారులు, పంచాయతీల ఇందిరమ్మ కమిటీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తుపాకీగుండ్లకు ఎదురొడ్డి నిలిచిన దీశాలి గిరి ప్రసాద్

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరి ప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలి పోయాడని, భూ పోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిన ఘనత గిరిప్రసాద్‌కు దక్కుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర, జాతీయ ఉప కార్యదర్శిగా, ఎంఎల్‌ఏగా, ఎంపిగా ప్రజలకు సేవలను అందించారని కొనియాడారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్ర రావు, జిల్లా సమితి సభ్యులు , ప్రజా సంఘాల నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి పట్టివేత

ప్రజాపక్షం/ఇల్లెందు: విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా శనివారం 698కిలోల నిషేధిత గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్లగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలోని ఎసిఎ సులానగర్ మినిస్ట్రీ చర్చి వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో ఎస్కార్టుగా వస్తున్న కార్ల నంబరు హెచ్‌ఆర్ 05బీకె6032, హెచ్‌ఆర్63ఈ7315 గల ఐచర్‌వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా దాదాపు 698కిలోలు రూ.3,49,00,000లు విలువగల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐచర్‌వ్యాన్‌లోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులు, కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, కార్లను, 5మొబైల్స్‌లను సీజ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం సీలేరు అటవీప్రాంతం నుంచి హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఆరుగురు నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



**పట్టుబడిన గంజాయి దహనం**

ఖమ్మం క్రైం : ఖమ్మం కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నిషేధిత గంజాయిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వంలో శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేసినట్లు పరిపాలన విభాగం అడిషనల్ డిసిపి నరేష్ కుమార్ తెలిపారు. 17 కేసుల్లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ, విక్రయిస్తూ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి తెలిపారు.స్వాధీనం చేసుకున్న 90.706 కిలోల ఎండు గంజాయిని సీజ్ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా , తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఎడబ్ల్యూఎం కన్సల్టెన్సీ బయోవెస్టేజ్ బర్నింగ్‌ప్లాంట్‌లో గంజాయిని దహనం చేసినట్లు పేర్కొన్నారు. సిసిఆర్‌పి సిఐ , తల్లాడ ఎస్ఐ ఇతర అధికారులు పాల్గొన్నట్లు డిసిపి తెలిపారు.

## అధికారులను నిర్బంధించిన గ్రామస్థులు



ప్రజాపక్షం/అశ్వారావుపేట : రామన్నగూడెం గ్రామపంచాయతీలో సీతారామ కాలువ భూసేకరణ కోసం వచ్చిన అధికారులను శనివారం గ్రామస్థులు నిర్బంధించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రామన్నగూడెం గ్రామ పంచాయతీలో 17సంవత్సరాల క్రితం వెంకమ్మ చెరువు వరద కాలువ నష్టపరిహారం మంజూరు చేయలేదని, రామన్నగూడెం గ్రామపంచాయతీ ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని, తక్షణమే మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం సమస్యను పరిష్కరిస్తామని అధికారుల హామీతో ధర్నాను విరమించారు.

## ప్రతీ ఇంటికీ ప్రభుత్వసంక్షేమ పథకాలు: జారే



ప్రజాపక్షం/చంద్రుగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర వెయ్యటమే తన లక్ష్యమని అశ్వారావుపేట ఎంఎల్‌ఎజారే ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 50శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న జనుము, జీలుగు విత్తనాలను రైతులకు అందజేశారు. అదే విధంగా ఐదు లక్షల నలభై మూడు వేల 500 విలువ చేసే సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను 20 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సామాన్య మధ్య తరగతి ప్రజలకు అత్యవసర సర్జరీలకు ఎల్‌ఒసిలు వైద్య ఖర్చులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కోట్లాది రూపాయలను ప్రజలకు వినియోగిస్తుందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా అమలు చేస్తామని అర్హులైన వారు అధైర్యపడవద్దన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ తారాచంద్, సొసైటీ చైర్మన్ చెవుల చంద్రరావు, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం రక్షణకు 30న కలెక్టరేట్‌లో ధర్నా

ప్రజాపక్షం/కారేపల్లి:ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈనెల 30న జరిగే కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. కారేపల్లిలో ధర్నా జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 పని దినాలు కల్పించి రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని, కొలతల పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫోటో దింపే పద్ధతి రద్దు చేయాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించి, పేస్లిప్పులు ఇచ్చి వారం వారం బిల్లులు చెల్లించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించి, ఖాళీ పోస్టలను భర్తీ చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి కేరళ తరహాలో చౌక దుకాణాల వద్ద 12 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు అందరికీ మంజూరు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అన్నారపు కృష్ణ, అగోల్ల హరి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడదూరంలో ఇప్పలగుంపు

పట్టించుకోని పాలకులు, అధికారులు..* గిరిజనుల గోడు ఆలకించేది ఎవరు?





ప్రజాపక్షం/మణుగూరు:పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అన్నారు మహాత్ముడు. కానీ అటువంటి పల్లె ప్రాంతాలు ప్రస్తుతం పాలకులచే నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, ఫలితంగా కనీస మౌలిక వసతులకు, సౌకర్యాలకు కూడా నోచుకోని పల్లెలు నేటి సమాజంలో కోకొల్లలుగా ఉన్నాయని, అందుకు ఉదాహరణగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఇప్పల గుంపు గ్రామమని, సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి పేర్కొన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటనలో పాలకుల, అధికారుల తీరును ప్రశ్నించారు. మండలంలోని పగిడేరు పంచాయతీ పరిధిలోని ఇప్పలగుంపు అనే ఆదివాసి గ్రామంలో కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఆ ప్రాంత ప్రజలు జీవితాన్ని సాగిస్తున్నారన్నారు. సగటు జీవికి ప్రధాన అవసరాలైన రహదారి, గూడు, నీడ అనేవి కూడా లేకుండా ఈ గిరిజనులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి సరైన రోడ్డు మార్గం కూడా లేకపోవడం ఆందోళన చెందాల్సిన విషయమని, ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే పలు గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గిరిజన ప్రజల బాధలు, పాలకులకు, అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పాలకులు వారి ఇండ్ల ముందు అందమైన రోడ్లు వేసుకోవడంలో చూపిన శ్రద్ధ, గిరిజన గ్రామాలపై కనీసం చూపక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. గ్రామానికి చేరుకునే ప్రధాన రహదారిఅధ్వానంగా రాళ్లూరప్పలతో కనీసం మనుషులు నడవలేని విధంగా తయారైందని అయినా ఇప్పటివరకు కనీసం అధికారులు గ్రామవైపు కన్నీటి చూడటం లేదని విమర్శించారు. ప్రతి ఏటా ఆదివాసీ గ్రామాల్లో రోడ్లు నిర్మాణానికి రూ. కోట్లలో ఖర్చుపెడుతున్నామని ప్రభుత్వాలు లెక్కలు చూపుతున్నాయని, కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్, ఫారెస్ట్ అధికారులు చొరవ చూపి ఇప్పల గుంపు గ్రామానికి ఐటిడిఎ ద్వారా మంజూరైనా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని రవి డిమాండ్ చేశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రావెల్ పోసి, కాలువపై తూరులతో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## 26 నుంచి సర్వేయర్లకు శిక్షణా తరగతులు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే చేయడం కోసం లైసెన్సు సర్వేయర్లుగా ఎంపికైన వారికి ఈనెల 26 నుండి జూలై 26 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ దేశాయిపేట లోని సికేఎం కళాశాలలో 315 లైసెన్స్ సర్వేయర్ల అభ్యర్థులకు 50 రోజుల పని దినాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఉదయం 9 గంటలకు క్షేత్రస్థాయిలో శిక్షణ, 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు థియరీ, ప్రాక్టికల్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఎంపికైన సర్వేయర్లు శిక్షణ తరగతులకు హాజరై భూభారతి చట్టంపై సంపూర్ణ అవగాహన పొందాలని కలెక్టర్ తెలిపారు..

## పకడ్బందీగా గ్రామపాలనాధికారి పరీక్షలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** గ్రామ పాలనాధికారి పరీక్షలు పకడ్బందిగా నిర్వయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సిసిఎల్ఎ కమీషనర్ నవీన్ మిట్టల్ పరీక్షలపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానుండగా 8 గంటల నుండి 9.20 గంటల వరకు ప్రశ్న పత్రాలు పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్ష కేంద్రా ల వద్ద సీటింగ్ ఆరేంజ్‌మెం ట్ పక్కాగా ఉండాలని, అ భ్యర్థులకు అవసరమైన త్రా గునీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలన్రాను. ఇన్విజిలెటర్లు అం దుబాటులో ఉండాలని, 144 సెక్షన అమల్లో ఉండాలన్నారు. పరీక్ష అనంతరం పేపర్ అందరి నుండి ఒకే సారి తీసుకొని సీల్ చేయాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటి కలెక్టర్ సుహాసిని, కలెక్టరేట్ ఏఓ మన్సూర్ పాల్గొన్నారు.

## సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ:** అభివృద్ధి.. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ పరిధిలోని రూ. 99.80 లక్షలతో చేపట్టిన ఏకశిల జంక్షన్ అభివృద్ధి పనులకు, రూ. 98 లక్షలతో గొర్రెకుంట అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి పనులు, రూ. 80 లక్షలతో గొర్రెకుంట అంబేద్కర్ జంక్షన్ నుంచి రెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వరకు నిర్మించనున్న వరద కాలువ డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ప్రజా సమస్యల మీద డివిజన్ల వారీగా కార్యక్రమాలు ని ర్వహించామని, ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఒక వైపు సం క్షేమం, మరోవైపు అభివృద్ధి పనులతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ప్రజల సహకారం ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. త్వరలో డివిజన్‌లో కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని త్వరలో ఏర్పాటుచేయబోతున్నామని, ఇప్పటికే గీసుకొండ, సంగెం, ఆత్మకూరు, దామెరలో కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలు ప్రారంభమై మూడు బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నారన్నారు. డివిజన్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మంచినీరు, శానిటేషన్, లైటింగ్ ప్రాధాన్యమైనవని తెలిపారు.

## సహకార సంఘాల బలోపేతానికి సహకరించాలి : రాజేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సేవలను వినియోగించుకుని సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు సహకరించాలని జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు పిఎసిఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సంవత్సర సందర్భంగా జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు వంటివి సేవలు కాకుండా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మైసిరెడ్డి, సీఈవో మాసంపల్లి రణదీర్, స్టాఫ్ అసిస్టెంట్ రాజేందర్, సంఘ సభ్యులు, రైతులు సంపత్, రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** విద్యారంగంలో మహబూబాబాద్ జిల్లా గ్రాఫ్ ను మరింత పెంచేలా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మహబూబాబాద్ హోలీ ఏంజెల్స్ హైస్కూల్‌లో జ రిగిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల వృత్యంత శిక్షణ తరగతులకు ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, జిల్లా విద్యాశాకాధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం నాయక్ సంఘ బాధ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి కృషితో జిల్లాలో పదవ తరగతిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సన్మానం కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ వెంకటేశ్వర్లు, కోశాధికారి సమ్మెట వెంకటేశ్వర్లు,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందుల శ్రీరాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వాంకడోత్ బాలాజీనాయక్, అనితాదేవి, ఇజల్లా అసోసియేట్ అధ్యక్షులు బానోత్ శంకర్‌నాయక్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో ఎంజిఎం కీలకం

వైద్య సిబ్బంది, వైద్యుల పట్ల అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలకు వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించే కీలకమైన తల్లి లాంటిది ఎంజిఎం ఆసుపత్రి అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుల్లో మొదటగా పర్యటించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అత్యవసర సేవ విభాగంలో ఉన్న ఎక్స్ రే, ల్యాబ్, ఆక్సిజన్ స్టోర్, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న భోజనం, బోజన శాల (డైట్) పరిశీలించారు. పురుషుల, మహిళల వార్డ్‌లను, ఫార్మసీ స్టోర్, చిన్నపిల్లల అత్యవసర విభాగ కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో పలు వార్డులలో అపరిశుభ్రంగా ఉండటం, వైద్యు లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, రిజిస్టర్‌లను సరిగా ఉంచుకోకపోవడం పట్ల తీవ్ర ఆ గ్రహం వ్యక్తంచేశారు. ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లపై అసహనం వ్యక్తంచేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు గుండెలాంటి ఆసుపత్రిని బాధ్యతాయుతంగా ఉంచకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది, వైద్యులు, అధికారులు నైతిక బాధ్యతగా వ్యవహరించి ఆసుపత్రి పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. ప్రజలకు సేవ విషయంలో,ఆసుపత్రి నిర్వహణ పట్ల అభద్రతా భావం కలిగిన వారిని వెంటనే విధులనుంచి తప్పించాలని, పని చేయలేని పక్షంలో స్వచ్ఛందంగా బదిలీలపై వెళ్లొచ్చు అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఒ, వైద్యులు ఉన్నారు. పెద్దమ్మగడ్డ, భద్రకాళి ఆలయ ప్రాంగణాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్ నగర అభివృద్ధి, సుందరీకరణకు ప్రజల భాగస్వామ్యం అవసరం అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలసి పెద్దమ్మగడ్డ, గొల్లపల్లి, భద్రకాళి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడంలో భాగంగా రోడ్డు వెడేల్పు చేయడం తప్పనిసరి అని అన్నారు.అన్యాక్రాంతం అవుతున్న ప్రాంతాల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ భీమారం స్కిల్ స్టాక్ ఇంటర్ నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యా బోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చునన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. సమాజ స్థాపనలో విద్యార్థులను ఉత్తమమైన, ఆదర్శనీయమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, నూతన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అందిస్తున్న అంశాలను పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆర్‌జెడి సత్యనారాయణ రెడ్డి, హన్మకొండ డిఇఒ వాసంతి, ఎసిపి సైదులు, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, సుదర్శన్, డిస్టిక్ రిసోర్స్ పర్సన్స్, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ దంతాలపల్లి మండల 3వ మహాసభ మండల కేంద్రంలో ఎసల్ల వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా పాలన చేస్తున్న బిజెపి గవర్నర్, రాష్ట్రపతిలాంటి అత్యున్నత పదవులను తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేయాలని కుట్రలు పన్నుతూ, మరోపక్క మత విద్వేషాలను రెచ్చగొడుతూ మైనార్టీ వర్గాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ రాజ్యాంగంలో కల్పించిన అవకాశాలను తుంగలో తొక్కి లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపి పాలనపై ప్రజాస్వామిక శక్తులు ఏకమై ప్రతిఘటించాలని అన్నారు. దంతాలపల్లి మండల కనీనర్‌గా పోలెపాక వెంకన్న, కోకన్వీనర్‌గా రాజశేకర్‌తో పాటు 5గురుని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా మొదటిసారి మండలానికి వచ్చేసిన నల్లు సుధాకర్‌రెడ్డిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. నాయకులు యాకసాయిలు, పి.వెంకటేశ్వర్లు, సోమారపు వెంకటయ్య, రామచంద్రు, పి.యాకయ్య, వై.పరశురాములు, జి.కోటి, పి.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి సిపిఐ రాజీలేని పోరాటం

పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలో జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఈ నెల 26, 27 తేదీల్లో హసన్‌పర్తిలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. శనివారం శాయంపేట మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో సిపిఐ ఐనవోలు మండల 2వ మహాసభ రిపిక ఉగేందర్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హాజరై మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్నిరంగాలలో విఫలమయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందన్నారు. మోదీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఇడిలను ప్రయోగిస్తున్న మోదీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేశారన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, జిల్లా నాయకులు మాలోత్ శంకర్, రాసమల్ల దీనా, నాయకులు రాసమల్ల కుమార్, రీపిక కళా, కే. మాధవి, మమత, లావణ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ మండల కన్వీనింగ్ కమిటీ ఎన్నిక**

సిపిఐ మండల కన్వీనర్ గా రీపిక ఉగేందర్, కో కన్వీనర్లుగా కె. మాధవి, ఆర్. రాజులతో పాటు 5 గారితో కన్వీనింగ్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

## డిస్నీల్యాండ్ విద్యార్థినికి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో సీటు



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** దామెర మండలం ఒగ్లాపూర్ లోని డిస్నీల్యాండ్ ఇటెక్నో హై స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న గుగులోతు కృతిక ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆరవ తరగతిలో ప్రవేశానికి క్వాలిఫై కావడం పట్ల పాఠశాల వ్యవస్థాపకులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య ,బాలుగు లక్ష్మీ నివాసం, డైరెక్టర్లు బాలుగు శోభారాణి, దయ్యాల రాకేష్ భాను , దయ్యాల దినేష్ చందర్ సంతోషాన్ని వెలిబుచ్చారు. పట్టుదల కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ అన్నారు. ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడే యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్ :** యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ ఎగ్జామినేషన్ 2025 నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141 మంది అభ్యర్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు. మొదటి సెషన్ పరీక్ష ఆదివారం ( మే 25న) ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్‌లో పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు. ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని పేర్కొన్నారు. కావున అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డు తో పాటు పెన్ను, పెన్సిల్లు వెంట తెచ్చుకోవాలన్నారు. చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు. పరీక్షా కేంద్రంలోనికి ఉదయం 8, మధ్యాహ్నం 1:00 గంటల నుండి పరీక్ష రాసే అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

# సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** సురక్షిత పుష్కర స్నానాలు ఆచరించి సరస్వతి అమ్మవారి దీవెనలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు. సరస్వతి నదీ పుష్కరాలు కొనసాగుతున్న నేపథ్యంలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కర ఘాట్‌లో శనివారం ఉదయం నుండే భక్తుల రద్దీ పెరుగుతోంది. ఉదయం నుంచే వే లాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం ఘాట్‌కు తరలివస్తున్నారు. ప్రభుత్వం తరపున పుష్కరస్నానాల కోసం భ క్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. శు ద్ధమైన నీటి సరఫరా, వైద్య సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు తదితర కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు మా ర్గదర్శనం చేస్తున్నారు. రద్దీ నియంత్రణ చర్యల్లో భాగంగా తాత్కాలిక బస్‌స్టాండ్, పా ర్కింగ్ ప్రదేశాల నుండి భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. పోలీస్‌శాఖ, రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖలు, ఆర్ డబ్ల్యూఎస్, దేవస్థానం తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో యంత్రాంగం పూర్తి స్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పనలో నిమగ్నమయ్యా రు. ఉదయం నుండి భక్తుల రద్దీ కొనసాగుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సౌకర్యాలు పర్యవేక్షణ చేస్తూ వాకి టాకీ ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడా రహదారులు బురదమయం కాగా ఎ లాంటి ఇబ్బంది పడకుండా పిఆర్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా స్టోన్ డస్ట్ వేయాలన్న ఆదేశాల సిబ్బంది స్టోన్‌డస్ట్ వేస్తున్నారు. పుష్కర స్నానాలకు విచ్చేయు భక్తులు జిల్లా యంత్రాంగపు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణులు ఎక్కువ రద్దీ సమయాల్లో పుణ్యస్నానాలు చేయు సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని,భక్తులు బారికేడింగ్ దాటి త్రివేణి సంగమంలోకి వెళ్ళకూడదని సూచించారు. నిర్దేశించిన ప్రాంతంలోనే భక్తులు పుష్కర స్నానాలు ఆచరించాలని, ఏదేని అస్వస్థతకు గురైతే తక్షణమే సమీపంలోని వైద్య కేంద్రంలో వైద్య సేవలు తీసుకోవాలి. అధిక రద్దీ కారణంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడే అవకాశముండటంతో ఉచిత రవాణా సేవలు వినియోగించుకుని భక్తులు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**అత్యవసర సేవలకు అంబులెన్స్‌లు అందుబాటులో.. కలెక్టర్ రాహుల్ శర్మ**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ స్వామి దర్శనానికి క్యూ లైన్ ఉన్న భక్తులతో మాట్లాడారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మూర్ఛ వచ్చి పడిపోగా, భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయిన సందర్భంగా తక్షణమే తక్షణ వైద్య సేవలు అందించడానికి వీలుగా దేవాలయంలో అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని వాకి టాకీ ద్వారా వైద్యాధికారులను ఆదేశించారు. దేవాలయం వద్ద భక్తుల రద్దీ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులకు తక్షణ వైద్యసహాయం అందించేలా అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న మూడు రోజులు భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవడం అనివార్యమని తెలిపారు. భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయం సమీపంలో అంబులెన్స్‌ను 24 గంటల పాటు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. అదేవిధంగా, అత్యవసర వైద్య సేవలకు అవసరమయ్యే వైద్య సిబ్బంది, మందులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నామని, మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి లోనవ్వకుండా ఉండేందుకు అధికారులు వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మూర్ఛ, కళ్ళు తిరిగి పడిపోయిన మహిళను హుటాహుటిన వైద్య సేవలకు తరలించడం పట్ల సిబ్బందిని అభినందించారు.

# క్రీడ

## టాస్ గెలిచిన ఢిల్లీ..

### పంజాబ్‌కు తిప్పలు తప్పవా!



పంజాబ్ కింగ్స్‌ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ షురూ అయింది. సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోరులో టాస్ నెగ్గిన డీసీ కెప్టెన్ అక్షర్ పటేల్ మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో అయ్యర్ సేన తొలుత బ్యాటింగ్‌కు దిగనుంది. ఈ మ్యాచ్ కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో పెద్దగా మార్పులు చేయలేదు పంజాబ్. స్టార్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్‌ను తుదిజట్టులోకి తీసుకున్నారు. మిచెల్ ఓవెన్ స్థానంలో అతడ్ని రీప్లేస్ చేశారు. అలాగే ప్రధాన స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌కు బదులు హర్‌ప్రీత్ బ్రార్‌ను ప్లేయింగ్ ఎలెవ్‌లోని తీసుకున్నారు. మిగతా వాళ్లంతా రాజస్థాన్‌తో పోరులో ఆడినవాళ్లే.

**రాహుల్-అక్షర్ లేకుండానే..**

ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన ఢిల్లీ క్యాపిటల్స్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో పలు కీలక మార్పులు చేసింది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు విశ్రాంతిని ఇచ్చింది. అతడి స్థానంలో యంగ్ బ్యాటర్ సెదీఖుల్లా అటల్‌ను రీప్లేస్ చేసింది. ఈసారి కరుణ్ నాయర్‌ను నేరుగా తుదిజట్టులోకి తీసుకుంది. రెగ్యులర్ కెప్టెన్ అక్షర్ పటేల్ కూడా ఈ పోరులో బరిలోకి దిగడం లేదు. అతడికి బదులు ఓపెనర్, సీనియర్ బ్యాటర్ ఫాఫ్ డుప్లెసిస్ తాత్కాలిక సారథిగా వ్యవహరిస్తున్నాడు. డీసీ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఇవే కీలక మార్పులు. కాగా, టాస్ ఓడిన పంజాబ్‌కు ఈ మ్యాచ్‌లో గెలుపు చాలా అవసరం. పాయింట్స్ టాప్ 2లో ఫినిష్ చేయాలంటే నెగ్గక తప్పని పరిస్థితి. దీంతో మొదట భారీ టార్గెట్ సెట్ చేయాలని చూస్తోంది. అయితే ఏమీ కోల్పోని స్థితిలో ఉన్న డీసీ బౌలర్లు చెలరేగి బౌలింగ్ చేస్తే అయ్యర్ సేనకు కష్టాలు తప్పవు.

## శుభ్‌మన్ గిల్‌కే టెస్టు పగ్గాలు

### ఇంగ్లాండ్ పర్యటన జట్టు పర్యటన



భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ప్రారంభమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బిసిసిఐ ఎంపిక చేసింది. అందరూ భావించినట్లుగానే టెస్టు జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కు అప్పగించింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా జట్టును బిసిసిఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను తీసుకుంది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.

**టీమ్ ఇండియా జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.

**కోహ్లి స్థానంలో ఆ ఇద్దరిలో ఒకరు..**

సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌తోనే టెస్టుల్లో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇక, కరుణ్ నాయర్ 8 ఏళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అడుగుపెడుతున్నాడు. చివరిసారిగా అతడు 2017 మార్చిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. టెస్టు ఫార్మాట్‌కు కోహ్లి రిటైర్మెంట్ ఇవ్వడంతో నంబరు 3లో ఎవరు వస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆ స్థానంలో సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్‌ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న షమీతో పాటు శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో చోటు దక్కలేదు.

## పాటిదార్‌కు షాక్..

### రూ.24లక్షల జరిమానా విధించిన ఐపిఎల్ పరిపాలన..!

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమిపాలైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ రజత్ పాటిదార్‌కు రూ.24లక్షల జరిమానా విధించారు. సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు సైతం స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి.. తొలిసారిగా స్లో ఓవర్‌రేట్ రావడంతో కేవలం రూ.12లక్షల జరిమానా విధించారు. నిర్ణీత ఓవర్ల కోటాను సమయంలోగా వేయకపోవడంతో ఇది రెండోసారి. దాంతో రజత్ పాటిదార్‌కు ఐపీఎల్ పరిపాలన రూ.24లక్షల జరిమానా విధించింది. ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా మిగిలిన ప్లేయింగ్ పదకొండు మంది సభ్యులకు వ్యక్తిగతంగా రూ.6 లక్షలు.. లేదంటే మ్యాచ్ ఫీజులో 25 శాతం, ఏది తక్కువైతే అది జరిమానాగా విధించనున్నట్లు తెలిపింది. షాకింగ్ విజయం ఏంటంటే.. ఆర్‌సీబీ జట్టు ముందుగా బౌలింగ్ చేసింది. ఈ మ్యాచ్‌లో రజత్ కాకుండా.. జితేశ్



శర్మ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రజత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చాడు. అయినా ఈ మ్యాచ్‌లో రూ.24లక్షల జరిమానా విధించారు. రెగ్యులర్ కెప్టెన్ పాటిదార్ కావడంతో జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.
ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు రూ.12లక్షల జరిమానా విధించారు. సన్‌రైజర్స్ ఇప్పటికే ఐపీఎల్ ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. ఆర్‌సీబీ ప్లేఆఫ్‌లోకి దూసుకెళ్లింది. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 42 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఐపీఎల్ చివరి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ ఈ నెల 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనున్నది.
ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసిన ఎస్ఆర్‌హెచ్.. ఆ తర్వాత 19.5 ఓవర్లలోనే 189 పరుగులకు ఆర్‌సీబీని ఆల్ అవుట్ చేసింది. సన్‌రైజర్స్‌పై ఓటమితో ఆర్‌సీబీ పాయింట్ల పట్టికలో తొలి రెండుస్థానాలకు చేరుకోవడం కష్టంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 94 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచులో ఇషాన్ ఏడు ఫోర్లు, ఐదు సిక్సర్లు బాదాడు.

## థియేటర్ల బంద్ లేదు

### ఫిల్మ్ ఛాంబర్



జూన్ 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ ఏమీ ఉండదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. థియేటర్లకు కూడా పర్సంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వివరాలను ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ వెల్లడించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ''థియేటర్ల బంద్ అనేది తప్పుగా చిత్రీకరించారు. చర్చలు జరగకపోతే, జూన్ 1వ తేదీ నుంచి అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నది మాత్రమే నిజం. కానీ, అందరూ థియేటర్లు మూసివేస్తారన్న సమాచారాన్నే ప్రచారం చేశారు. ప్రస్తుతం అలాంటిదేమీ లేదు. కేవలం ఒక్క సినిమాను దృష్టిలో పెట్టుకుని థియేటర్లను బంద్ చేస్తున్నామనడం సరికాదు.
కొన్ని వార్తలు బిజినెస్‌ను దెబ్బతీస్తాయి. చిత్ర పరిశ్రమలో వంద సమస్యలు ఉన్నాయి. అన్నీ ఒకదానితో ఒకటి కనెక్ట్ అయి ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ రావాలి. థియేటర్ల పర్సంటేజీ విషయమై కొన్నేళ్లుగా ఎలాంటి చర్చ జరగలేదు. ప్రస్తుతం జరుగుతోంది. తర్వాత రోడ్ మ్యాప్ ఏంటనేది నిర్ణయిస్తాం. మూడు సెక్టార్ల నుంచి కమిటీ వేస్తున్నాం. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించుకుంటాం. ఈనెల 30న జరిగే సమావేశంలో కమిటీ ఎవరనేది నిర్ణయిస్తాం'' ''థియేటర్ల బంద్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్, దాని ప్రతినిధుల నుంచి వచ్చే సమాచారమే అధీకృతం. దానికి మేము సమాధానాలు చెబుతాం. ఎవరెవరి దగ్గరి నుంచో మీడియా అభిప్రాయాలు తీసుకుని ఎవరి వెర్షన్ వారు రాసుకుని వార్తలు ప్రసారం చేస్తున్నారు.

# రీల్




## 'డెకాయిట్' ఆడియో హక్కులు!

మన టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో అడివి శేష్ హీరోగా మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా దర్శకుడు షానియేల్ డియో తెరకెక్కిస్తున్న సాలిడ్ లవ్ అండ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమే డెకాయిట్. అయితే ఎపుడు నుంచో తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. మరి ఇలా సినిమా టీజర్ వీడియో రాబోతుండగా దీనికి ముందు ఈ చిత్రం తాలూకా ఆడియో హక్కులపై సాలిడ్ ఇన్ఫో బయటకి వచ్చింది. దీనితో ఈ సినిమా ఆడియో హక్కులు సోనీ మ్యూజిక్ వారు సొంతం చేసుకోవడం ఒకెత్తు అయితే ఏకంగా 8కోట్లు ఈ సినిమా ఆడియో హక్కులకు చెల్లించడం మరొక ఎత్తు అని చెప్పాలి. అలాగే ఈ చిత్రానికి ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండడం విశేషం. సో ఈ ఫ్యాక్టర్ కూడా ఒక కారణం కావచ్చు. ఇక ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, ఎస్ఎస్ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తుండగా త్వరలోనే విడుదల కానుంది.



## ప్రభాస్ అనుకున్నంత సైలెంట్ కాదు..

### మాళవిక మోహనన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌పై యువ నటి మాళవిక మోహనన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బయట కనిపించే ప్రభాస్ ఇమేజ్‌కు భిన్నంగా ఆయన వ్యక్తిత్వం ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజా సాబ్' చిత్రంలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ, ప్రభాస్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మాళవిక మోహనన్ ఇటీవల సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ, ప్రభాస్‌తో తన అనుభవాలను పంచుకున్నారు. నేను ప్రభాస్ సార్‌ను కలవడానికి ముందు ఆయన ఇంటర్వ్యూలు చూసినప్పుడు చాలా సైలెంట్‌గా, రిజర్వ్డ్‌గా ఉంటారని అనుకున్నాను. కానీ ఆయనను స్వయంగా కలిసినప్పుడు మంచి మాటకారి, సూపర్ ఫన్, ఫన్నీ అని అర్థమైంది అని మాళవిక తెలిపారు. ప్రభాస్‌తో సమయం గడపడానికి చాలా చక్కని వ్యక్తులలో ఒకరని, ఆయన చుట్టూ ఎప్పుడూ బోరింగ్ క్షణమే ఉండదని ఆమె ప్రశంసించారు.

## 'కుబేర' టీజర్ రిలీజ్‌కి టైం ఖరారు!




కోలీవుడ్ వెర్సటైల్ హీరో ధనుష్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా మన టాలీవుడ్ మ్యాజికల్ దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రమే కుబేర. మరి కింగ్ నాగార్జున కూడా సాలిడ్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం నుంచి అవైటెడ్ టీజర్‌ని విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మే 25న డేట్‌ని ఖరారు చేసిన మేకర్స్ ఇపుడు ఈ ట్రాన్స్ టీజర్ రిలీజ్‌కి సమయాన్ని కూడా ఖరారు చేసేసారు. దీనితో కుబేర టీజర్ రేపు సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకి వస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు. మరి ఈ టీజర్‌లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన స్కోర్ బిగ్గెస్ట్ హైలైట్‌గా నిలుస్తుంది అని తెలుస్తుంది. దీనితో ఈ టీజర్ చూడాలని ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## మారుపేరు గిరిప్రసాద్

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ తేల్చి చెప్పారు. సిద్ధాంతాన్ని ఆచరిస్తున్న కొంత మందిని హత్య చేయడం సాధ్యమేమో కాని సిద్ధాంతాన్ని చంపేయడం అంత తేలిక కాదని అదే సమయంలో మావోయిస్టులు సైతం తమ పంథాను మార్చుకోవాలన్నారు. నాడు సాయుధ పోరాటంలో వేల మందిని హతమార్చారని గిరిప్రసాద్‌ను సైతం హతమార్చాలని ప్రయత్నించినప్పుడు తుపాకీ గుండుకు ఎదురొడ్డి నిలిచారని నారాయణ తెలిపారు. ఈ దేశంలో టెర్రరిస్టుల పట్ల మోడీ మెతక వైఖరిని అవలంబిస్తూ మావోయిస్టుల విషయంలో మాత్రం సరిహద్దు సైన్యాలను దింపి అంతమొందించాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మేము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా ఎందుకు చర్చలు జరపడం లేదన్నారు. ఈ దేశంలో కులగణన 2029 నాటికి పూర్తి చేయాలని, చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు. ఒకపక్క పన్నుల భారం మోపుతూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మరో పక్క గుజరాత్‌కు చెందిన ఆర్థిక టెర్రరిస్టులు రూ.16లక్షల కోట్లు ఎగవేస్తే ఈ మోడీ ప్రభుత్వం ఏమి చేసిందన్నారు. 29 మంది ఆర్థిక టెర్రరిస్టుల్లో 28 మంది గుజరాత్ వారేనని అందులో ఏడుగురు మోడీ ఇంటి పేరు కలిగిన వారేనని నారాయణ తెలిపారు. రాజకీయం వ్యాపారమైందని రాజకీయ పార్టీల్లో అంతర్గత విబేధాలను సృష్టించి లబ్ది పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష ఉద్యమం బలపడాలని నారాయణ పిలుపునిచ్చారు.

**మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా : కూనంనేని**

మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా, శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదని సిపిఐ రాష్ట్ర






కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని బిజెపి ప్రభుత్వం హతమారుస్తుందని ఆయన ఆరోపించారు. నాడు నైజం రక్కసి మూకలు ఐదువేల మందిని హతమార్చారని నాడు నిజాం ప్రభుత్వం ఏవిధంగా పట్టుకొచ్చికాల్చి చంపిందో ఇప్పుడు బిజెపి ప్రభుత్వం అదే పంథాను అనుసరిస్తుందన్నారు. నేరస్తులు, ఆర్థిక అరాచకవాదులు సమాజంలో పెద్ద మనుషులుగా చెలమణి అవుతుంటే ప్రశ్నించే వారు ఏదో ఒక రూపంలో చంపబడటమో, జైళ్లలో ఉండటమో జరుగుతుందని ఆయన తెలిపారు. అమిత్‌షా దాహం ఎంత మందిని చంపితే తీరుతుందని కూనంనేని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదంటున్నారని పని చేయాలనుకున్న ఆలోచనను, సిద్ధాంతాన్ని చంపేయడం ఎవరి తరం కాదన్నారు. కా॥ గిరిప్రసాద్ లాంటి అనేక మంది యోధుల వారసత్వంతో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కూనంనేని పిలుపునిచ్చారు. ఈ దేశ శత్రువులతో పోరాటం సాగించలేని పాక్ అక్రమిత కశ్మీర్‌ను దేశంలో విలీనం చేయలేని మోడీ తన సైన్యాలతో మధ్య భారతంలో ఆదివాసీలపై అంతర్గత యుద్ధం చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ చైతన్యానికి ప్రతీక అని ఈ గడ్డపైన మతోన్మాదానికి, కుల మత రాజకీయాలకు స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. డిసెంబరు 26న భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని ఐదు లక్షల మందితో ఖమ్మంలో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో చూపాలని ఆయన కోరారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో పోరాటాల్లో కాస్త వెనుకబడినా మరోసారి జూలు విదిల్చి ప్రజల పక్షాన పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలే అమరులకు సరైన నివాళి అని ఆయన తెలిపారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు ప్రసంగించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ములజితేందర్‌రెడ్డి, మిరియాల రంగయ్య, యర్రాబాబు, గిరిప్రసాద్ తనయుడు నల్లమల చక్రవర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సభకు ముందు కా॥ గిరిప్రసాద్ సహా అమరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## సిస్టర్ స్ట్రోక్‌తో కెటిఆర్ చిన్న మెదుడు చితికింది

### కవిత చెప్పిన దెయ్యం కెటిఆరేనా : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిస్టర్ స్ట్రోక్‌తో కెటిఆర్ చిన్న మెదడు చితికిందని, అందుకే ఆయన ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. కెటిఆర్ భవిష్యత్తులో ఎన్నో రాజకీయ స్ట్రోక్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కవిత చెప్పిన దెయ్యం కెటిఆరేనా అని అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం విషయంలో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం, కమిషన్ ముందుకు రావడానికి మాత్రం ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణను కప్పిపుచ్చుకునేందుకే పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ పార్టీ బాంబులు పెట్టిందని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఈ విషయాన్ని అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నిరూపించాలేదో కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అబద్దాల పునాదులపైన వాస్తవాలను కప్పిపుచ్చేందుకు కెటిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అబద్ధ లను ప్రచారం చేయడంలో కెటిఆర్ గొబెల్స్‌ను మించిపోయారని, ఇందుకు కెటిఆర్‌కు గ్లోబల్స్ అబద్దాలకు గ్లోబల్ అవార్డు ఇవ్వాలి సీతక్క ఎద్దేవా చేశారు. కెటిఆర్ ప్రతిపక్ష హోదాకు కూడా పనికిరారన్నారు. రాహుల్ గాంధీని ఉద్దేశించిమాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని అన్నారు. కెసిఆర్ కుటుంబానికి దోచుకునీ, దాచుకునే చరిత్ర ఉన్నదన్నారు. సిస్టర్ స్ట్రోక్ తో బాధపడుతున్న



కెటిఆర్, ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కుటుంబాన్ని,సిఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఏదో మాట్లాడుతూ శునకానందం పొందుతున్నారని సీతక్క అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఎక్కడ కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని, పిసిసి అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ పత్రిక, స్వతంత్ర ఉద్యమ గొంతుక కోసం తన వంతు సహాయం చేశారని వివరించారు. అధికార పదవిలో లేని సమయంలో అధికార దుర్వినియోగం ఎక్కడ జరిగిందో ఇడి చెప్పాలని, నేషనల్ హెరాల్డ్ కేసులో మనీలాండరింగ్ జరగలేదని, ఫెమా చట్టం ఉల్లంగించలేదని, ఆర్థిక అవకతవకలు లేవని, అలాంటప్పుడు ఇడి ఎలా ప్రవేశిస్తుందని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

## జోడెద్దుల్లా నడిపిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

రాకాసి తండా, పాతర్లపాడు, మహ్మదాపురం, తెట్టెలపాడు గ్రామాల్లో సిసి రోడ్లు, బిటి రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్ల పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని, రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6500కోట్ల వడ్డీలు కడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రూ.500 గ్యాస్ సబ్సిడీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, రైతులకు ధాన్యం బోనస్ రూ.500, నిరుద్యోగులకు రాజీవ్ వికాసంతో స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. భూ భారతితో రైతుల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి భూ సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలోఎక్కడ చిన్న పొరపాటు లేకుండా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. పాలేరు నియోజకవర్గంలో సీతారామ ఎత్తిపోతలతో డోర్నకల్ మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించి పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పాలేరు రిజర్వాయర్‌ను గరిష్ట మట్టానికి ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు. మున్నే వరదను పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించేందుకు రూ.162.54కోట్లు నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని రాకాసి తండా నుండి మన్నెగూడెం వరకు రూ.375లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, పాతర్లపాడు క్రాస్ రోడ్డు నుండి రావిచెట్టు తండా రోడ్డు వరకు రూ.27కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు, మహ్మదాపురంలో బోడదంత నుండి సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు నుండి భవాని గుడి వరకు రూ.315లక్షలతో బిటి రోడ్డు, తెట్టెలపాడు గ్రామంలో ఏడు అంతర్గత సిసి రోడ్లు, గోపాలపురం నుండి జల్లేపల్లి వరకు రూ.38కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు, చిన్న పోచారం నుండి కృష్ణాపురం తాళ్ళ చెరువు జెడ్పి రోడ్డు వరకు రూ.280లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ల చెరువు గ్రామంలో సూర్యాపేట అశ్వారావుపేట రోడ్డు నందు రూ.50లక్షలతో సిసి డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్‌ఇ యాకుబ్, పిఆర్ ఎస్‌ఇ వెంకట్‌రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, ఎడిఎ సరతి, భారీ నీటిపారుదల శాఖ డిఇ బాణాల రమేష్‌రెడ్డి, తహశీల్దార్ లూథర్ విల్సన్, ఎండిపిడో సిలార్ సాహెబ్, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మర్యాద ఇవ్వండి (మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య కమిషనర్ మారోస్ సెఫ్‌కోవిక్ శనివారంనాడు హెచ్చరిక చేశారు. కూటమిలోని 27 దేశాల ప్రయోజనాలు కాపాడుకోవడంకోసం యూనియన్ కట్టుబడి ఉందని ఆయన అన్నారు. మొదట ట్రంప్ అమెరికా—ఇ యు మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇ యు నుండి వచ్చే దిగుమతులపై జూన్ ఒకటో తేదీ నుండి యాభైశాతం సుంకాలు విధిస్తామని ప్రకటించడంతో యూరోపియన్ యూనియన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికాకు ఇ యు అతిపెద్ద వాణిజ్యభాగస్వామి. గత ఏడాది ఇ యునుండి 600 బిలియన్ డాలర్లు విలువైన వస్తువులు అమెరికాకు ఎగుమతి కాగా, అమెరికా నుండి ఇ యు 370 బిలియన్ డాలర్లు విలువైన వస్తువులను కొనుగోలు చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పంద భద్రతను కూటమి దేశాలు కోరుకుంటున్నాయనీ, కానీ ఈ విధంగా బెదిరింపు ధోరణులతో కాకుండా, పరస్పర మర్యాద, గౌరవం ప్రాతిపదికపై వాణిజ్య ఒప్పంద భద్రతకు కట్టుబడి ఉన్నాయని అన్నారు. చైనాపై కూడా అనూహ్యస్థాయిలో 145 శాతం పైగా సుంకాలు విధిస్తున్నట్లు విడతల వారీగా ట్రంప్ హెచ్చరికలు జారీ చేసినప్పుడు చైనా ప్రభుత్వం కూడా ఇదేవిధంగా ప్రతి హెచ్చరిక చేసింది. బెదిరింపులకు లొంగేదిలేదనీ, పరస్పర గౌరవం, పరస్పర వాణిజ్య ప్రయోజనాలను తాము కోరుతున్నామని అనేకసార్లు ట్రంప్‌కు చైనా హెచ్చరించి తర్వాత ఆయన మెత్తబడి దిగివచ్చారు. ఇప్పుడు యూరోపియన్ యూనియన్ కూడా అదే దారి ఎంచుకుంది. ఇప్పటివరకూ ట్రంప్ బెదిరింపులను తట్టుకుని నిలబడి ముఖాముఖీగా అమెరికాను ఢీకున్న దేశం చైనా ఒక్కటే. యూరోపియన్ యూనియన్‌తో చేస్తున్న వాణిజ్య సంప్రదింపులను నిలిపివేస్తామని, వారి దిగుమతులపై 50 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరిక చేశాక అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్, వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌లతో టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఇ యు వాణిజ్య కమిషనర్ సెఫ్‌కోవిక్ శనివారంనాడు ఎదురుహెచ్చరిక చేశారు. అదేవిధంగా, ఫ్రాన్స్,జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల నాయకులు స్పందిస్తూ, ఒక పరిష్కారం సాధించేందుకు కూటమి దేశాలు కృషిచేస్తాయన్నారు.

## అవినీతి!

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత హేయమైన చర్య. సిడిపిఓల ఈ దుశ్చర్య వారి అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా నిలుస్తోంది. ప్రభుత్వం శ్రీమంతం వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.12,000 ఇస్తుంటే, అదనంగా రూ.2000 ఎందుకు వసూలు చేస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు, డబ్బు ఇవ్వని టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మరింత దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. తమ హక్కుల కోసం నిలబడే వారిని బెదిరించడం,వేధించడం ద్వారా వ్యవస్థలో నిశ్శబ్దాన్ని నెలకొల్పాలని చూడటం నియంతృత్వ పోకడలను తలపిస్తోంది. ఈ సంఘటన నిర్మల్ జిల్లాలోని అంగన్వాడి వ్యవస్థలో నెలకొన్న అవినీతి,అక్రమాల యొక్క తీవ్రతను తెలియజేస్తోంది. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమేనా లేక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి దందా కొనసాగుతోందా అనే విషయమై డిపార్ట్‌మెంటు దర్యాప్తు జరపాలి. అంగన్వాడి టీచర్లకు పూర్తి భద్రత కల్పించాలి, వారి ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకతను పెంచడంతో పాటు, నిధులు నేరుగా లబ్ధిదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని, అంగన్వాడి వ్యవస్థను అవినీతి రహితంగా మార్చడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి.

**ఖానాపూర్ సిడిపిఓపై చర్యలేవి..**

ఖానాపూర్ సిడిపిఓ అవినీతికి పాల్పడుతూ అంగన్వాడీ టీచర్లను వేధింపులకు గురి చేస్తున్నారని పూర్తి ఆధారాలు ఇవ్వగా, ఏడాదిన్నర నుండి విచారణ పేరుతో నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందని ప్రజా సంఘాలు వారానికి ఒకసారి కలెక్టర్కు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదు. అంగన్వాడి టీచర్లపై వేధింపులు ఎక్కువయ్యాయని, టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సంఘాలు, అంగన్వాడీ యూనియన్లు,కలెక్టరేట్ ముందు ధర్నాలు నిర్వహించిన నిందితులను సస్పెండ్ చేయకపోవడం పలు అనుమానాలు తావిస్తుంది.

**అంగన్వాడి టీచర్లను వేధింపులు వాస్తవమే..!**

గతంలో కూడా ఖానాపూర్ నియోజకవర్గంలో అంగన్వాడి టీచర్ల వద్ద నుండి వసూళ్ళు చేసింది నిజమే. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని, చాలీచాలని వేతనంతో ఉద్యోగం చేస్తున్నామని, దీనిపై అనేకసార్లు జిల్లా అధికారులకు,కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. అయినా అవినీతి ఆగడం లేదని జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మక్క అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com